

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



మోదీ ప్రభుత్వం నుంచే రాజ్యాంగానికి ప్రమాదం

విభేదాలను బయటపెట్టిన నాటో సంక్షిప్త ప్రకటన!

బిఆర్ఎస్‌పై 'స్థానిక' పిడుగు : లోకల్ 'బాడీ బిల్డర్' ఎవరో!

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 207 | శుక్రవారం | 27 -06-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## అంతరిక్ష కేంద్రంలోకి తొలి భారతీయుడు

చరిత్ర సృష్టించిన శుభాంశు

విజయవంతంగా డాకింగ్



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి ప్రవేశించిన మొట్టమొదటి భారతీయుడుగా శుభాంశు శుక్లా చరిత్ర సృష్టించారు. ఆక్సియం–4 మిషన్‌లో భాగంగా 28 గంటల ప్రయాణం తర్వాత డ్రాగన్ నౌక భారత కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 4.03 గంటలకు విజయవంతంగా ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. 12 నిమిషాల తర్వాత 4.15 గంటలకు అంతరిక్ష నౌక అనుసంధాన ప్రక్రియ (డాకింగ్) విజయవంతంగా పూర్తయింది. శుక్లాతోసహా నలుగురు వ్యోమగాములు ప్రయాణించిన అంతరిక్ష నౌక ఐ ఎస్ ఎస్‌కు చేరువు అవుతున్న ప్రత్యక్ష దృశ్యాలను నాసా ప్రసారం చేసింది. డ్రాగన్‌నౌకల సిరీస్‌లో ఐదవదైన ఈ కొత్త అంతరిక్ష నౌక ఐఎస్ఎస్‌కు అనుసంధానమై అన్ని లాంఛనాలు పూర్తయిన కొద్దిసేపటికే నలుగురు వ్యోమగాములూ అంతరిక్షకేంద్రంలోకి ప్రవేశించారు. అవతలివైపు తలుపువద్ద ముగ్గురు వ్యోమగాములు పరస్పర ఆలింగనాలతో వారికి ఘన స్వాగతం పలికారు. భార రహిత స్థితిలో గాలిలో తేలియాడుతూ, వ్యోమగాములు ఆలింగనాలు చేసుకుంటున్నప్పుడు మరో వ్యోమగామి కెమెరాతో వారిని ఫోటోలు తీస్తున్న దృశ్యాల వీడియోను నాసా విడుదల చేసింది. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రైవేటురంగంలో ఇప్పటివరకూ ఇలా నాలుగు తరువాయి 2లో






# డ్రగ్స్‌పై ఉద్యమం

- యువతకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- మాదకద్రవ్యాల బారిన పడడం బాధాకరమని ఆవేదన
- ఉద్యమం తెలంగాణ యువత రక్తంలోనే ఉంది
- డ్రగ్స్‌పై మళ్లీ ఉద్యమం చేయాల్సిన అవసరం ఏర్పడింది
- మేము అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపం
- అంతర్జాతీయ యాంటీ డ్రగ్, ఇల్లీగల్ ట్రాఫికింగ్‌డే అవగాహన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్

డ్రగ్స్ మహమ్మారిపై యువత ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైనదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో గురువారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిన్యాబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ యాంటీ డ్రగ్, ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే' అవగాహన కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "నిజాంలకు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన వీరులు పుట్టిన గడ్డ ఇది. ఆ పోరాట స్ఫూర్తి నుంచే తెలంగాణ ఉద్యమం మొదలైంది. ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సిన తెలంగాణ రాష్ట్ర యువత డ్రగ్స్ మహమ్మారికి బలవడం న్యాయమా?" అని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సిన తెలంగాణ యువత డ్రగ్స్ బారిన పడటం బాధాకరమైన విషయం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులు, ప్రజల ఉద్యమ ఫలితమే తెలంగాణ సాధన అని అన్నారు. అలాంటి తెలంగాణ యువత డ్రగ్స్ బారిన పడినట్లు వస్తోన్న వార్తలు చూస్తుంటే తట్టుకోలేకపోతున్నామని ఆవేదన చెందారు. ఉద్యమం తరువాయి 2లో

## ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం తీపి కబురు

- 27 నెలల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు
- ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్న సర్కార్






ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది. ఇటీవల ఉద్యోగులకు రెండు డిఎలను ప్రకటించిన ప్రభుత్వం తాజాగా పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను కూడా విడుదల చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాలం 2023, మార్చి4వ మొదలుకొని ఈ నెల 20వ తేదీ వరకు పెండింగ్‌లో రూ.180.38 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో 26,519 మందికి తరువాయి 2లో

## రాజ్యాంగమే అత్యున్నతమైనది


- భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ స్పష్టీకరణ
- మూడు విభాగాలూ రాజ్యాంగం కిందే పనిచేస్తాయని వెల్లడి
- సిజెఐకి స్వస్థలంలో సన్మానం



**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగమే అత్యున్నతమైనదని, మిగతా మూడు విభాగాలు కూడా దాని కిందే పనిచేస్తాయని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ స్పష్టం చేశారు. 'ప్రాథమిక నిర్మాణం' సిద్ధాంతం పునాదిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పార్లమెంట్‌కు సవరించే అధికారం ఉందని స్పష్టం చేశారు. కానీ రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణాన్ని మాత్రం మార్చలేమని సిజెఐ తెలిపారు. గత నెల 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన బిఆర్.గవాయ్‌కి బుధవారం ఆయన స్వస్థలం తూర్పు అమరావతి నగరంలో సత్కారం తరువాయి 2లో

## ఆర్‌టిఎ, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఎసిబి ఆకస్మిక దాడులు

- సోదాల్లో వెలుగుచూసిన అవకతవకలు
- లెక్కల్లోలేని రూ.1,81,030 స్వాధీనం





ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిఎ కార్యాలయాలు, చెక్‌పోస్టులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) డిజి విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సోదాల సందర్భంగా సలాబత్‌పూర్ ఆర్‌టిఎ చెక్‌పోస్ట్, కామారెడ్డి, పెద్దపల్లి, తిరుమల్‌గిరి, ఉప్పల్‌లోని ఆర్‌టిఎ కార్యాలయాలపై ఎసిబి దాడులు నిర్వహించింది. తనిఖీల్లో లెక్కల్లో లేని రూ.1,81,030 స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యాలయాల్లో అవకతవకలు కూడా కనిపించాయి. ఖమ్మం జిల్లా తరువాయి 2లో

## అబూజ్మడ్‌లో ఇద్దరు నక్సల్స్ ఎన్‌కౌంటర్

ప్రజాపక్షం/భద్రాచలం





ఛత్తీస్‌గఢ్‌లో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కుతుల్ ఏరియా కమిటీ సభ్యురాలు (ఏసిఎం) సీమా, కుతుల్ ఏరియా స్థానిక సంస్థ స్కాడ్ (ఎల్ఓఎస్) లింగే అలియాస్ రంఝుగా అనే ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఆ రాష్ట్రంలోని అబూజ్మడ్ ఏరియాలో ఉమ్మడి బలగాలు మావోయిస్టుల కోసం కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ వారికి తారసపడటంతో లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ తరువాయి 2లో

## ఫోన్ టాపింగ్ కేసు సిబిఐకి అప్పగించాలి



- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి
- పసుపుబోర్డుతో రైతుల ఆకాంక్ష నెరవేరిందని వెల్లడి
- 29న పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభిస్తామని స్పష్టీకరణ

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి


ఫోన్ టాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. అనేక రాజకీయ పార్టీలు హామీనిచ్చినా ఎంపి అరవింద్ కృషితో పిఎం మోడీ ఆశీస్సులు ఆదేశాలతో పసుపు బోర్డు ఏర్పాటు జరిగిందన్నారు. నిజామాబాద్ నగరంలోని బిజెపి కార్యాలయంలో ఎంపి అరవింద్ గురువారం పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ పిసిసి చీఫ్‌గా ఉన్నప్పుడు పదే పదే ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ తరువాయి 12లో



## అమెరికా మొహంపై చెంపదెబ్బ కొట్టాం

- మళ్ళీ దాడిచేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే
- వీడియో సందేశంలో శత్రువులకు ఖమేనీ హెచ్చరిక
- యుద్ధం ద్వారా అగ్రరాజ్యం సాధించింది ఏమీలేదని విమర్శ

**టెహ్రాన్ :** ఇజ్రాయెల్‌పై విజయం సాధించామని ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ (86) ప్రకటించారు. యుద్ధం తర్వాత మొదటిసారి గురువారంనాడు ఆయన ప్రభుత్వ టెలివిజన్‌లో కనిపించారు. దేశ ప్రజలకు శుభాభినందనలు తెలియజేశారు. ఈ యుద్ధం ద్వారా అమెరికా మొహం మీద ఇరాన్ చెప్పదెబ్బ కొట్టిందని చెబుతూ, తదుపరి దాడులను సహించబోమని హెచ్చరించారు. "భవిష్యత్‌లో ఇలాంటి దాడులు పునరావృతమైతే ఈ ప్రాంతంలో అమెరికా కీలక స్థావరాలన్నీ ఇరాన్‌కు అందుబాటులోనే ఉన్నాయని గుర్తుచేస్తూ, అవసరం అనుకుంటే వాటిపై దాడులు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఏదైనా దురాక్రమణ జరిగితే శత్రువు ఇక ఖచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ యుద్ధం ద్వారా అమెరికా సాధించినదేమీలేదని విమర్శించారు. "నా ఉద్దేశం ప్రకారం, అమెరికా జోక్యం లేకపోతే యూదు మత ప్రభుత్వం సంపూర్ణంగా నాశనమైపోయేది, ఆ కారణంతోనే అమెరికా ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంది" అని చెప్పారు. ఇరాన్ ఎవ్వరికీ తలవంచదంటూ జూన్ 19వ తేదీన అజ్ఞాత ప్రదేశం నుండి వీడియో సందేశం విడుదల చేసిన ఖమేనీ 12 రోజుల యుద్ధానంతరం కాల్పుల విరమణ చేశాక అదే తరహాలో వీడియో సందేశం విడుదల చేశారు. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ దీనిని ప్రసారం చేసింది. "ఎన్ని ఆర్భాటాలు, వాదనలు చేసినప్పటికీ ఇరాన్ దెబ్బకు యూదుమత ప్రభుత్వం అణచివేతకు గురైంది, జియోనిస్టు పాలన దాదాపు నాశనమైంది" అని పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందంలో ఖమేనీ ఎలాంటి పాత్ర వహించారన్న విషయం ఇప్పటివరకూ తెలియలేదు. ట్రంప్ కూడా తరువాయి 2లో




## వచ్చే వారం ఇరాన్‌తో అణు చర్చలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**హేగ్:** వచ్చేవారం ఇరాన్‌తో అమెరికా అణు ఒప్పందంపై సంప్రదింపులు చేస్తుందని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సోషల్ మీడియాలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం చాలా బాగా కొనసాగుతోందని ఆయన అన్నారు. "వచ్చేవారం ఇరాన్‌తో చర్చలు జరుపుతాం, ఒక ఒప్పందం కూడా చేసుకునే అవకాశం ఉంది" అని తరువాయి 2లో

## ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విషపురుగులు!



- పాములు, తేళ్లు తిరుగుతున్న వైనం
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు

ప్రజాపక్షం/చొప్పదండి

కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని సమీకృత బిసి సంక్షేమ వసతి గృహంలో సమస్యలు తిష్టవేశాయి. పురాతనమైన భవన సముదాయంలో ఉన్న వసతి గృహంలో విద్యార్థులకు దినదినగండమైన పరిస్థితులు నెలకొన్నాయి. హాస్టల్ సముదాయంలో పాములు, తేళ్లు వంటి విషపురుగులు తిరుగుతుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పేద విద్యార్థులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి ఈ హాస్టల్‌లో చేరుతుంటారు. ప్రవేశాల సమయంలోనే విద్యార్థులకు ముందస్తు భయాలు కలిగిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. గత కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న బిల్డింగులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొనగా ప్రమాదబరితంగా మారాయి. వర్షాకాలం నేపథ్యంలో మరింత ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పాత భవనాలలో తరువాయి 12లో

## 'ఉదయ సముద్రం' కాలువ పనులు త్వరితగతిన పూర్తి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్ ఆకస్మికంగా తనిఖీ

రైతులకు భూ పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచన

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి



ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంలోని బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్ కాల్వపనుల కోసం భూసేకరణను త్వరితగతిన పూర్తి చేస్తే నిధులు విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలం పరిధిలోని బ్రాహ్మణ వెల్లెంల గ్రామంలో ఉన్న ఉదయసముద్రం ప్రాజెక్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## గాజాలో దాడులు
### 51 మంది మృతి

**గాజా :** గాజాలో గురువారం ఉదయం నుండి జరిగిన దాడుల్లో 51 మంది పాలస్తీనియన్లుమరణించారు. ఉత్తర గాజాలో 14 మంది మరణించారు. ఎవ్వరు చెప్పినాగానీ ఐడిఎఫ్ దాడులు నిరాఘాటంగా గాజాలో కొనసాగుతున్నాయి. అమాయకులైన ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం కాల్చి చంపుతున్నది. గడచిన నెలా పదిహేను రోజులుగా ఆహారం కోసం వేచి ఉంటున్న ప్రజలపై సహాయ కేంద్రాల వద్ద ప్రతిరోజూ సైన్యం కాల్పులు జరుపుతున్నది. రోజూ కనీసం 15 మంది ఈ కాల్పుల్లో మరణిస్తున్నారు.
యుద్ధ విరామం తర్వాత మార్చి 18న గాజాలో ఇజ్రాయెల్ తిరిగి సైనిక దాడులు ప్రారంభించింది. అప్పటి నుండీ ఐదువేలమందికి పైగా పాలస్తీనా ప్రజలను ఐడిఎఫ్ కాల్చి చంపింది.

# విభేదాలను బయటపెట్టిన నాటో సంక్షిప్త ప్రకటన!

**ద హేగ్ :** నెదర్లాండ్ నగరం ద హేగ్‌లో రెండు రోజులపాటు అట్టహాసంగా జరిగిన నాటో కూటమి సభ్యదేశాల సదస్సు (జూన్ 24,25)చరిత్రలో ఎన్నడూలేనివిధంగా అతి సంక్షిప్త ఉమ్మడి తీర్మాన ప్రకటన విడుదల చేసింది. ఐదుశాతం రక్షణ వ్యయాలు పెంచాలని తీర్మానించినప్పటికీ, ఈ ప్రకటన ట్రాన్స్ అట్లాంటిక్ (అమెరికా–యూరప్ దేశాలు) దేశాలమధ్య పెరుగుతున్న చీలికలకు చిహ్నంగా నిపుణులు భావిస్తున్నారు. పీపుల్స్‌డైలీ పత్రిక ఈ విషయం వెల్లడించింది. యూరోపియన్ పాలసీ సెంటర్ (యూపిసి) సీనియర్ విజిటింగ్ ఫెలో పాల్ పదేళ్ళలో జిడిపిలో ఐదుశాతం లక్ష్య సాధనను ''అవాస్తవికం''గా అభివర్ణించారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి పెద్ద దేశాలు కూడా ఈ లక్ష్యాన్ని గడుపులోపు సాధించలేవన్నారు.
గత ఏడాది నాటో సదస్సు 44 పేరాలతో కలాహలమైన ప్రకటన చేసింది. యూరోప్‌లోని సభ్యదేశాలమధ్య కూడా నాటో నిర్దేశించిన లక్ష్యాల సాధనలో బలవంతపు సమ్మతి కనిపిస్తోందని నిపుణులు విమర్శిస్తున్నారు. యూరప్ భద్రతకు సంబంధించి ప్రధామ ప్రాధాన్యం ఇవ్వాలని నాటో సదస్సు నిర్ణయించింది. సైనిక రక్షణ వ్యయాన్ని ఐదూ శాతానికి పదేళ్ళలో పెంచాలన్న నిర్ణయం బాగానే ఉన్నప్పటికీ ఈ నిధులు సమకూర్చడం చాలా నాటో సభ్యదేశాల వల్లకాదన్న వాదనలే బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయంలో స్పెయిన్ దేశం చాలా నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వెల్లడించింది. 2035 నాటికి నాటో కోరుకున్న విధంగా ఐదూశాతం ఐడిపిలో రక్షణకు కేటాయించడం తమకు సాధ్యం కాదని హేగ్‌లో సమావేశాలకు ముందే స్పెయిన్ స్పష్టం చేసింది. అందువల్ల అనివార్యంగా ప్రతి ఏటా లక్ష్యాలను సాధించాలన్న కఠిన నిబంధనలు ఈ డిక్లరేషన్‌లోంచి ఎగిపోయాయి.



ఐదు శాతం పెంచిన బడ్జెట్‌లో అదనపు నిధులు సమకూర్చడంలో యూరప్ దేశాల అసమర్థతను తొలుత విమర్శించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హేగ్ సమావేశానికి వెళ్ళిన తర్వాత ఇది అమెరికా విజయం, యూరప్ విజయం అని ప్రకటించుకున్నారు. నాటో భద్రతలో చాలా హెచ్చు భాగం అమెరికాయే భరిస్తోంది. ఈ విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గినప్పటికీ ఈనాటికీ కూడా యూరప్ దేశాలు భద్రత విషయంలో అమెరికా మీదే చాలా ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ట్రంప్ ప్రయోజనాలు నెరవేర్చకపోతే యూరప్ దేశాలకు నాటోలో సహకారం ఉండదు. అందుకే టారిఫ్‌ల భారాన్ని గణనీయంగా యూరప్‌దేశాలపై రుద్దిన తర్వాత చైనా దేశం మెల్లిగా యూరప్ దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంచుకునేందుకు చర్యలు ప్రారంభించింది. యూరప్ దేశాలతో చారిత్రకంగా చైనాకు ఎలాంటి విభేదాలు, పూర్వాకాల ఘర్షణలు లేవని, యూరప్‌తో వాణిజ్యబంధం పెంచుకునేందుకు ఆసక్తిగా ఉన్నామని చైనా ఇటీవల పదే పదే ప్రకటనలు చేస్తున్నది. ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధాన్ని విరమింపసేసేందుకు ట్రంప్ అనుసరించిన వైఖరి యూరప్ దేశాలను చాలా అభద్రతకు గురిచేసింది. బైడెన్ తరహాలో ట్రంప్ ఉక్రేన్‌కు సైనిక మద్దతు ఇచ్చేందుకు బాహాటంగా బయటకు రాకపోవడం, క్రమంగా ప్రాభవం కోల్పోతున్న అమెరికా ఏకధృవ ప్రపంచ ఆధిపత్యాన్ని తిరిగి సాధించేందుకు ఉద్దేశించిన 'మాగా' ప్రణాళిక, ఇంటా బయటా ట్రంప్ పొదుపు చర్యలు ట్రంప్ బలహీనతలను పరోక్షంగా చెబుతూనే ఉన్నాయి.

### హేగ్‌లో ప్రజల నాటో వ్యతిరేక ప్రదర్శనలు

హేగ్‌లో భారీ ఎత్తున అట్టహాసం చేసినప్పటికీ నాటో సమావేశాన్ని తూ తూ మంత్రంగా ముక్తసరిగా ముగించారని, గత కాలపు ఆత్మీయతలు, పరస్పర విశ్వాసాలు కనిపించలేదన్నది నిపుణుల అంచనా. హేగ్‌లో నాటో సమావేశానికి ముందుగానే ప్రజలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేశారు. సమావేశాలు ప్రారంభం కావడానికి ఒక రోజు ముందుగా జూన్ 23న లక్షలాదిమంది హేగ్‌లో వీధుల్లోకి వచ్చారు. నాటో కూటమిలో ప్రజలకు అనుకూలమైన తీర్మానాలు చేయాలని నినాదాలు చేశారు. రక్షణ వ్యయాలను భారీగా పెంచడానికి బదులుగా ప్రజల ఆరోగ్యంకోసం, శాంతి సాధనకోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాలని ప్రజలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఐరోపాలో కూడా ప్రదర్శనలు జరిగాయి. సామాజిక సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మాగా మహరాజు యూరప్ రక్తం డబ్బుతో కూడుకున్నదని విమర్శలు చేశారు. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ సమావేశానికి ముందే నాటో అధ్యక్షుడు రుట్టోకు లేఖరాసి రక్షణవ్యయం పెంపుదలపై నిరసన తెలియజేశారు. ''మాకు యుద్ధాలు వద్దు, ప్రజలు శాంతియుతంగా జీవించాలని కోరుకుంటున్నారు'' అని ప్రజలు నినాదాలు చేశారు.

# అణ్వాయుధాలు లేని మధ్యప్రాచ్యం

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్



**టెహ్రాన్ :** మధ్యప్రాచ్యంలో ప్రాంతీయశాంతి, సుస్థిరత, భద్రత సాధనకు ఇరాన్ కృషి చేస్తుందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ చెప్పారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో గురువారంనాడు ఆయన ఫోన్‌లో సంభాషించారు. అణ్వాయుధాలు లేని మధ్యప్రాచ్య సాధనకు తమ వంతు సహాయం చేస్తామన్నారు. మధ్యప్రాచ్యంలో ఉన్న అన్ని దేశాలనూ ఇరాన తన సహోదరదేశాలుగా, మిత్ర దేశాలుగానే భావిస్తుందని, నిర్మాణాత్మకమైన సంబంధాలు, స్నేహసహకారాలపైనే ఈ ప్రాంతంలో దేశాల మధ్య అభివృద్ధి ప్రగతి ఆధారపడి ఉంటుందని తాము విశ్వసిస్తున్నామని పెజెష్కియన్ అన్నారు. కానీ ఇరాన్ మాత్రం ఇస్లామిక్ దేశాల మధ్య సంఘర్షణను రెచ్చగొట్టి, స్నేహసంబంధాలు బలపడకుండా అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు. ఈజిప్టుతో స్నేహసంబంధాలు ఏర్పాటు చేసుకోవడంలో ఎదురైన ఆటంకాలను తొలగించేందుకు జరుగుతున్న కృషిని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎల్ సిసి మాట్లాడుతూ, కాల్పుల విరమణపట్ల సంతృప్తి ప్రకటించారు.
ఈ ప్రాంతంలో అణ్వాయుధాల నిర్మూలనకు, సామూహిక విధ్వంసక ఆయుధాల నిర్మూలనకు, ప్రాంతీయ సుస్థిరతకు ఇరాన్ సహకరిస్తుందని పెజెష్కియన్ ఆయనకు చెప్పారు. ప్రాంతీయ సుస్థిరత సాధన, భద్రతా ఏర్పాట్లకు మధ్యప్రాచ్యంలో ఉన్నవారందరితో నిర్మాణాత్మకమైన అనుసంధాన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇజ్రాయెల్ పేరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.
ఐతే ఈ ప్రాంతంలో అణు నిరాయుధీకరణను పాటించడంలో ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని కూడా అనివార్యంగా భాగస్వామిగా చేయాలని, ఎందుకంటే ఆ దేశ చరిత్ర అంతా అవిశ్వాసంతో కూడుకున్నదేనని విమర్శించారు. ఇరాన్‌ను దురాక్రమణ చేసేందుకు ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధంలో అమెరికా ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడంతో ఈ ప్రాంతంలో ఉన్న ఆ దేశ సైనిక స్థావరాలపై అనివార్యంగా క్షిపణి దాడులు చేయవలసి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఖతార్‌లో దాడులు చేస్తున్నట్లు ముందుగానే ఇరాన్ తెలియజేసింది. దాడుల తర్వాత ఫోన్‌లో ఖతార్ ఎమిర్‌తో పెజెష్కియన్ మాట్లాడారు. ఖతార్ ప్రజలకు తన సానుభూతి ప్రకటించారు.

# కెన్యాలో అల్లర్లు
### 16 మంది మృతి

**నైరోబీ :** కెన్యాలో నిరసన ప్రదర్శనల సందర్భంగా పోలీసులతో జరిగిన ఘర్షణలు, కాల్పులలో 16 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. సరిగ్గా ఏడాది క్రితం కెన్యాలో ఒక బ్లాగర్ పోలీసు కష్టడీలో మరణించడంతో తీవ్ర నిరసనలు చెలరేగాయి. దేశవ్యాప్తగా వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. దీంతో దేశం రణరంగంగా మారి హింసాకాండ చెలరేగింది. ఈ ఘటనలను గుర్తుచేసుకుంటూ ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలు బుధవారంనాడు వీధుల్లోకి వచ్చారు.



నిరసన ప్రదర్శకులను పారద్రోలేందుకు పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. తర్వాత కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దేశవ్యాప్తంగా 16 మంది మరణించారని మానవహక్కుల సంఘాలు తెలిపాయి.

# నేతన్యాహూపై కేసులు రద్దుచేయండి

### ట్రంప్ విజ్ఞప్తి

**వాషింగ్టన్ :** బెంజమన్ నేతన్యాహూపై ఆ దేశంలో ఉన్న కేసులను పూర్తి రద్దుచేయాలని, లేదా ఆయనకు క్షమాభిక్ష ప్రసాదించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కోరారు. నేతన్యాహూ ఇజ్రాయెల్‌లో అవినీతి కేసులు ఎదుర్కొంటున్నారు. అవినీతి కేసులలో నేతన్యాహూ విచారణ ఎదుర్కొంటున్నారు. ఇటీవల జెరూసలెం కోర్టులో హాజరుకావాలని ఆయనకు తాకీధులు అందాయి. ఐతే తాను యుద్ధ వ్యవహారాల్లో బిజాగా ఉన్నానని, పది రోజులు గడువు ఇవ్వాలని నేతన్యాహూ కోరుతున్నారు. కాగా పరాయిదేశ అంతర్గత వ్యవహారాలలో ఈ విధంగా ట్రంప్ జోక్యం చేసుకోవడంపై విమర్శలు మొదలయ్యాయి. ఇజ్రాయెల్‌లో కూడా వ్యతిరేకత వ్యక్తమైంది. ''ఇరాన్‌తో యుద్ధాన్ని నివారించి దేశాన్ని అమెరికా కాపాడింది, ఇప్పుడు కూడా నేతన్యాహూను అమెరికా కాపాడుతోంది'' అని సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. లంచాలు తీసుకున్నారని, ఆయన విశ్వాసపాత్రుడు కాదనీ, మోసగాడనీ, ఉల్లంఘునలకు పాల్పడ్డారని 2020 నుండీ నేతన్యాహూ స్వదేశంలో కేసులు ఎందుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ ట్రంప్ ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక స్వతంత్రదేశ అంతర్గత వ్యవహారాలలో అలా జోక్యం చేసుకోకూడదని విమర్శించారు. నేతన్యాహూ, ట్రంప్ ఇటీవల సోషల్ మీడియా ద్వారా పరస్పరం ప్రశంసలు కురిపించుకుంటున్నారు.



ట్రంప్ తన దీర్ఘకాల మిత్రుడనీ, ఆయన ఇజ్రాయెల్ కోసం చాలా చాలా చేశారనీ, ఆయన గొప్ప కథానాయకుడు, యోధుడు అని ప్రశంసలు కురిపించారు. అదేవిధంగా ఇజ్రాయెల్ చరిత్రాత్మక విజయం సాధించిందని నేతన్యాహూ ప్రకటించారు. యుద్ధంలో విజయం సాధించామనీ, అనుకున్న లక్ష్యాలను ఇజ్రాయెల్ సాధించిందని ఆయన పేర్కొన్నారు.

## డ్రగ్స్‌పై ఉద్యమం
**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణ యువత రక్తంలోనే ఉందని.. ఇప్పుడు మళ్లీ డ్రగ్స్ ఉద్యమం చేయాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి అమ్మితే వెన్నువిరిచేస్తామని హెచ్చరించాం.. చెప్పినట్లే చేస్తాం.. డ్రగ్స్ వాడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం అని మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.దేశ జనాభాలో 68 శాతం యువత ఉన్నారు. ప్రపంచంలో 68 శాతం యువత ఉన్న ఏకైక దేశం భారత దేశమని, శత్రు దేశాలు మన దేశాన్ని నిర్వీర్యం చేసేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయని అందులో డ్రగ్స్ మహమ్మారి ఒకటి అని అన్నారు. దాదాపు 50 ఏళ్ల కఠోర శ్రమతో మెగాస్టార్ చిరంజీవి ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. ఆయనతో పాటు ఆయన కుటుంబం కూడా డ్రగ్స్‌వైపు కన్నెత్తి చూడకుండా చేశారు. చిరంజీవి లాగా అందరూ ఒక టార్గెట్ పెట్టుకొని ముందుకు వెళ్లాలి అని అన్నారు. సినిమాల్లో, రాజకీయాల్లో, ప్రభుత్వ రంగాల్లో రాణించాలి.. రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రపంచంలో అగ్రభాగాన నిల్పోబెట్టాలని కోరారు. డ్రగ్స్ బానిస అయితే.. కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుంది. ఏదీ సాధించలేం అని అన్నారు. దేశానికి యుద్ధ వీరులను అందించిన పంజాబ్ రాష్ట్రంలో యువత డ్రగ్స్కు బానిస కావడం పరిస్థితులు గందరగోళంగా మారాయని తెలిపారు. యువత ఎక్కువగా క్రీడల మీద దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ వైపు దృష్టి మళ్లిందంటే.. కెరియర్ నాశనం అయినట్లే అని చెప్పారు. ఇక నుంచి రాష్ట్రంలో ఏ విద్యా సంస్థలో అయినా డ్రగ్స్ దొరికితే కఠినాతి కఠినంగా శిక్షిస్తామని తీవ్ర హెచ్చరిక చేశారు. అంతకుముందు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సిఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపిలు విశ్వేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సినీ నటులు రామ్ చరణ్, విజయ్ దేవరకొండ, టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, హోం శాఖ స్పెషల్ సిఎస్ రవి గుప్త, డిజిపి జితేందర్, టిన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యున్నతమైనది
**(మొదటి పేజీ తరువాయి)**

జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కొంతమంది పార్లమెంటే 'సుప్రీమ్' అని చెబుతున్నారని, తన అభిప్రకారం మాత్రం రాజ్యాంగమే అత్యున్నతమైనదని గవాయ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, శాసనభ లేదా జ్యుడీషియరీ ఈ మూడింటిలో ఏ విభాగం అత్యున్నతమైనదనే విషయమై ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుందన్నారు. 'పార్లమెంటే అత్యుత్తమైనదని చాలామంది చెబుతారు. నమ్ముతారు. కానీ నా నమ్మకం ప్రకారం భారత రాజ్యాంగమే అత్యుత్తమైనది. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఈ మూడు భాగాలూ రాజ్యాంగం ప్రకారం పనిచేస్తాయి' అని సిజెఐ గవాయ్ చెప్పారు. ప్రభుత్వానికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఆదేశాలు జారీ చేయడం ద్వారా న్యాయమూర్తి స్వతంత్రుడు కాలేడని ఆయన స్పష్టీకరించారు. ఒక న్యాయమూర్తి ఎల్లప్పుడూ మనకు ఒక విధి ఉందని, పౌరుల హక్కులు, రాజ్యాంగ విలువలు, సూత్రాలకు మనం కస్టోడియన్లు గా ఉండాల్సిన ఒక బాధ్యత ఉందనే విషయాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాలని సిజెఐ సూచించారు. ప్రజలు ఏమి చెబుతారో? లేదా వారి తీర్పును ధిక్కరిస్తారేమోనని భావించి న్యాయమూర్తి మార్గనిర్దేశం చేయకూడదని గవాయ్ చెప్పారు. మనం స్వతంత్రంగా ఆలోచించాలని, ప్రజలు ఏమి చెబుతారనేది మనం నిర్ణయం ప్రక్రియలో ఒక భాగం అవుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తానెప్పుడూ తీర్పులను పనిద్వారా వ్యక్తపరుస్తానని, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఎల్లప్పుడూ గౌరవిస్తానని చెప్పారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా తాను ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ ఆశ్రయం పొందే హక్కు అత్యుత్తమైనదని గవాయ్ వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్ తన బాల్యదశలో రోజులను జ్ఞప్తి తెచ్చుకుంటూ తాను ఆర్కిటెక్ట్‌ను కావాలని కోరుకున్నానని, తన తండ్రి తానొక న్యాయవాది కావాలని ఎల్లప్పుడూ ఆకాంక్షించే వారని, కానీ ఆయన కోరిక నెరవేరలేదన్నారు. ఆ సమమంలో ఆయన భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అరెస్ట్ అయినందువల్లే సాధ్యం కాలేదని సిజెఐ గవాయ్ ఒకింత ఆవేదన వ్యక్తంచేశారు.

## ప్రైవేటు ఎలక్ట్రికల్ బస్సుల కన్సల్టెన్సీల కార్మిక దోపిడీని అరికట్టాలి
### టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జెబిఎం ఎలక్ట్రికల్ బస్సుల కన్సల్టెన్సీలైన శ్రీ బాలాజీ, సిల్‌కాన్‌కు చెందిన వారు జెబిఎం బస్సులపై పనిచేస్తున్న కార్మికుల జీతాల నుండి పి.ఎఫ్ డబ్బులు రికవరీ చేసుకొని ఐదు నెలలుగా ఆ డబ్బును పిఎఫ్‌లో జమ చేయకుండా స్వంతానికి వాడుకోవడం అన్యాయమని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. వెంటనే ఆ డబ్బును వారి పిఎఫ్ ట్రస్ట్‌లో జమ చేయాలన్నారు. గత 5 నెలల నుండి జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బంది జీతాల నుండి పిఎఫ్ పేరుతో నెలకు రూ.3000 కట్ చేసుకొని అట్టి డబ్బులను పిఎఫ్‌లో జమ చేయక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటన పట్ల జెబిఎం యాజమాన్యం, ఆర్‌టిసి యాజమాన్యం వెంటనే స్పందించాలన్నారు. కార్మికుల పిఎఫ్ డబ్బులను కాజేసిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల డబ్బులను పిఎఫ్ ఖాతాలో జమ చేయించని పక్షంలో జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బందికి ఎంప్లాయీస్ యూనియన్ అండగా ఉంటుందన్నారు. సమస్యల కోసం పోరాటం చేస్తామని ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఇప్పటికైనా జెబిఎం, ఒలేక్ట్రా విద్యుత్ బస్సులలో పనిచేసే కార్మికులు యాజమాన్యాలకు భయపడకుండా సంఘటితం కావాలని, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వం తీపి కబురు
**(మొదటి పేజీ తరువాయి)**

ఊరట లభించనుంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, లెక్కకు మించిన సంక్షేమ పథకాలు మరోవైపు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్ల మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులకు ప్రాధాన్యతనిస్తూ నిధులను విడుదల చేశామని డిప్యూటీ సిఎం,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం తెలిపారు. కాగా తొమ్మిది రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం రూ. 9వేల కోట్ల రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించారు. విపక్షాల అంచనాలను తలకిందులు చేస్తూ మరుసటి రోజే ఉద్యోగుల మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లుల విడుదల గమనార్హం. ఇదేనెల 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డి ఏ లు పెంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఉద్యోగ సమస్యల పరిష్కార అంశంపైన ఉద్యోగ సంఘాలతో ఉద్యోగుల సంక్షేమ మంత్రుల సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని భట్టి హామీనిచ్చిన విషయం తెలిసిందే. 15రోజుల వ్యవధిలోనే పరిష్కరించారు.

**27 నెలల పెండింగ్ బిల్లులకు మోక్షం**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు గత 27 నెలలుగా మెడికల్ రీయంబర్స్‌మెట్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎంప్లాయిస్ వెల్ఫేర్ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ గా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వెళ్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డిఎలను పెంచుతూ ఈనెల 13న ప్రభుత్వం జిఓ జారీ చేసిన విషయం తెలిసిందే. డి ఎ పెంపుతో రాష్ట్రంలోని 3.50 లక్షల మంది రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, మూడు లక్షల మంది పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది. డిఏ తో ప్రభుత్వంపైన ప్రతినెలా రూ.200ల కోట్లు, ఏడాదికి 2,400 కోట్ల ఆర్థిక భారం పడుతుందని, అయినప్పటికీ ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా , భావించే ప్రజా ప్రభుత్వం డిఎల పెంపు ఉత్తర్వులను విడుదల చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు.

**'మహిళా శిశు సంక్షేమ, ప్రణాళిక' శాఖలో క్యాడర్‌స్ట్రెంత్ పెంపు**

మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రణాళికా శాఖలో క్యాడర్ స్ట్రెంత్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. జనాభాను అనుసరించి గ్రామపంచాయతీలను నాలుగు గ్రేడ్ లుగా విభజించనున్నారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన హెల్త్ ఇన్సూరెన్స్ పథకం పూర్తిస్థాయిలో సిద్ధమవుతుంది. వివిధ శాఖల్లో ప్రమోషన్లకు సంబంధించిన డిపిసి కమిటీలు వేగం పెంచాయి. రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని 7.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## తొలి భారతీయుడు
**(మొదటి పేజీ తరువాయి)**

నౌకలు అంతరిక్షంలోకి వెళ్ళాయి. అంతరిక్షంలో ఉన్న కేంద్రాన్ని ఒక నౌక వెళ్ళి అనుసంధానం కావడం ఎంతో సున్నితమైన ప్రక్రియో, అంత సంక్లిష్టమైనది కూడా. నాలుగవ ప్రైవేటు మిషన్ (ఆక్సియం–4) అంతరిక్ష కేంద్రంతో విజయవంతంగా అనుసంధానమైందనీ, నలుగురు వ్యోమగాములూ ఐఎస్ఎస్ లోపలికి వెళ్ళినట్లు నాసా ప్రకటించింది.

**ఐఎస్ఎస్‌లో ఇప్పుడు ఏడుగురు వ్యోమగాములు**

బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుండి ఫాల్కన్–9 రాకెట్ నింగిలోకి దూసుకుపోయింది. నలుగురు వ్యోమగాములు కొత్తగా ఐ ఎస్ ఎస్‌లోకి వెళ్ళడంతో ఇప్పుడు మొత్తం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న వ్యోమగాములసంఖ్య ఏడుకు చేరుకుంది. ఇప్పటికే అక్కడ అన్నే మెక్లెన్, నికోల్ ఆయర్స్, కిరిల్ పెస్కోవ్ అనే వ్యోమగాములు ఐ ఎస్ ఎస్‌లో ఉన్నారు. వీరంగా ఈ ఏడాది మార్చి నెలలో వెళ్ళారు. ఇదిలా ఉండగా చైనా అంతరిక్ష కేంద్రం సహా మొత్తం రోదసీలో 14 మంది మానవులు ఉన్నారు.
రోదసీ యాత్రల్లో ఎంతో అనుభవం సంపాదించి, అనేకసార్లు స్పేస్‌వాక్ చేసిన 64 ఏళ్ళు వయసు గల అమెరికా నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్ మిషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. శుక్లా మిషన్ కెప్టెన్ బాధ్యతల్లో ఉన్నారు. పెగ్గీ విట్సన్ ఏకంగా 675 రోజులు రోదసీలో గడిపారు. 10 సార్లు స్పేస్‌వాక్ చేశారు. ఇక శుక్లా 2000 గంటలు విమానం నడిపిన అనుభవంతో వ్యోమగామిగా ఎంపికయ్యారు. 1984లో రాకేశ్ శర్మ తర్వాత రోదసీలోకి వెళ్ళిన రెండో భారతీయుగా, ఐ ఎస్ ఎస్‌లో ప్రవేశించిన మొట్టమొదటి భారతీయుడుగా శుక్లా చరిత్రలో నమోదయ్యారు. ఇక పోలెండ్‌కు చెందిన ఇంజనీరు ఉజ్నన్స్కీ విస్నియోస్కీ మిషన్ స్పెషలిస్టుగా, యూరోపియన్ స్పేస్ ఏజన్సీ ప్రాజెక్టు వ్యోమగామిగా ప్రసిద్ధుడు. 1978 తర్వాత పోలెండ్ నుండి రోదసీ యాత్ర చేసిన రెండో వ్యోమగామిగా ఆయన రికార్డు సృష్టించారు.
హంగేరీకి చెందిన మెకానికల్ ఇంజనీరు టోబోర్ కపు మిషన్ స్పెషలిస్టు. ఆయన కూడా రోదసీలోకి వెళ్ళిన రెండో వ్యోమగామిగా ఆ దేశంలో చరిత్ర సృష్టించారు. హంగేరీ నుండి 45 ఏళ్ళ క్రితం మొదటి వ్యోమగామి రోదసీలోకి వెళ్ళారు. ఈ నలుగురు వ్యోమగాములూ ఆక్సియం–4 మిషన్‌లో భాగంగా ఐ ఎస్ ఎస్‌కు వెళ్ళారు. 14 రోజులపాటు ఐఎస్ఎస్‌లో ఉండి 60 రకాల ప్రయోగాలు చేస్తారు.

సాగు చట్టాలపై రైతులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా

## 28 నుంచి లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో సాగు న్యాయ యాత్ర

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** సాగు చట్టాలపై రైతులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈనెల 28వ తేదీ నుంచి సాగు న్యాయ యాత్ర చేపట్టనున్నట్లు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, లీఫ్స్ సంస్థ అధ్యక్షులు భూమి సునీల్ తెలిపారు. లీఫ్స్ సంస్థ బృందం ఆధ్వర్యంలో చేపట్టనున్న సాగు యాత్రలో రైతుల న్యాయ అవసరాలపై అధ్యయనం చెయనుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 28 నుండి అక్టోబర్ 2 వరకు అధ్యయన బృందం ఈనెల 28న భూదాన్ పోచంపల్లి గ్రామంలో నుంచి ఉదయం 6 గంటలకు సాగు యాత్ర ప్రారంభమై 800 మంది పైచిలుకు గ్రామాల మీదుగా 2400 కిలోమీటర్లు పర్యటించనుందని వెల్లడించారు. . ఈ కార్యక్రమం ద్వారా దుక్కి దున్నే నాటి నుండి పండించిన పంటను మార్కెట్లో అమ్మే దాకా రైతులు ఎదుర్కునే సమస్యలు మొదలు, భూమి, వ్యవసాయానికి సంబంధించి రాష్ట్రంలో రెండు వందలకు పైగా చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ఏరువాక, భూ సమస్యలు, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల నష్టం, మార్కెట్ మోసాలు, పంటల భీమా అందనప్పుడు ఇలా పలు సందర్భాలలో రైతులకు చట్టాలతో అవసరం ఏర్పడుతుందన్నారు.

## నక్సల్స్ ఎన్‌కౌంటర్
**(మొదటి పేజీ తరువాయి)**

ఎదురు కాల్పులకు దిగారు . ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య హోరాహోరీగా రెండు గంటలపాటు కాల్పులు కొనసాగాయి. అటువైపు నుండి కాల్పుల మోత ఆగిపోవడంతో సంఘటనా స్థలాన్ని పూర్తిగా పరిశీలించడంతో రెండు మృతదేహాలు లభ్యం కావడంతో పాటు 8 రౌండ్లతో ఉన్న ఇన్సాస్ రైఫల్, ఒక మ్యాగజైన్, 315 బోర్ రైఫల్, 303 రైఫల్ మందుగుండు సామాగ్రి, ఇతర పేలుడు పదార్థాలు రోజువారీ వినియోగించే వస్తువులు లభ్యమైనట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

## చెంపదెబ్బ కొట్టాం
**(మొదటి పేజీ తరువాయి)**

ఈ ప్రస్థావన తీసుకురాలేదు. యుద్ధం మొదలయ్యాక జూన్ 13 నుండీ ఖమేనీ కట్టుదిట్టమైన నేలమాళిగలో సురక్షితంగాఉంటున్నారు.

**ప్రాంతీయ సమీకరణల్లో ఇక కొత్త శకం : హిజ్బుల్లా**

ఇస్లామిక్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేసిన అమెరికా–ఇజ్రాయెల్‌లపై విజయవంతంగా సైనిక చర్యలు చేసినందుకు హిజ్బుల్లా సంస్థ ఇరాన్ నాయకత్వానికి ఆ దేశ ప్రజలకు సాయుధ బలగాలకు అభినందనలు తెలియజేసింది. మధ్యప్రాచ్య ప్రాంతీయ సమీకరణల్లో ఇక కొత్త శకం ప్రారంభం అవుతుందని పేర్కొంది. దురాక్రమణ చర్యలకు ఇరాన్ తన ప్రత్యక్ష, నిర్ణయాత్మకంగా ప్రతిస్పందన ద్వారా, సాహసోపేతమైన,తెలివైన నాయకత్వం ఎప్పటికీ భయపడదని, తలవంచదని అమెరికా, ఇజ్రాయెల్ పాలకులకు స్పష్టమైన సందేశం పంపించిందని హిజ్బుల్లా ప్రశంసించింది. ఈ ప్రాంతంలో ఇరాన్ సాధించిన విజయం ఐక్యతకు, మర్యాదకు, ప్రపంచవ్యాప్తంగా అల్లాపట్ల విధేయంగా ఉన్న దేశాలకు, అల్లా మత బోధనల గౌరవ ప్రతిష్టలకు ఒక గొప్ప నమూనాగా ఉంటుందని హిజ్బుల్లా పేర్కొంది.

## అణు చర్చలు
**(మొదటి పేజీ తరువాయి)**

మొదట హేగ్‌లో పత్రికాగోష్ఠిలో చెప్పారు. ఇరాన్–అమెరికా మధ్య ఆరో విడత చర్చలు జూన్ 15 తేదీ జరగాల్సి ఉండగా, దానికి రెండు రోజుల ముందుగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేయడంతో పరిస్థితి అస్తవ్యమైపోయింది. 12 రోజుల యుద్ధం తర్వాత ఈనెల 24వ తేదీ మంగళవారంనాడు ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన సమయంలోనే అమెరికాతో అణుచర్చలకు సిద్ధంగా ఉన్నట్లు కూడా ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేసేందుకు వీలుగా ఆ దేశ అణుకార్యక్రమాన్ని బాగా పరిమితం చేస్తూ 2015లో అమెరికా ఒప్పందం చేసుకుంది. కానీ ట్రంప్ 2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాన్ని రద్దు చేశారు.

## ఎసిబి ఆకస్మిక దాడులు
**(మొదటి పేజీ తరువాయి)**

బూర్గంపాడు, వరంగల్ జిల్లా భీమదేవర పల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కూడా ఎసిబి ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తనిఖీ సమయంలో లెక్కల్లో లేని రూ. 91,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనేక అవకతవకలు ఇందులో లభించాయి. ఆర్‌టిఎ కార్యాలయాలు, చెక్ పోస్టులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారుల అవకతవకలపై ఎసిబి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వీరందరిపై త్వరలో కేసులు నమోదు చేస్తామని ఎసిబి అధికారులు చెప్పారు.

**టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ 1064 కు కాల్ చేయండి ..**

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఎసిబి టోల్ ఫ్రీ నంబర్‌ను అంటే 1064ను సంప్రదించాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ ప్రజలకు అభ్యర్థించారు. అలాగే ఎసిబి తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్‌బుక్ , ట్విట్టర్ ద్వారా కూడా సంప్రదించవచ్చునన్నారు. ఫిర్యాదుదారుడి పేరు, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన వెల్లడించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## డెంటిస్టులకు 'హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, ప్లాస్టిక్ సర్జరీ'లకు అనుమతి లేదు

### తెలంగాణ మెడికల్ కౌన్సిల్ స్పష్టం

**ప్రజాపక్షం/హైదరదరాబాద్ :** హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, ప్లాస్టిక్ సర్జరీ వంటి కాస్మోటిక్ ప్రొసీజర్లను నిర్వహించేందుకు డెంటిస్టులకు అనుమతి లేదని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టిఎంసి) స్పష్టం చేసింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి) మార్గదర్శకాల ప్రకారం డెంటిస్టులు హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, ప్లాస్టిక్ సర్జరీ వంటి కాస్మోటిక్ ప్రొసీజర్లను నిర్వహించరాదని టిఎంసి ఛైర్మన్ డాక్టర్ కె. మహేష్ కుమార్ పబ్లిక్ నోటీసును గురువారం జారీ చేశారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డిసిఐ) నిబంధనల ప్రకారం బిడిఎస్ లేదా ఎండిఎస్ డిగ్రీ పొందిన డెంటిస్టులు కేవలం ఓరల్, మాక్సిలో ఫేషియల్ సర్జరీలకు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఇటువంటి చికిత్సల నిమ్మితం ప్రజలు ఎంబిబిఎస్, ఎంఎస్ ఎండి, స్పెషలైజేషన్ వైద్యులను సంప్రదించాలని మెడికల్ కౌన్సిల్ సూచించింది.



## నాడు అనివార్య పరిస్థితుల్లోనే ఎమర్జెన్సీ

### రాజకీయ లబ్ధి కోసమే బిజెపి నాయకుల విమర్శలు : కోదండరెడ్డి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** నాటి అనివార్య పరిస్థితుల ఆధారంగానే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిందని, ఈ అంశాన్ని బిజెపి నేతలు రాజకీయ దురుద్దేశ్యంతో దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇందిరా గాంధీ పరిపాలన, చేపట్టిన సంస్కరణలతో ఆమె శక్తివంతమైన నాయకురాలని ప్రపంచమే గుర్తించడమే కాకుండా పార్లమెంట్ సాక్షిగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇందిరాగాంధీని దుర్గాదేవిగా కొనియాడారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రయోజనాలకోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చింది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని అదే బిజెపి 10 ఏళ్ల పాలనలో ప్రజావ్యతిరేక సంస్కరణలు తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్కటైన తెచ్చిందా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ కాలంలో పాలనపరంగా ఎంతో మేలు జరిగిందని అప్పట్లో సాధారణ ప్రజలు హర్షం వ్యక్తం చేయగా, తమ రాజకీయ లబ్ధి కోసం నాడు జయప్రకాశ్ చేపట్టిన ఉద్యమం ఉత్తర భారత్‌కే పరిమితం కాగా దక్షిణ భారత్‌లో ప్రభావం లేదన్నారు. కాని ఇప్పుడున్న బిజెపి ఎన్‌డిఎ నాయకులు ఇందిరా గాంధీపై అసత్యపు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీని బలహీనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని దీనిని ప్రజా స్వామ్య వాదులు గుర్తించాలని కోదండరెడ్డి కోరారు.

## విత్తనచట్టం ముసాయిదా కమిటీ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమగ్ర విత్తన చట్టానికి సంబంధించి ముసాయిదా కమిటి గురువారం సమావేశం సమావేశమైంది.గురువారం బషీర్ బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో సమావేశమైన కమిటీ సభ్యులు విత్తన చట్టం డ్రాఫ్ట్ పై చర్చించారు.. కమిటీ కన్వీనర్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, భూమి సునీల్, దొంతి నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంవి.నాగేశ్ కుమార్, శివ ప్రసాద్‌తో, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సుచరిత, డిప్యూటీ డైరెక్టర్ అనిత, ఎవో శ్రీనివాస్, రైతు కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవిందు, ఎఒ వెంకట హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముసాయిదా రూపకల్పనకు తీసుకోవాల్సిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అవసరమైతే విత్తన రంగంలో అనుభవం ఉన్న వారి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తీసుకోవాలని, మరోసారి సోమవారం సమావేశం కావాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు.

# కగార్ ఆపరేషన్ నిలిపి వేయాలి

### సిపిఐ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను భౌతికంగా అంతమొందించడం తక్షణమే నిలిపివేసి వారితో శాంతి చర్చలు జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈటి నరసింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక ప్రజలను కాల్చిచంపిన ఉగ్రవాదులతో చర్చలకు సిద్ధపడ్డ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఈ దేశ ప్రజలైన మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్దమని ప్రకటించినా నరమేధం కొనసాగించడం దుర్మార్గమైన్నారు. కగార్ ఆపరేషన్ తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ లిబర్టీ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి అధ్యక్షతన జరిగిన సభనుద్దేశించి వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఈ దేశంలో కేవలం మావోస్టులే సమస్య అన్నట్లుగా వారిని అంతమొందించడం ద్వారానే అది సమసిపోతుందన్నట్లుగా కేంద్ర పాలకులు కపట నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దేశంలోని సహజ సంపద ఈ దేశ ప్రజలకు మాత్రమే చెందాలనే లక్ష్యంతో పోరాడుతున్న మావోయిస్టులను అంతంచేస్తే తప్ప అటవీ సంపదను కొల్లగొట్టే అవకాశం లేదనే ఈ 10 ఏళ్ల కాలంలో గ్రహించి ప్రధాని నరేంద్ర మోదీ వారిని కగార్ పేరుతో హతమార్చుతున్నారన్నారు. మావోయిస్టులను నిర్మూలించడం కాదు.. ముందుగా దేశంలోని అన్ని సమస్యలను పరిష్కరించడం ద్వారా అన్ని వర్గాలు సమాన అభివృద్ధి సాధించేలా చేయాలన్నారు. వాటిని సాధించకుండా మావోయిస్టులను భౌతికంగా నిర్మూలించగలమోగాని ఆ సిద్ధాంతాన్ని అంతం చేయలేని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు గ్రహించాలని సూచించారు.

ఈటి నరసింహ మాట్లాడుతూ మావోయిస్టులు లేకపోతే ఈ దేశంలో అవినీతి, అరాచకం మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. దేశ ప్రజలపై గాని, దేశఅభివృద్ధిపైగాని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా లకు ఎలాంటి ప్రేమ లేదని, దేశంలోని సహజ వనరులను అదానీ, అంబానీలాంటి కార్పొరేట్‌కు శక్తులకు దోచిపెట్టేందుకే ఇదంతా అన్నారు.

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయక ప్రజలను కాల్చి చంపితే, వారిని పూర్తిగా తుదముట్టించాల్సింది పోయి అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఆదేశంతో ప్రకటించిన ప్రధాని మోదీ పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ప్రకటించారన్నారు. అదే ఈ దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికోసం సర్వం త్యాగంచేసి పోరాడుతున్న మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్ధమంటున్నా వారిని కగార్ ఆపరేషన్ పేరుతో అతి కిరాతకంగా కాల్చి చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రజలారా బిజెపి పాలకుల ద్వంద్వ నీతిని ఆలోచించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చందునాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ గౌడ్, నెర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, ఉపాధ్యక్షులు సత్యప్రసాద్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, చెట్టుకింది శ్రీనివాస్, సక్రిబాయి, బాలకృష్ణ, గ్యార నరేష్, మహమూద్, బొడ్డుపల్లి కిషన్, వెంకటయ్య, కళ్యాణ్, అనిల్, మన్నన్, పాషా, మాజీద్, భవన నిర్మాణ కార్మిక నాయకులు గణేష్, నర్సింగరావు, అరుణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తూ 'కంచెగచ్చిబౌలి భూముల తాకట్టు' పై రుణాలు

### సెబీ చైర్మన్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**వాస్తవాలు దాచిపెట్టి, నిబంధనలను ఉల్లంఘిస్తూ కంచెగచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు సమీకరించడం సెబీ నిబంధనలకు విరుద్ధమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు సెబీ చైర్మన్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. ఈ లేఖలో కంచెగచ్చిబౌలికి సంబంధించి ఇటీవల జరిగిన పరిణామాలు, జిఒలు ఇతర అంశాలను జోడించినప్పటికీ, లేఖపై తేదీని మాత్రం పొందుపర్చలేదు. కంచెగచ్చిబౌలిలోని నాలుగు వందల ఎకరాల భూమి తాకట్టు పెట్టి టిజిఐఐసి ద్వారా రూ.10 వేల కోట్ల అప్పులు తీసుకున్నారని, సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక కమిటి ఈ భూమి అటవీ భూమిగా గుర్తించిందని, అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసిన అధికారులను జైలుకు పంపుతామని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. ఈ వాస్తవాలను దాచిపెట్టి, భూమిని తాకట్టు పెట్టి రుణాలు సమీకరించడం సెబీ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. టిజిఐఐసి వార్షిక ఆదాయం రూ.150 కోట్ల కంటే తక్కువే అయినప్పటికీ వేల కోట్ల అప్పులు తీసుకోవడం ఆర్థిక అవకతవకలకు పాల్పడటంలో భాగమేనని ఆయన పేర్కొన్నారు.



### మత్తు పదార్థాల నిర్మూలనకు అంతా

## సైనికుడిలా పనిచేయాలి

### ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మత్తు పదార్థాల నిర్మూలనకు అంతా సైనికుల్లా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం పోలీసుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుండి కొత్తగూడెం క్లబ్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణతో పాటు డ్రగ్స్ వంటి మహమ్మారిని నిర్మూలించేందుకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక ప్రమాదాలు ఉన్నాయని, యువత తమ అమూల్యమైన జీవితాలను పాడు చేసుకుంటుందని చెప్పారు. యువకులు మంచి లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని జీవితాల్లో ముందుకు సాగాలని సూచించారు. యాంటీ డ్రగ్ వారోత్సవాల సమయాల్లోనే కాకుండా నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు అంతా కృషి చేద్దామన్నారు. ఇందుకోసం పోలీసులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ గంజాయి సేవించిన, విక్రయించినా, విక్రయ సమాచారం తెలిసి కూడా పోలీసుల దృష్టికి తీసుకురాకున్నా నేరమే అని, యువత మత్తు పదార్థాలకు దూరంగాఉండి మంచి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎంతోమంది జీవితాలు గంజాయి, మత్తు పదార్థాల మూలంగా అర్థాంతరంగా ముగిసిపోతున్నాయని, సమాజంలో తలెత్తుకుని తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని, కుటుంబాలతో సంతోషంగా గడపకుండా అయిపోతోందని, అనేక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇది కేవలం మత్తు పదార్థాల వల్లే అని, వీటికి దూరంగా ఉంటే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రహమాన్, ఎక్సైజ్ డిఎస్‌పి కరంచంద్, జిల్లా సంక్షేమాధికారి లెనినా, కొత్తగూడెం ఎఫ్‌డిఓ కోటేశ్వరరావు, పోలీస్ అధికారులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎకెసే సాబీర్ పాషాతో పాటు పెద్దఎత్తున యువత, విద్యార్థినీవిద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఖజానా ఆగం చేసిన కెసిఆర్ కుటుంబం

### లిక్కర్ స్కామ్‌లో వందల కోట్లు కవితకు ఎక్కడివి ?

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ఖజానాను మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం ఆగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణం ముళ్ళ కంచె రోడ్డులో లాగా ఉందని, రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేయడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా బాధ్యత కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రైతు భరోసా ఇచ్చి రైతులకు అండగా నిలబడిందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం రైతుబంధు ఐదు నెలలు పాటు రైతుల ఖాతాలో వేయగా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాలో జమ చేశారని, కెసిఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడా ఇదేనన్నారు. కరువులో ఉండి కూడా అప్పులు కడుతూ కూడా కష్టపడి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నింద లు వేస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేయని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందనే బాధ మాజీ మంత్రి హరీష్‌రావులో కనబడుతుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి కెసిఆర్ చేసిందేమిటని ప్రశ్నించారు. ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయని తనకు పోలీసులు అప్పుడే చెప్పారని, అయితే తనను చేసేదేమిటని ప్రశ్నించానన్నారు. కాంగ్రెస్ పార్టీపైన, తమ నాయకులందరి మీద నిఘా పెట్టారని, నేరాలు చేసే వారిపై నిఘా పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ నాయకులపై నిఘా పెట్టడం దుర్మార్గమన్నారు. లిక్కర్ స్కామ్‌లో పైసలు పెట్టడానికి కవితకు ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నించారు. తాము స్పందించే అంతటి నాయకురాలు కవిత కాదని తమ అభిప్రాయమన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదన్నారు. మాజీ సిఎం కెసిఆర్, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని, రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని, కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతున్నారి ఆయన ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకు ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత బిఆర్‌ఎస్‌లో ఉంటే ఏమిటి.. బయటకు వస్తే ఏమిటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని, ఒక వేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని జగ్గారెడ్డి అన్నారు. కవిత, కెసిఆర్ పంచాయతీ వారిద్దరూ చూసుకోవాలన్నారు.

### తొమ్మిదేళ్ల తర్వాత నేనే సిఎం అవుతా

ప్రస్తుత మూడేళ్లు ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి) చెప్పారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత తాను ముఖ్యమంత్రి కావడానికి తాను ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి సిఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయ త్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మీడియాతో మాట్లాడారు.

## అవినీతికి పరాకాష్ట బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### మీడియాతో మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత కంటే పెద్ద అవినీతిపరురాలు లేరని, కవితనే అవినీతికి పరాకాష్ట అని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి ఆరోపించారు. గాంధీభవన్‌లో గురువారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కవిత ఘనకార్యం వల్లనే ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), బిఆర్‌ఎస్ ఖతమైందని, ఆప్ సిఎం, డిప్యూటీ సిఎం జైలుకు వెళ్లారన్నారు. ఎంఎల్‌సి కవితకు నీతులు చెప్పే అర్హత లేదన్నారు. టిపిసిసి నూతన క్రమశిక్షణ కమిటీ తొలి సమావేశంలో కాంగ్రెస్ పార్టీలో ఏ సమస్య ఎలా పరిష్కరించాలనే దానిపై విధివిధానాలు ఖరారు చేసినట్లు ఆయన వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా రాగి శ్రీనివాస్‌పై ఫిర్యాదు వచ్చిందని, ఉమ్మడి వరంగల్ నేతల మధ్య వివాదంపై శనివారం మరోసారి క్రమశిక్షణ కమిటీలో చర్చిస్తామన్నారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య విభేదాలపై సమావేశంలో చర్చించామని, పఠాన్‌చెరు కాట శ్రీనివాస్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి మధ్య సమస్యల అంశం కమిటీ ముందుకు రాలేదన్నారు.

## సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలి

### 30న కవులు కళాకారుల రాష్ట్ర స్థాయి సదస్సు : పల్లె నర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని డిమాం డ్ చేస్తూ తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కళాకారుల సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక్ భవన్‌లో ఈనెల 30వ తేదీన జరగనున్న ఈ సదస్సుల్లో కవులు, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని ప్రజానాట్యమండలి కార్యాలయం లో గురువారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లె నర్సింహ మాట్లాడుతూ కవులు, కళాకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కళాకారులకు గుర్తింపు,హెల్త్ కార్డులు, ఉద్యమకళాకారులకు సారథిలో ఉద్యోగాలు, ఉద్యోగభద్రత, పిల్లల చదువులకు, ప్రయాణాల్లో రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కళాకారుల కోట, కళాకారులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి సదస్సులో పాల్గొన్న వారి అభిప్రాయాలను తీసుకొని తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లో తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి కె.ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు అరెల్లి రవి పాల్గొన్నారు .

## ఒకటి,రెండ్రోజుల్లో వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్..!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య ఆరోగ్య శాఖలో మరోసారి ఉద్యోగాల నోటిఫికేషన్ రానుంది. ఒకేరోజు మూడు వేర్వేరు ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయడానికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సన్నద్ధమైంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్, స్పీచ్ ఫాథాలజిస్ట్ పోస్టులకు వెలువడనున్న నోటిఫికేషన్లు జారీ కానుంది. మరో 3212 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1284 ల్యాబ్ టెక్నీషియన్స్, 1950 మల్టి పర్పస్ ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయా పోస్టులకు చెందిన పోటీ పరీక్షల ఫలితాలు విడుదల, మెరిట్ జాబితా సిద్ధమైనట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. వైద్య విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు పోస్టులను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ భర్తీ చేయనుంది.

అయితే ప్రభుత్వ ఆస్పత్రులలో గడిచిన 17 నెలల్లో 8వేలకుపైగా పోస్టులను భర్తీ చేసినట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## రూ.2 లక్షల అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయండి

### 'భద్రాచలం రాముడు' మునిగినా.. నోరు విప్పని బిజెపి ఎంపిలు : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వ 18 నెలల పరిపాలనలో రూ.2లక్షల కోట్ల అప్పు చేశారని, ఈ అప్పులతో ఏం చేశారు?, ఎవరికి ఖర్చు చేశారో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ కెసిఆర్ ఎప్పుడు కాంట్రాక్టర్లకు అడ్వాన్సులు ఇవ్వలేదని, కానీ సిఎం రేవంత్ రెడ్డి మాత్రం కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు మెగా కంపెనీ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన మరో కంపెనీకి అడ్వాన్స్‌గా రూ.12 వందల కోట్లను చెల్లించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అవినీతిపైన నెలన్నర లోపు జాగృతి ఆధ్వర్యంలో బుక్ లెట్‌ను ప్రచురిస్తామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అవినీతికి తాము జాగృతి తరపున అవినీతి చక్రవర్తి అనే బిరుదు ఇస్తున్నామని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిమ్మితం కెసిఆర్ ఇఆర్‌సి నుంచి తీసుకొచ్చిన అప్పులకు ఎప్పటికప్పుడు కిస్తీలను చెల్లించారని, దీంతో ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి ఎగ్రేడ్ ఇచ్చిందని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మాత్రం కిస్తీలు సమయానికి చెల్లించకపోవడంతో జూన్ 28లోపు రూ.1320 కోట్లను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్ ఇసి లేఖ రాసిందని కవిత వివరించారు.



కేంద్ర ప్రభుత్వ ప్రగతి అజెండాలో పోలవరం ప్రాజెక్టు చర్చను ఎత్తివేశారని, భద్రాచలం రాముడు మునుగుతున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి చెందిన 8 మంది బిజెపి ఎంపీలు నోరెత్తడంలేదని మండిపడ్డారు. జూలై 6వ తేదీకి తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ జరిగి సంవత్సరం అవుతుందని, ఈ భేటీ తర్వాతనే బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని ఆరోపించారు.

## కెసిఆర్ పెద్ద అవినీతి చక్రవర్తి

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ సిఎం కెసిఆర్ పెద్ద అవినీతి చక్రవర్తి అని, అందుకే ప్రజలు ఆయనను పక్కన పెట్టారని కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ అన్నారు. ''పదేళ్లు మీరు (కవిత) మీ బాపు (కెసిఆర్) చేసింది అంతా అవినీతే. కాబట్టే కవితకు పదేపదే అదే అవినీతి గుర్తుకొస్తోంది. ప్రజలు ఎక్కడ కొడతారోనని లేనిపోని ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కవిత రాజకీయ మనుగడ కోసమో, కెసిఆర్ దృష్టిలో ఏదో చేస్తుందని అనిపించుకోవడానికో ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరు'' అని కవితను ఆయన హెచ్చరించారు. సిఎల్‌పి కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఏ విషయంపైనా చర్చిద్దామని, అసెంబ్లీకి రావాలని స్వయంగా సిఎం రేవంత్ రెడ్డే కెసిఆర్‌కు సవాల్ విసిరారని, సభలో చర్చించే ధైర్యం లేక ఫామ్ హౌజ్‌లో పడుకుని తప్పించుకుని తిరుగుతున్నారని విమర్శించారు. ఎంఎల్‌సి కవిత అధికారంలో ఉన్నప్పుడు మౌనంగా ఉండి ఇప్పుడు హడావుడి చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కవిత బిఆర్‌ఎస్ నాయకురాలిగా మాట్లాడుతున్నారో జాగృతి నాయకురాలిగా మాట్లాడుతున్నారో స్పష్టత తెచ్చుకోవాలన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, అక్రమాల నుంచి కెసిఆర్ కుటుంబం, బిఆర్‌ఎస్ నేతలు తప్పించుకునేందుకు ఎన్ని పక్క దారులు వెతుక్కుంటున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అధికారం కోసం సొంత కూతురి ఫోన్ కూడా ట్యాప్ చేయించిన నీచమైన చరిత్ర గత బిఆర్‌ఎస్ పాలకులదన్నారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ నేడు ఎన్నో కుటుంబాల్లో చిచ్చుకు కారణమవుతోందని, ఎంతోమంది జీవితాలతో చెలగాటం ఆడుతోందని, దీనికి బాధ్యులైనవారిని, ఫోన్లు ట్యాప్ చేయమన్నవారిని, చేసిన అధికారులను ప్రజలు బట్టలూడదీసి కొట్టే రోజు వస్తుందన్నారు. సిట్ కార్యాలయానికి వెళితే అధికారులు చెప్పిన వివరాలు చూసి విస్తూ పోయామన్నారు.

**రాష్ట్రంపై కేంద్రం వివక్షత చూపుతోంది**

పూణే మెట్రోకు సై అన్న కేంద్రం హైదరాబాద్ మెట్ర్ విస్తరణకు నై ఎందుకంటోందని ఆయన ప్రశ్నించారు. బిజెపి నేతల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడప దాడటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల నుంచి రాష్ట్రంపై కేంద్రం వివక్షత చూపుతోందని, బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, కట్టే ప్రాజెక్టులకు అనమతులు ఇవ్వడంలేదన్నారు. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం లోనూ మిగత రాష్ట్రాల్లో మెట్రో ఫేజ్–2కు అనుమతిచ్చి హైదరాబాద్‌కు మాత్రం అవకాశం కల్పించలేదన్నారు. రాష్ట్రంలో 11 ఏండ్ల సంబరాలు చేసుకుంటున్న బిజెపి నేతలు తెలంగాణకు రావాల్సిన నిధులు, పరిష్కారం కావాల్సిన విభజన హామీల విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణ ప్రభుత్వం, పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ శాఖ,**
జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పెద్దపల్లి.
No. T3/01/DPRE/PDPL/2025-26, టెండర్ నోటీసు తేది: 24.06.2025
**పనుల సంఖ్య:** (36), **మొత్తం అంచనా విలువ:** రూ.330.69 లక్షలు, **పనుల పేరు:** పెద్దపల్లి జిల్లాలో **1)** సిసి రోడ్ & పారిశుద్ధ్య పనులు మొ॥వి (09 నెం.లు), అంచనా విలువ: రూ.85.50లక్షలు, **2)** భవనములు (02 నెం.లు), అంచనా విలువ: రూ.16.50లక్షలు, **03)** మరమ్మతులు & ఇతరులు (25 నెం.లు), అంచనా విలువ: రూ.228.69 లక్షలు, **టెండరు షెడ్యూళ్ల జారీకి దరఖాస్తుల ఆఖరి తేది:** 01.07.2025, **టెండర్ షెడ్యూళ్ల జారీ:** 04.07.2025, **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది:** 05.07.2025న మ.3.00గం.ల వరకు, **టెండర్ల ప్రారంభ తేది:** 05.07.2025న మ.3.30గం.లకు.
సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, పెద్దపల్లి.
DIPR R.O. No. : 4188-PP/CL/ADVT/1/2025-26, Date: 26-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, ఎస్‌ఎల్‌పి జోన్ : జిహెచ్‌ఎంసి
NIT No. 12/EE/CIR-20/SLPZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 25.06.2025
**పని రకం:** సివిల్ & ఇతర పనులు, **అంచనా విలువ:** రూ.48.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 27.06.2025న మ.01.30గం.ల నుండి 04.07.2025న మ.01.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సిఐఆర్-20, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9154834248.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 4164-PP/CL/ADVT/1/2025-26, Date: 26-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6.
NIT No. 12/EE-6/CRZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 26.06.2025
**పని రకం:** 7 ఐఆర్‌టి పనులు, **అంచనా విలువ:** రూ.52.10లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 27.06.2025న ఉ.11.00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది:** 30.06.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఎం.పీర్‌సింగ్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 9154960551. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు. **గమనిక:** టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఇఎండి పొందాలి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-6, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 4204-PP/CL/ADVT/1/2025-26, Date: 26-06-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 27 జూన్

## మమ్దానీ గెలుపు సంకేతం

నవంబర్‌లో జరగనున్న న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించే ప్రైమరీ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ విజయం అమెరికాలో పెను సంచలనాన్నే సృష్టించింది. భారత సంతతికి చెందిన ఆయన తల్లి ప్రసిద్ధ సినీ దర్శకురాలు మీరా నాయర్ కాగా, తండ్రి మహ్మద్ మమ్దానీ పూర్వీకులది గుజరాత్. స్వంత పార్టీ డెమొక్రాట్లలో పాటు కుహనావాద వర్గంతో పాటు, అధికార రిపబ్లికన్ పార్టీకి సైతం మమ్దానీ గెలుపు మింగుడు పడటం లేదు. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా సోషలిస్టు ఎజెండాతో ఆయన అమెరికాలోనే అత్యధిక జనాభా (85 లక్షలు) కలిగిన నగరం న్యూయార్క్ పౌరులను ఆకట్టుకోవడం ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది. డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీ ప్రచార సందర్భంగా ఆయన ఇచ్చిన హామీలు అందరికీ అందుబాటులో న్యూయార్క్(ఎఫర్డబుల్ న్యూయార్క్), తక్కువ అద్దెలు, పేద, మధ్య తరగతి వర్గాలకు హౌసింగ్ పథకం, ఉచిత బస్సు ప్రయాణం, యూనివర్సల్ చైల్డ్ కేర్, నగర పాలక సంస్థ చౌక ధరల గ్రోసరీ (కిరాణా) షాపులు. వీటిని అమలు చేసేందుకు సంపన్నులపై పన్ను విధిస్తానని తన ప్రత్యర్థి ఆండ్రూ క్యూమోతో జరిగిన డిబేట్‌లో స్పష్టం చేశాడు మమ్దానీ. ఆయనను కమ్యూనిస్టు, సోషలిస్టు అని చేసిన ప్రచారాలకు ఎక్కడా వెరవలేదు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు కొమ్ముగాస్తూ, నిలువెల్లా కమ్యూనిస్టు వ్యతిరేకతను నింపుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెమొక్రాటిక్ పార్టీ తరఫున మమ్దానీ అభ్యర్థిత్వం నెగ్గడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయాడు. 'వంద శాతం కమ్యూనిస్టు పిచ్చోడు' అంటూ కడుపులోని అక్కసును వెళ్లగక్కాడు.

మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్ (మాగా) నినాదంతో, వలసదారుల, ముస్లింల వ్యతిరేకతను, జాత్యహంకారాన్ని, సంక్షేమ పథకాల కోతలను ప్రధాన ఎజెండాగా నిరుడు నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందాడు ట్రంప్. తన ప్రత్యర్థి కమలా హ్యారిస్‌ను గూర్చి ఆమె మార్క్సిస్ట్, కమ్యూనిస్టు అని పదే పదే విరుచుకుపడేవాడు. ఏ అంశాలను బూచిగా చూపి ట్రంప్ నెగ్గుకొచ్చాడో, వాటినే తన ఎజెండాగా మలుచుకొని ప్రైమరీలో గెలుపొందాడు మమ్దానీ. ఆయన స్వయంగా ముస్లిం, వలసదారుడు. స్వంత పార్టీ నాయకుల విధానానికి భిన్నంగా ఆయన గాజాపై దాడులను ఖండిస్తూ పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడడమే కాకుండా, ఇజ్రాయెల్‌ను గట్టిగా వ్యతిరేకించాడు.

జోహ్రాన్ మమ్దానీ ప్రైమరీలో గెలుపొందిన సమయం, సందర్భం కీలకమైంది. ఇరాన్‌పై దురాక్రమణ దాడులకు తెగబడిన ఇజ్రాయెల్‌తో అంటకాగడమే కాకుండా, ప్రత్యక్షంగా ఇరాన్‌పై అమెరికా యుద్ధ విమానాలతో భారీ బాంబు దాడులు చేయించాడు ట్రంప్. యుద్ధ వ్యతిరేకిని, పశ్చిమాసియా నుంచి అమెరికన్ సైన్యాన్ని ఉపసంహరించుకుంటానని ఎన్నికల ప్రచారంలో హోరెత్తించిన ఆయన తద్విరుద్ధంగా వ్యవహరిస్తుండడంపై బలమైన మద్దతుదారులే తీవ్రంగా దునుమాడుతున్నారు. పశ్చిమాసియా యుద్ధంలో తలదూర్చడంపై అమెరికా సమాజంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల ముందే మెక్సికన్ వలసదారుల బలవంతపు వెనక్కి తరలింపుపై లాస్ ఏంజెలెస్ అట్టుడికింది. ఇలాంటి సందర్భంలో తాజా ప్రైమరీ ఫలితం ట్రంప్‌కు సగటు అమెరికా వాసి చేసిన హెచ్చరిక సందేశం. ఇది అధికార పార్టీకే కాకుండా డెమొక్రాటిక్ పార్టీకి కూడా గుణపాఠం.

డెమొక్రాటిక్ ప్రైమరీ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులుగా పోటీ పడిన జోహ్రాన్ మమ్దానీ, ఆండ్రూ క్యూమో ఆ పార్టీలోని రెండు భిన్న వర్గాలు, సిద్ధాంతాలకు ప్రతీకలు. నవతరానికి ప్రాతినిధ్యం వహించిన న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీ సభ్యుడు మమ్దానీ సోషలిస్టు భావాలను ఎంచుకోగా, గతంలో న్యూయార్క్ మేయర్‌గా పనిచేసిన రాజకీయ అనుభవజ్ఞుడు క్యూమో పెట్టుబడిదారీ విధానానికే పెద్దపీట వేశారు. ఆయనకు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ వంటి రిపబ్లికన్ దిగ్గజాల మద్దతు లభించడమే కాకుండా, ధనికుల నుంచి పెద్ద ఎత్తున విరాళాలూ దక్కాయి. మమ్దానీకి మాత్రం పెద్దతలకాయల మద్దతు, విరాళాలు రాకపోవడంతో, ఆయన చేపట్టిన క్రౌడ్ ఫండింగ్‌కు అనూహ్య స్పందన లభించి 80లక్షల డాలర్లకుపైగా విరాళాలు పోగవడం కూడా సంచలనమే. అధ్యక్ష ఎన్నికల ఓటమి తరువాత గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్న డెమొక్రాటిక్ పార్టీలో ప్రైమరీ ఫలితాలు నేపథ్యంలో సోషలిస్టు భావజాల సమర్థకుల బలం పెరగనుంది. ఇప్పటికే ఆ పార్టీకి సన్నిహితంగా ఉండే ఇండిపెండెంట్ సీనియర్ సెనేటర్ బెర్నీ సాండర్స్ ఉల్లేఖించే సోషలిస్టు మొగ్గు తీసుకోవాలనే వాదనకు మమ్దానీ గెలుపు ఊతమిచ్చినట్లయింది.

విచిత్రం, ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఇన్నేళ్ల అభివృద్ధి, ఆధునిక ప్రపంచంలో నేటికీ 'రోటీ, కప్డా, మకాన్' నినాదం ప్రాసంగికత కోల్పోకపోవడం. మమ్దానీ తన సోషల్ మీడియా ప్రచారంలో హిందీలో ఇదే నినాదాన్ని ఇవ్వడం గమనార్హం. సంపద పెరిగినా, అంతరాలు విస్తృతమవడానికి ఇదొక సూచిక. ఇటీవల జరిగిన ఆస్ట్రేలియా ఎన్నికల్లో అందుబాటు ధరలో ఇళ్ళు, జీవనవ్యయం, గృహ పథకాలు, ఆరోగ్యం, అద్దె తగ్గింపు వంటి అంశాలే ఆంథోనీ అల్బనీస్‌కు మరోసారి ప్రధాని పదవిని కట్టబెట్టాయి. యునైటెడ్ కింగ్‌డమ్ ఎన్నికల్లో లేబర్ పార్టీ గెలుపునకు సైతం ప్రజల జీవన ప్రమాణాలు, ఉద్యోగాల మెరుగుదలే కీలకాంశాలు. పచ్చి మితవాద, జాతీయవాద శక్తులపైనే విజయం దక్కడం విశేషం. అందరూ భయపడుతున్నట్టుగా ప్రగతిశీల భావాలు, క్షేత్రస్థాయి అంశాలు భయోత్పాత, దూకుడు, వాగాడంబర ప్రవాహంలో కొట్టుకుపోలేదని, ఎదురొడ్డి నిలబడుతున్నాయని నిరూపితమవుతున్నది.

# మోదీ ప్రభుత్వం నుంచే రాజ్యాంగానికి ప్రమాదం

### కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారానికే 'రాజ్యాంగం హత్య దినం'

**గ్యాన్ పాఠక్**

జూన్ 25, 1975 అర్ధరాత్రి అప్పటి ప్రధాని ఇందిరాగాంధి దేశంలో 'అత్యవసర పరిస్థితి' (ఎమర్జెన్సీ) విధించటాన్ని గుర్తు చేసుకుంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ఈ జూన్ 25ను మొదటి 'సంవిధాన్ హత్యా దివస్' (భారత రాజ్యాంగ హత్యా దినం) పాటించింది. ఇది వ్యంగ్యాత్మకమైన స్థితిని తెలియజేస్తున్నది – అధికారంలో ఉన్నవారినుండి భారత రాజ్యాంగం ఎల్లప్పుడూ ప్రమాదంలో ఉంది – అది 1975లో ఇందిరాగాంధి కింద కావచ్చు లేదా 50 ఏళ్ల తర్వాత 2025లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కింద కావచ్చు. అందువల్ల నరేంద్ర మోదీ ప్రభుత్వ 'సంవిధాన్ హత్యాదివస్' నుంచి జాగ్రత్తపడాల్సిన సందర్భం ఇది – ఎందుకంటే, భారత రాజ్యాంగాన్ని హత్య చేసి దాని స్థానంలో హిందూ రాష్ట్రను ప్రవేశపెట్టాలని దీర్ఘకాలంగా కలగంటున్న ఆర్‌ఎస్‌ఎస్ తెగకు చెందినవారు మోదీ.

'సంవిధాన్ హత్య' అనేది అతిశయోక్తి. భారత రాజ్యాంగం నిబంధనలు తీవ్రమైన ఉల్లంఘనలకు గురైనాయి గాని ఎన్నడూ హత్యకు గురికాలేదు. అది 1975లో హత్యకు గురికాలేదు, ఆ తర్వాత ఏదోక సమయంలో పునర్జన్మ ఎత్తలేదు. మోదీ సైతం ''బిఆర్ అంబేద్కర్‌గారి రాజ్యాంగం'' గూర్చి మాట్లాడినపుడు దీన్ని పరోక్షంగా అంగీకరించారు. 1949 నవంబర్ 26న ఆమోదించబడి, 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిన ఆ రాజ్యాంగం కిందనే భారత దేశం పరిపాలించబడుతోంది. అటువంటప్పుడు ఒక 'తీవ్రమైన ఉల్లంఘన'ను భారత రాజ్యాంగం 'హత్య'తో పోల్చటం అతిశయోక్తి కాదా? ఈ 'హత్య' అనే పదం ఎక్కడ నుంచి వచ్చింది? 'రివర్స్ సైకాలజీ' (తిరోముఖ మనస్తత్వం) అనే పదం ఉంది. 'హత్య' తనే పదం వ్యక్తుల సొంత హృదయంలోనుంచే వచ్చిందని అది వివరిస్తుంది. 'లౌకిక ప్రజాస్వామిక భారత ఫెడరల్ రాజ్యాంగాన్ని చంపివేసి దాని స్థానంలో 'హిందూత్వ నిరంకుశ కేంద్రీకృత రాజ్యాంగం' ప్రవేశపెట్టాలని కలలుగనే వారి హృదయం నుంచే అది వచ్చినట్లు.

ఈ సర్వసాధారణ నేపథ్యంలో, అధికారంలోని వారు తమను తాము కాపాడుకునేందుకు, తమ అసంఖ్యాక రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలను 'సంవిధాన్ హత్యాదివస్' పాటించటం అనే ముసుగుకింద కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అది సామాన్య ప్రజలకు అత్యంత ఆందోళన కలిగించే విషయం. అధికారంలో ఉన్నటువంటి వారి నుంచే ప్రమాదం వస్తున్నది.

సంవిధాన్ హత్యా దివస్ పాటించాలన్న గెజిట్ నోటిఫికేషన్ జులై 11, 2024న జారీ అయింది. 2014నుంచీ మోదీ ప్రభుత్వం అనేక రాజ్యాంగ నిబంధనలను దురుపయోగం చేస్తున్నదని యావత్ ప్రతిపక్షం ఆ ప్రభుత్వంపై తీవ్రమైన దాడి చేస్తున్న సమయంలో ఆ నోటిఫికేషన్ వచ్చింది. కాంగ్రెస్ ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్నందున ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వంపై దాడి చేయటంలో ముందుపీఠిన ఉంది. కాంగ్రెస్ ప్రస్తుత నాయకత్వాన్ని అవమానించటానికి, స్వాతంత్ర్య పోరాటంలో, స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ అభివృద్ధిలో కాంగ్రెస్ వారసత్వాన్ని దెబ్బకొట్టటానికీ మోదీ ప్రభుత్వం 'సంవిధాన్ హత్యా దివస్' పాటించాలని నిర్ణయించింది.

రాజకీయాలు నడుస్తూ ఉన్నాయి. హోం మంత్రిత్వశాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో సైతం అతిశయింపులను చూడవచ్చు. అది ఇలా చెప్పింది : ''1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించిన మీదట ఆనాటి భారతప్రభుత్వం అధికారాన్ని ఘోరంగా దుర్వినియోగం చేసింది; భారత ప్రజలు దారుణ కృత్యాలకు, అత్యాచారాలకు గురైనారు. కాగా భారత రాజ్యాంగంలో అచంచల విశ్వాసం కలిగిన భారత ప్రజలు, భారతదేశ ప్రజాస్వామ్యం తేరుకునే శక్తిని ప్రదర్శించారు; అందువల్ల, ఎమర్జెన్సీ కాలంలో ఘోరంగా అధికార దుర్వినియోగంవల్ల బాధలనుభవించిన, దానికి వ్యతిరేకంగా పోరాడిన వారందరికీ జేజేలు పలికేందుకై జూన్ 25ను 'సంవిధాన్ హత్యా దివస్'గా భారతప్రభుత్వం ప్రకటిస్తున్నది. అటువంటి ఘోరమైన అధికార దుర్వినియోగాన్ని భవిష్యత్‌లో ఏవిధంగాను బలపరచబోమని భారత ప్రజలు పునర్ నిబద్ధులవుతున్నారు.'' ''సంవిధాన్ హత్య'' అనే పదాన్ని గెజిట్‌లోని విషయం గట్టిగా సమర్థించని వాస్తవాన్ని దాని పాఠంలో ఎవరైనా చూడవచ్చు. అది అధికార ప్రకటన కావున అందులో ''కాంగ్రెస్'' లేదా ''ఇందిరాగాంధి'' పదాన్ని ఉపయోగించలేదు.

అయితే నోటిఫికేషన్ మరుసటిరోజే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పార్టీ రాజకీయాలపరంగా మాట్లాడారు. నోటిఫికేషన్ ప్రయోజనం – ''భవిష్యత్‌లో ఘోరమైన అధికార దుర్వినియోగాన్ని ఏవిధంగాను బలపరచకుండా ప్రజలను పునర్‌నిబద్ధులను చేయటం''. అయితే దాని అసలు ఉద్దేశం ''కాంగ్రెస్‌ను బలపరచవద్దు'' అని చెప్పటంగా ప్రధాని, హోంమంత్రి ప్రకటన సూచించింది. ''కాంగ్రెస్ ముక్త భారత్'' గూర్చి కలగంటున్న నరేంద్రమోదీ అసలు విషయం వెళ్లగక్కారు. ''ఎమర్జెన్సీలో అత్యాచారాల గూర్చి, భారతదేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రారంభించిన చీకటి దశ గూర్చి'' ఆయన మాట్లాడారు. హోంమంత్రి అమిత్ షా, ''నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధి నియంతృత్వ మనస్తత్వాన్ని బరితెగించి ప్రదర్శించారు, మన ప్రజాస్వామ్యం ఆత్మను నులిమివేశారు. లక్షలాది మందిని జైళ్లలో తోసారు.. మీడియా గొంతు నొక్కివేశారు'' అని అన్నారు.

అందువల్ల ''సంవిధాన్ హత్యా దివస్'' అసలుసిసలు ప్రయోజనం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాజకీయ ప్రచారం సాగించటం. ''సంవిధాన్ హత్యా దివస్''ను తొలిసారి పాటిస్తున్న ఈ రోజున ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి నాయకులు కాంగ్రెస్‌ను గురి చేసుకుని చెబుతున్నదేమంటే, గతంలో ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్‌ను ప్రజలు బలపరచవద్దు అని.

> ''సంవిధాన్ హత్యా దివస్'' అసలు సిసలు ప్రయోజనం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాజకీయ ప్రచారం సాగించటం. ''సంవిధాన్ హత్యా దివస్''ను తొలిసారి పాటిస్తున్న ఈ రోజున ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి నాయకులు కాంగ్రెస్‌ను గురి చేసుకుని చెబుతున్నదేమంటే, గతంలో ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్‌ను ప్రజలు బలపరచవద్దు అని.





ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి నాయకులకు ఒక ప్రత్యేక లక్షణం ఉంది – వారు ప్రాచీన వైభవంలో నన్నా జీవిస్తారు లేదా భవిష్యత్ గూర్చిన స్వప్నంలోనైనా జీవిస్తారు. తమ పరిపాలన కాలంలో ప్రతి ఒక్క చెడుకూ గత పాలకులను నిందిస్తుంటారు. భారత రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకమైనా సరే తాము చేయదలచుకున్నది చేస్తూ ఉంటారు. ఇందుకు ఉదాహరణలు అసంఖ్యాకం.

ఉదాహరణకు, భారత రాజ్యాంగంలో పొదిగిన సెక్యులరిజం తీసుకుందాం. ఆర్‌ఎస్‌ఎస్ తెగ హిందూత్వ గూర్చి మాట్లాడతారు, సెక్యులర్ శక్తులను నకిలీ సెక్యులర్ వాదులని నిందిస్తూ తామే అసలు సిసలు లౌకికవాదులమని ప్రజలను తప్పుత్రోవ పట్టిస్తుంటారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదు. స్వాతంత్ర్యం తర్వాత చాలా సంవత్సరాలపాటు ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేయలేదు. వారిప్పుడు జాతీయవాదం గూర్చి మనకు బోధిస్తున్నారు. ''ఘర్ ఘర్ తిరంగ'' (ఇంటింటికీ త్రివర్ణపతాకం) ప్రచారంలో సైతం పాల్గొన్నారు. హిందూ రాష్ట్ర కోసం పిలుపు ఇస్తున్నప్పుడు వారు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు కాదు.

హిందువులను తమకు అనుకూలంగా సమీకరించి ఎన్నికల్లో గెలిచేందుకు వారు ఆచరించే పద్ధతి ద్వేష ప్రసంగాలు చేయటం. భారత ఎన్నికల కమిషన్ మాటేమిటి? న్యాయవ్యవస్థ జోక్యాల ద్వారా, ప్రభుత్వం రూపొందించిన నిబంధనలతో ఎన్నికల కమిషన్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీశారు. ముగ్గురు కమిషనర్‌లలో ఇద్దరికి రాజ్యాంగ రక్షణ ఇవ్వలేదు. ఎన్నికల క్రమంలో అనేక విషయాల సమాచారాన్ని ప్రతిపక్షంతో పంచుకోవటం లేదు. దీన్నే 'మ్యాచ్ ఫిక్సింగ్' అన్నారు ప్రతిపక్ష నాయకుడు. మోదీ ప్రభుత్వం అమలు చేసిన ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు తేల్చింది.

> నరేంద్రమోదీ నాయకత్వం వహిస్తున్న భారతప్రభుత్వం అనేక విషయాల్లో రాజ్యాంగ విలువలతో విభేదిస్తున్నది. మోదీ పరిపాలనలో భారత రాజ్యాంగం తీవ్రమైన ప్రమాదంలో ఉందని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ దీన్ని 'అప్రకటిత ఎమర్జెన్సీ' అంటున్నది. లెజిస్లేచర్, జ్యుడీషియరి, ఫోర్త్ ఎస్టేట్ (మీడియా) ప్రమాదంలో ఉన్నాయి.

భారత సుప్రీంకోర్టు అనేక సందర్భాలల్లో రాజ్యాంగ విరుద్ధ వర్తనకుగాను మోదీ ప్రభుత్వాన్ని విమర్శించింది. రాజ్యాంగం హామీ ఇచ్చిన ఫెడరలిజం (సమాఖ్య విధానం)ను గౌరవించటం లో, అలాగే గవర్నర్‌ల విషయంలో కూడా మోదీ ప్రభుత్వం ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభుత్వాల్లో జోక్యం చేసుకుంటున్నదని సుప్రీంకోర్టు చురకలు వేసింది. అది జిఎస్‌టి వసూలు చేస్తుంది. కాని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు సకాలంలో పంపిణీ చేయదు.

న్యాయవిరుద్ధమైన హత్యలు, చట్టవిరుద్ధ అరెస్టులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, ప్రతిపక్ష నాయకులకు వ్యతిరేకంగా, లేక ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలను వ్యతిరేకించే ఎవరికైనా వ్యతిరేకంగా ఘోరంగా అధికార దుర్వినియోగం విషయాల్లో సుప్రీంకోర్టు పలుమార్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించింది. ప్రభుత్వాల బుల్‌డోజర్ న్యాయాన్ని కూడా సుప్రీంకోర్టు విమర్శించింది.

వాస్తవంలో, నరేంద్రమోదీ నాయకత్వం వహిస్తున్న భారతప్రభుత్వం అనేక విషయాల్లో రాజ్యాంగ విలువలతో విభేదిస్తున్నది. మోదీ పరిపాలన కింద భారత రాజ్యాంగం తీవ్రమైన ప్రమాదంలో ఉందని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ దీన్ని 'అప్రకటిత ఎమర్జెన్సీ' అంటున్నది. లెజిస్లేచర్, జ్యుడీషియరి, ఫోర్త్ ఎస్టేట్ (మీడియా) ప్రమాదంలో ఉన్నాయి.

9మంది జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2017లో గోప్యత (ప్రైవసీ)ను ప్రాథమిక హక్కుగా ప్రకటించింది. అయినా అనేక చట్టాలు, విధానాలు, టెక్నాలజీ ద్వారా భారతదేశాన్ని నిఘా కింద బతికే రాజ్యంగా మార్చుతున్నారు. ప్రజలు తమ వాక్ స్వాతంత్ర్యం హక్కు ఉపయోగించుకున్నందుకు మూల్యం చెల్లిస్తున్నారు. అసమ్మతి గొంతులు అణగదొక్కబడుతున్నాయి.

ఈ పూర్వరంగంలో, రాజ్యాంగ విలువలను అన్ని విధాల దెబ్బతీస్తున్నదని ఆరోపణలకు గురవుతున్న ప్రభుత్వం ''సంవిధాన్ హత్య దివస్'' పాటిస్తున్నందున అది ప్రజలకు మేల్కొలుపుగా పని చేయాలి. ఎందుకంటే ఆ అధికార లాబీనుంచే రాజ్యాంగం ప్రమాదంలో ఉంది.

(ఐపిఎ సర్వీస్)

# బిఆర్‌ఎస్‌పై స్థానిక పిడుగు :లోకల్ బాడీ బిల్డర్ ఎవరో!



ఎస్.కె.జకీర్
సీనియర్ జర్నలిస్ట్

క్షేత్రస్థాయిలో నిర్మాణం లేనందున బిఆర్‌ఎస్ పార్టీకి ఏ ఎన్నిక అయినా అది 'పిడుగు' వంటిదే! తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్, బిజెపిలకు చెలగాటం, బిఆర్‌ఎస్‌కు ప్రాణ సంకటంగా మారనున్నవి. పలు కుంభకోణాలు, నేరాలు, కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బిఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉన్నది. స్థానిక ఎన్నికలు ముమ్మాటికీ ఆ పార్టీపై పిడుగు లాంటివే. ఆ పార్టీ 'బ్రాండ్ కెసిఆర్ ఫోటో చూసి ఓట్లు వేసే రోజులు ఎప్పుడో అంతరించాయి. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్‌ఎస్ బలహీనపడితే, ఆ రాజకీయ శూన్యతలోకి విస్తరించడానికి బిజెపి కాచుకొని ఉంది. అసెంబ్లీ, లోక్‌సభ వరుస ఓటమితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కెసిఆర్ పార్టీ ఆ ఓటముల నుంచి 'గుణపాఠం నేర్చుకోవడానికి ఇష్టపడడం లేదు సూటిగా చెప్పాలంటే' మేమే మరెవరికయినా పాఠాలు చెబుతాం కానీ మేం నేర్చుకునేదేమిటి? అనే ధోరణి కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, మధుసూధనాచారి, నిరంజన్ రెడ్డి తదితరులలో కనిపిస్తోంది. 'ప్రజలతో డిస్ కనెక్టు' కావడమనే చారిత్రక తప్పిదానికి పాల్పడ్డామని చెంపలేసుకునే వైఖరి లేదు. తమను ఓడించి ప్రజలే తప్పు చేశారనో,ఇప్పుడిప్పుడే వారికి తెలిసివస్తున్నదనో, తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాప పడుతున్నారనో బిఆర్‌ఎస్ నాయకత్వం అనుకుంటోంది.

స్థానిక ఎన్నికలే పార్టీ కింది స్థాయి నాయకులు, కార్యకర్తల రాజకీయ ఉనికికి ఆధారమని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. కాంగ్రెస్, బిజెపిలకు ఉన్న కిందిస్థాయి 'నెట్‌వర్క్' లేకపోవడం బిఆర్‌ఎస్‌కు ప్రతికూల అంశం. మూడు పార్టీల మధ్య స్థానిక సమరం జరగనున్నట్టు ఇప్పటికే ఒక వాతావరణం కనిపిస్తున్నది. ఇందులో కెసిఆర్ పార్టీ బాగా వెనుకబడి ఉంది. పైగా 'తెలంగాణ సెంటిమెంటు' వర్కవుట్ కాదన్న నిజం కెసిఆర్‌కూ తెలుసు. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంటు ఎన్నికలు, కంటోన్మెంట్ ఉప ఎన్నిక మినహాయిస్తే మరే ఎన్నికల్లోనూ బిఆర్‌ఎస్ పోటీ చేయలేదు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండిపోయింది. ఆయా ఎన్నికల్లో పోటీ చేయకపోవడానికి గల రాజకీయ వైఖరిని కూడా ఆ పార్టీ హైకమాండ్ స్పష్టం చేయలేకపోయింది. పార్లమెంటు ఎన్నికల్లో చిత్తు, చిత్తుగా ఓడిపోవడానికి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడానికి 'బిజెపితో అవగాహన' కారణమని ఆరోపణలున్నవి. బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య 'పొత్తు' ఉన్నట్టుగా పార్టీ కార్యకర్తల్లో అనుమానాలున్నాయంటూ ఎమ్మెల్సీ కవిత సంధించిన ప్రశ్నకు ఇంతవరకు జవాబు లేదు. దాంతో బిఆర్‌ఎస్ క్యాడర్‌లో మరింత అయోమయం నెలకొన్నది.

పాలకపక్షం కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కనే పరిస్థితి బిఆర్‌ఎస్‌లో కనిపించడం లేదు. పార్టీలో కుటుంబ కలహాలు, ఆధిపత్య పోరాటాలు పార్టీ శ్రేణుల్ని ప్రభావితం చేస్తున్నవి. కెసిఆర్ 2001లో పార్టీ స్థాపించిన 40 రోజుల్లోనే వచ్చిన 'స్థానిక' ఎన్నికలలో అనూహ్య విజయాలు సొంతం చేసుకున్న చరిత్ర ఉన్నది. నిజామాబాద్, కరీంనగర్ జిల్లా పరిషత్‌లను కైవసం చేసుకోవడం, వరంగల్ జడ్పీలోనూ ఆధిక్యాన్ని ప్రదర్శించడం అప్పట్లో పెను సంచలనం. అధికార కాంగ్రెస్ పార్టీకి సహజసిద్ధంగానే అనుకూల వాతావరణం ఉంటుంది. ఈ ఎన్నికలు కెసిఆర్, కెటిఆర్‌లకు అతి పెద్ద ఛాలెంజ్.

స్థానికసంస్థల ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా రావడం తరచూ చూస్తుంటాం. అందువల్ల తమ ఆధిపత్యాన్ని రుజువు చేసుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి ఇది మంచి అవకాశం. బిజెపి పట్టణ పార్టీ అనే ముద్ర తొలగించుకుంటున్నదని అనుకోవడానికి రాష్ట్రాల్లో బిజెపి విజయపరంపర ఒక సాక్ష్యం. తెలంగాణలోనూ అసెంబ్లీ కంటే, పార్లమెంటు ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత ఓట్లనూ పెద్ద మొత్తంలో కైవసం చేసుకున్నది. బిఆర్‌ఎస్ పార్టీ తనకు తానే బలహీనపడుతున్న వాతావరణం వలన లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లను గెల్చుకున్నది. దీన్ని మరొక రకంగా చెప్పాలంటే, బిఆర్‌ఎస్ కూడా పరోక్షంగా బిజెపికి ప్రయోజనం కలిగేలా ప్రవర్తించింది.

సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో గెలుపొందడానికి గాను అందరూ ఇక గ్రామాల బాట పట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 24 న గాంధీ భవన్‌లో పార్టీ సమావేశంలో పిలుపునిచ్చారు. ''9 రోజుల్లో 9 వేల కోట్లు, 70 లక్షల మంది రైతుల ఖాతాలో రైతు భరోసా వేశాం.. గత ప్రభుత్వం ఎగవేసిన రైతు భరోసాను కాంగ్రెస్ పార్టీ వేసింది. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ చేశాం. అప్పు నుండి రైతులను విముక్తులను చేశాం. కెసిఆర్ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారు. మేము అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నాం. పదేళ్లలో కెసిఆర్ కుటుంబసభ్యులు మాత్రమే సంపన్నులయ్యారు. రాష్ట్రాన్ని దివాలా తీయించారు. సంవత్సరంలోనే 60 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. 18 నెలల్లో లక్ష నాలుగు వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసిన ప్రభుత్వం మాది. కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నాం. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. వెయ్యి కోట్లతో పూర్తి కావాల్సిన కల్వకుర్తి ఎందుకు పూర్తి కాలేదు. గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చ పెడదాం. ఆధారాలతో సహా నేను వస్తా.. కెసిఆర్ చర్చకు రా.... గోదావరి జలాల విషయంలో కెసిఆర్ తెలంగాణకు శాశ్వతంగా మరణ శాసనం రాశారు''. అని అదే రోజు సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో రేవంత్ రెడ్డి తన స్టైల్‌లో ఉతికి ఆరేశారు.




బిసి రిజర్వేషన్లపై పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం వర్తింపజేస్తూ ఎన్నికలకు వెళతారా? అనే అంశం రాజకీయాల్లో సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది. దీనిపై తమ పార్టీ హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోవలసి ఉందని జూన్ 25న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మీడియాకు చెప్పారు. ఈ అంశంలో బిఆర్‌ఎస్, బిజెపిలు దాగుడుమూతలాడుతూ తప్పించుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత గురించి ప్రశిస్తున్నారు. తమ పార్టీ వైఖరి మాత్రం వెల్లడించడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినపుడు జరిగిన 2014 ఎన్నికలకు, తర్వాత 2019లో జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలకూ చాలా తేడా ఉన్నది. 2014లో మొత్తం 443 జడ్‌పిటిసిలకు గాను టిఆర్‌ఎస్ 191 గెల్చుకోగా, కాంగ్రెస్‌కు 176 స్థానాలు లభించాయి. తెలుగుదేశం పార్టీకి 53 స్థానాలు దక్కాయి. ఇతరులు 23 స్థానాలు గెలుచుకున్నారు. అయితే టిఆర్‌ఎస్ కన్నా కాంగ్రెస్ పార్టీకి ఎంపిటిసి స్థానాలు ఎక్కువగా లభించాయి. మొత్తం 6497 స్థానాలకు గాను టిఆర్‌ఎస్‌కు 1860 లభించగా, కాంగ్రెస్ పార్టీ 2315 స్థానాలు కైవసం చేసుకుంది. తెలుగుదేశం పార్టీ 1061 స్థానాలు గెల్చుకున్నది. ఆ తర్వాత జరిగిన పరిణామాలలో టిడిపి తెలంగాణలో బలహీనపడింది. 2019–2020 నాటికి టిడిపి దాదాపు ఉనికి కోల్పోయింది. 2019 స్థానిక ఎన్నికలలో కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల జడ్‌పిటిసిల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికల్లో నాటి అధికారపక్షం టిఆర్‌ఎస్ 446 స్థానాలను కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ పార్టీకి 75 స్థానాలు, బిజెపికి 8 జడ్‌పిటిసిలు లభించాయి. ఎంపిటిసి స్థానాల్లోనూ టిఆర్‌ఎస్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. 3,556 ఎంపీటీసీ స్థానాలు టిఆర్‌ఎస్ ఖాతాలో పడ్డాయి. కాంగ్రెస్ 1377 స్థానాల్లో గెలవగా, బిజెపికి 211 ఎంపిటిసిలు దక్కాయి.

కాగా సర్పంచ్ ఎన్నికలు పార్టీల గుర్తుపై జరగకపోయినా టిఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు 7,774 మంది గెలిచారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు 2709 మంది, బిజెపి సర్పంచ్ అభ్యర్థులు 163 గెలుపొందారు. 'సంస్థాగతం'గా ఏ పార్టీకి ఎంత బలం ఉందో గ్రామ స్థాయిలో జరిగే సర్పంచ్ ఎన్నికలు ఒక సూచిక. ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్రజలకు మధ్య స్థానిక ప్రజాప్రతినిధుల వ్యవస్థ ఒక వారధిగా ఉంటుందని భావించాలి.

కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితులు లేవని, ప్రభుత్వ వ్యతిరేక గాలి బలంగా వీస్తోందని, ఏ ఎన్నికలు వచ్చినా జనం తమను గెలిపించాలని కంకణం కట్టుకున్నారని ఒక ప్రచారాన్ని బిఆర్‌ఎస్ ఉధృతం చేసింది. దీన్నే 'థాట్ పోలీసింగ్' అంటారు. జనం ఏమి ఆలోచిస్తున్నారో, ఏ నిర్ణయం తీసుకోవాలని అనుకుంటున్నారో అందుకు విరుద్ధంగా క్యాంపెయిన్ చేయడమే థాట్ పోలీసింగ్ లక్ష్యం. తమకున్న సంపద, అపార వనరులు, మీడియా, సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి ఊరూరా థాట్ పోలీసింగ్ జరుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నెమ్మదిగా ఏర్పడుతున్న 'ఫీల్ గుడ్ ఫ్యాక్టర్‌ను, కనుమరుగు చేసి' ఈ ప్రభుత్వం పనయిపోయింది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనయిపోయింది' అనే ప్రచారానికి ఎర్రవల్లి ఫార్మ్‌హౌస్‌లో డిజైన్ చేశారు. దాన్ని విజయవంతంగా అమలు చేసే బాధ్యతను కెటిఆర్ తన భుజాలపై వేసుకున్నట్టు తెలియవచ్చింది.

కాంగ్రెస్ పార్టీ చెబుతున్న 'సామాజిక న్యాయం', తమ పార్టీ ఎమ్మెల్సీ కవిత చెబుతున్న 'సామాజిక తెలంగాణ' బిఆర్‌ఎస్‌ను వెంటాడే అంశాలు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలతో ఈ స్థానిక ఎన్నికల్లో దీటుగా తలపడాలని బీజేపీ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కమ్యూనిస్టు పార్టీల ప్రభావం బలంగానే ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదిరింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఈ పొత్తులకు అవకాశాలున్నవి. ఇవి నిస్సందేహంగా కాంగ్రెస్ పార్టీకి ప్లస్ పాయింటు.

## పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు?

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసి 17 మాసాలు పూర్తి కావస్తుంది. పలు కారణాలతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ వాయిదా పడుతూ వచ్చింది. రాష్ట్రంలో 2018 డిసెంబర్‌లో నూతన గ్రామ పంచాయతీ చట్టాన్ని అమలు చేశారు. ఈ చట్టం ప్రకారం బిసి రిజర్వేషన్లు తగ్గడంతో పాటు ఒకే రిజర్వేషన్ రెండు దఫాలుగా అమలయ్యేటట్లు చట్టాన్ని రూపొందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ చట్టం–2018 సవరించింది. దీని ప్రకారం ఇప్పుడు రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు 2024 జనాభా లెక్కల ప్రకారం బిసి రిజర్వేషన్లు తేలాల్సి ఉంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 52 శాతం బిసి జనాభా ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, బిసి సంఘాలు అంతకంటే ఎక్కువగా ఉంటుందని వాదిస్తున్నాయి. జనాభా ప్రతిపాదికనే బిసి రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 17 మాసాలైన పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లో ఉంది. సమయాన్ని కేటాయించకపోవడం, ఎన్నికల నిర్వహణ లేక కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు వచ్చే నిధులు రాకపోవడంతో పంచాయతీల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 30 రోజుల్లో రిజర్వేషన్‌లను తేల్చి, తర్వాత 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. బిసి రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి పార్లమెంటులో బిల్లు ఆమోదించాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపింది. పార్లమెంటులో చర్చించిన తర్వాత రిజర్వేషన్ బిల్లు అమలు కావాల్సి ఉంది. జులై మాసంలో పార్లమెంటు సమావేశాలు జరిగిన న్యాయస్థానం ఇచ్చిన గడువు లోపల బిల్లు ఆమోదం పొందుతుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఒకవేళ పాత పద్ధతిలోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తే గత రిజర్వేషనే అమలయ్యే పరిస్థితి ఉంది. అప్పుడు రిజర్వేషన్ల మార్పు అవసరం ఉండదు. బిసి రిజర్వేషన్లు పెరగని పక్షంలో పార్టీపరంగా 42 శాతం బిసిలకు కేటాయించేలా నిర్ణయం చేస్తే బాగుంటుందన్న చర్చ కాంగ్రెస్‌లో సాగుతుంది. కానీ ఇది క్షేత్రస్థాయిలో అమలు సాధ్యమా? అన్న ప్రశ్నకు కాంగ్రెస్ వద్ద సమాధానం లేదు. ఎందుకంటే గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్నందున గుర్తులు, బి–ఫాంలాంటివి పార్టీపరంగా ఇచ్చే అవకాశం లేదు. కాబట్టి, ఇది అమలు చేయడం అంత తేలిక కాదు. ఒక పార్టీ నుంచే సర్పంచ్ అభ్యర్థులుగా ఇద్దరు, ముగ్గురు పోటీ చేసే అవకాశం ఉన్నందున రిజర్వేషన్లు పార్టీపరంగా అమలు చేయడం కష్టమే. మొత్తంగా జులై 25లోపు గ్రామ పంచాయతీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ పెంపు ప్రక్రియను అమలు చేసే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ రిజర్వేషన్ గందరగోళం మధ్య ఏమి పాలుపోక సతమతమవుతున్నారు. మరో కొద్ది రోజుల్లోనే రిజర్వేషన్ల భవితవ్యం తేలనుంది. అది తేలితేనే పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యం.

– ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 345 రాజకీయ పార్టీలపై 'ఇసి కొరడా'




**న్యూఢిల్లీ :** రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిష్టర్డ్ అన్ రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్) గుర్తించి వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని ఇసి గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయని ఇసి పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6 శాతం ఓట్లను లేదా నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి. మిగిలిన పార్టీలను నమోదిత గుర్తింపులేని పార్టీలుగానే పరిగణిస్తారు.

## ఎస్‌సిఒ సదస్సులో
# భారత్ సంచలనం

### ఉమ్మడి ప్రకటనపై సంతకానికి రాజ్‌నాథ్ నిరాకరణ
### పహల్గామ్ ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంపై నిరసన




క్వింగ్డావో (చైనా): ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేందుకు సీమాంతర ఉగ్రవాదాన్ని కొన్నిదేశాలు ప్రభుత్వ విధానంగా మార్చుకున్నాయని భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాక్ పేరు ఎత్తకుండా చురకలంటించారు. ఇక్కడ జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) రక్షణమంత్రుల సదస్సులో రాజ్‌నాథ్ మాట్లాడుతూ... 'మన ప్రాంతం శాంతి, భద్రత, అవిశ్వాసం అనే అతి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటోంది. రాడికలిజం, తీవ్రవాదం, ఉగ్రవాదం పెరగటమే సమస్యలకు మూల కారణం. ఉగ్రవాద గ్రూపుల చేతుల్లో విధ్వంసాలకు కారణమయ్యే ఆయుధాలు ఉండకూడదు. ఈ సవాళ్లను ఎదుర్కోడానికి నిర్ణయాత్మకమైన చర్య అవసరం. మన భద్రత కోసం ఈ దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. అందుకోసం మనమంతా ఐక్యం ఉండాలి. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఉగ్రవాదం ముప్పును ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్న దేశాలను విమర్శించడానికి ఎస్‌సీఓ వెనుకాడకూడదు' అని పేర్కొన్నారు. సదస్సు తర్వాత విడుదల చేయాల్సిన సంయుక్త ప్రకటనలో పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవటంతో దానిపై సంతకం చేసేందుకు నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను ఎస్‌సీఓ రద్దు చేయాల్సివచ్చింది. రక్షణ మంత్రుల సదస్సులో భారత్‌తోపాటు బెలారస్, చైనా, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. సదస్సు అనంతరం రూపొందించిన సంయుక్త ప్రకటన ఉగ్రవాదంపై భారత కఠిన వైఖరిని ప్రతిబింబించలేకపోయింది. అంతేగాక ఎస్‌సీఓ సదస్సుకు అధ్యక్షత వహించిన చైనా జమ్ముకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడి ఘటనను ప్రస్తావించకుండా బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం చేసింది. దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు నిరాకరిస్తున్నట్లు రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటంతో సదస్సు అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఎస్‌సీఓ రద్దు చేసింది.

**ఉగ్రవాదాన్ని భారత్ సహించదు**

సదస్సులో పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి కూడా రాజ్‌నాథ్ వివరించారు. పహల్గామ్ ఘటన భారత్‌లో లష్కరే తోయిబా గతంలో చేసిన ఉగ్రవాద దాడులతో సరిపోలుతుందని చెప్పారు. భారత్ ఉగ్రవాదాన్ని సహించదు అనే విషయం తీసుకుంటున్న చర్యల ద్వారానే స్పష్టంగా కనిపిస్తోందని రాజ్‌నాథ్ అన్నారు. ఉగ్రవాదం నుంచి తమను తాము కాపాడుకునే హక్కు ఉందని తెలిపారు. ఉగ్రవాద శిబిరాలు ఎప్పటికీ సురక్షితం కాదని, వాటిని లక్ష్యం చేసుకునేందుకు వెనుకాడబోమని చేతల్లో చూపించామని చెప్పారు. ఇక యువతలో రాడికలిజాన్ని వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మనం కూడా చురుకైన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 'ఎస్‌సీఓలోని యంత్రాంగం ఈ విషయలలో గణనీయమైన పాత్ర పోషించింది. భారత్ అధ్యక్షత వహించిన సమయంలో ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి దారితీసే రాడికలైజేషన్‌ను ఎదుర్కోవడంపై ఎస్‌సీఓ దేశాధినేతలు సంయుక్త ప్రకటన విడుదల చేయడం మన ఉమ్మడి నిబద్ధతకు ప్రతీక' అని రాజ్‌నాథ్ తెలిపారు.

## ముంబయిలో ఓ ఇల్లు కొనాలంటే...
# 100 ఏళ్ల పొదుపు అవసరం !
### లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి అంకెల గారడీపై గురువారం కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ పరోక్షంగా మండిపడ్డారు. ప్రత్యేకించి పెద్ద నగరాలలో ఇళ్ల ధరలు తీవ్రంగా పెరిగిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఈ సారి ఎవరైనా మీ ముందు స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) గణాంకాలను చెప్పినట్లయితే మీరు వెంటనే వారికి మీ దేశీయ బడ్జెట్ గురించి నిజం చెప్పండి అని సూచించారు. రాహుల్ గాంధీ తన వాట్సాప్ చానల్‌లో షేర్ చేయబడిన ఒక మీడియా నివేదికపై ఆరోపణాస్త్రాలు సంధిస్తూ మహారాష్ట్రలోని పట్టణ కుటుంబాలలో టాప్ 5శాతంలో ఉన్నవారికి కూడా ముంబయిలో ఒక ఇల్లు కొనుగోలు చేయడానికి 100 ఏళ్ల పొదుపు అవసరం అవుతుందని పేర్కొన్నారు. 'ఔను మీరు సరిగ్గానే చదివారు. ఒకవేళ మీరు దానిని నమ్మకపోతే ఇలా చెప్పండి. నన్న తిరిగి చెప్పనివ్వండి. ముంబయిలో ఒక ఇల్లు కొనాలంటే భారతదేశంలోని ధనవంతులలో అగ్రస్థానంలో ఉన్న ఐదుగురు కూడా వారి ఆదాయంలో 30శాతాన్ని రానున్న 109సంవత్సరాల కోసం పొదుపుచేయాల్సి ఉంటుంది' అని రాహుల్ గాంధీ విపులీకరించారు.చాలా పెద్ద నగరాలలో పరిస్థితి ఇది ఇక్కడ మీరు పెద్ద అవకాశాల కోసం వెతుకుతుంటారు. ఇంత ఎక్కు వ ఎక్కడ నుంచి వస్తుంది అని ప్రశ్నిస్తూ రాహుల్‌గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్ చేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజల వారసత్వం అంటే సంపద కాదు కానీ బాధ్యతలు?. పిల్లలకు ఖరీదైన విద్య, వారికి ఖరీదైన చికిత్స పేరెంట్స్ బాధ్యతగా ఉంటాయి. అంతేకాకుండా కుటుంబం కోసం ఒక చిన్నకారు కూడా బాధ్యతగా భావిస్తుంటారు అని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వివరించారు. ఏదో ఒక రోజు మనం సొంతంగా ఒక ఇల్లు కొంటామని కలలు కంటూనే ఉంటారు. అయితే వారు ధనవంతులు కావాలంటే ఇంకా 10 9సంవత్సరాలు ఎప్పటికి పూర్తి కావాలని వారు తీవ్రంగా మదన పడుతూనే ఉంటారు. పేదలు తమ కలల హక్కును సాధించుకోవాలనే ఆకాంక్షకు ఇంకెంతకాలం దూరం చేస్తారు' అని రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ప్రతీ కుటుంబానికీ నాలుగు గోడల మధ్య సౌకర్యవంతమైన ఒక ఇల్లు అవసరం. కానీ దురదృష్టవశాత్తు దానిని మీరు పొందడానికి మీ జీవితకాలం కంటే ఎక్కువ ఖర్చు అవుతుంది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## నేవీ ఉద్యోగి అరెస్ట్
### ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు రహస్య సమాచారం చేరవేత

జైపూర్ : పాకిస్థాన్ కోసం గూఢచర్యానికి పాల్పడిన నేవీ ఉద్యోగిని రాజస్థాన్ సిఐడి నిఘా విభాగం అరెస్ట్ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా పాక్‌కు రహస్య సమాచారాన్ని అతడు చేరవేసినట్లు నిర్ధారణ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలోని నేవీ ప్రధాన కార్యాలయంలో హర్యానాకు చెందిన విశాల్ యాదవ్ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. పాకిస్థాన్ నిఘా సంస్థ (ఐఎస్ఐ)కు చెందిన మహిళా ఏజెంట్ ప్రియా శర్మతో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. దీంతో నేవీ కార్యకలాపాలు, రక్షణ సంస్థలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని ఆమెకు షేర్ చేశాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా కీలకమైన రక్షణ సమాచారాన్ని పాకిస్థాన్‌కు లీక్ చేశాడు. కాగా, పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలను రాజస్థాన్ సిఐడి నిఘా విభాగం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ నేపథ్యంలో పాక్ మహిళా ఐఎస్ఐ ఏజెంట్ ప్రియా శర్మతో విశాల్ యాదవ్‌కు సంబంధాలున్నట్లు గుర్తించారు. దీంతో అతడిపై నిఘా పెట్టారు. నేవీతో పాటు ఇతర రక్షణ సంస్థల రహస్యాలను పాక్ మహిళకు అతడు షేర్ చేస్తున్నట్లు తెలుసుకుని అరెస్ట్ చేశారు. అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో వైపు విశాల్ యాదవ్ మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. దీంతో పాక్ మహిళ ప్రియా శర్మతో చాలా ఏళ్లుగా అతడు సంప్రదింపులు జరుపడంతోపాటు ఆమెకు కీలక సమాచారం పంపినట్లు నిర్ధారణ అయ్యిందని పోలీస్ అధికారి తెలిపారు. క్రిప్టో లావాదేవీల ద్వారా అతడికి డబ్బును ఆమె చెల్లించినట్లు తెలిసిందని చెప్పారు. ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన విశాల్ యాదవ్ ఆర్థికంగా నష్టపోవడంతో గూఢచర్యానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. జైపూర్‌లోని సెంట్రల్ ఇంటరాగేషన్ సెంటర్‌లో దర్యాప్తు సంస్థలు అతడ్ని ప్రశ్నిస్తున్నాయి. గూఢచర్య నెట్‌వర్క్‌లో ఇతర వ్యక్తులు పాల్గొన్నారా అన్నది ఆరా తీస్తున్నారు.

## బ్లాక్‌బాక్స్ డేటా డౌన్‌లోడ్
### ఎఐ విమాన ప్రమాద కారణాలు తెలిసే అవకాశం


**న్యూఢిల్లీ:** ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన దర్యాప్తులో ఏఏఐబీ పురోగతి సాధించింది. ఢిల్లీలోని ఏఏఐబీ ల్యాబ్ బ్లాక్‌బాక్స్ డేటాను పూర్తిస్థాయిలో డౌన్‌లోడ్ చేసింది. ఈ మేరకు కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన చేసింది. సివిఆర్, ఎఫ్‌డిఆర్ డేటాను నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీంతో బ్లాక్ బాక్స్ డేటా ద్వారా ప్రమాద సమయంలో ఏం జరిగిందనే విషయం తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. అలాగే ప్రమాదానికి గల కారణాలు కూడా తెలుసుకోవచ్చు. భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు బ్లాక్‌బాక్స్ డేటా విశ్లేషణ ఉపకరించనుందని పౌర విమానయాన శాఖ తెలిపింది. 'విమాన ప్రమాదం తర్వాత ఘటనపై ద ర్యాప్తునకు జూన్ 13న ఎఎఐబి డిజి నేతృత్వంలో బందాన్ని ఏర్పాటు చేసింది. అదే రోజున ఘటనాస్థలంలోని రూఫ్‌టాప్‌పై ఫ్లైట్ డేటా రికార్డర్లు, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లను గుర్తించాం. ఆ త ర్వాత విమాన బ్లాక్‌బాక్సులను కూడా స్వాధీనం చేసుకుని అత్యంత భద్రత నడుమ ఢిల్లీకి తరలించాం. జూన్ 24 నుంచి వీటిల్లోని డేటాను బ యటకు తీసే ప్రక్రియను సాంకేతిక బందం చేపట్టింది. విమానం ముందువైపు ఉండే బ్లాక్‌బాక్స్ నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్‌ను కూడా సురక్షితంగా బయటకు తీశాం. జూన్ 25న మెమొరీ మాడ్యూల్‌ను విజయవంతంగా యాక్సెస్ చేసి అందులోని డేటాను ఎఐబి ల్యాబ్‌లో డౌన్‌లోడ్ చేశాం. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్‌లో ఉన్న డేటా విశ్లేషణ జరగుతోంది. ఫలితంగా ప్రమాద సమయంలో ఏం జరిగిందో తెలుసుకునేందుకు, ప్రమాద కారణాలను వెలికితీసేందుకు అవకాశం ఏర్పడింది. భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు ఈ విశ్లేషణ ఉపయోగపడుతుంది' అని కేంద్ర విమానయాన శాఖ పేర్కొంది.

## ఫ్రెంచ్ మహిళపై లైంగికదాడి ఘటన దేశానికే అవమానం
### ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఖండన
### దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
### మహిళల రక్షణలో రాజస్థాన్ ప్రభుత్వం విఫలం



**న్యూఢిల్లీ:** ఉదయపూర్‌లో ఫ్రెంచ్ పర్యాటకురాలిపై లైంగిక దాడి ఘటనను భారతీయ మహిళా జాతీయ సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు ఓ ప్రకటన విడుదల చేస్తూ... ఉదయపూర్‌లో ఫ్రెంచ్ మహిళా పర్యాటకురాలిపై జరిగిన లైంగిక దాడి ఘటన రాజస్థాన్‌కు మాత్రమే కాకుండా మొత్తం దేశానికే తీవ్ర తలవంపులు తెచ్చిందన్నారు.'' 'అతిథి దేవో భవ', 'పధరోమ్హారే దేశ్' వంటి నినాదాలను గర్వంగా ఎలుగెత్తి చాటే రాష్ట్రంలో ఈ దారుణమైన నేరం జరిగింది. ఈ ఉన్నత ఆదర్శాల వెనుక ఉన్న భయంకరమైన వాస్తవికతను ఇది స్పష్టంగా బహిర్గతం చేస్తుంది. మహిళల భద్రతను నిర్ధారించడంలో శాంతిభద్రతల వ్యవస్థ వైఫల్యాన్ని ఎత్తిచూపుతుంది'' అని ఆమె అన్నారు. ఈ అనాగరిక చర్యను ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తీవ్రంగా ఖండిస్తోందని, నేరస్థులపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన లోతుగా పాతుకుపోయిన స్త్రీ ద్వేషపూరిత మనస్తత్వానికి వ్యక్తీకరణ మాత్రమే కాదని... పర్యాటకులు, మహిళలను రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం చెందిందని తెలిపారు. రాజస్థాన్ ప్రభుత్వం తక్షణం దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, మహిళలు, పర్యాటకుల భద్రతను అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకోవాలని, రాష్ట్రంలో మహిళలపై నేరాలను నివారించడానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ డిమాండ్ చేసింది. మహిళలపై జరిగే అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా గళమెత్తాలని, న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఇటీవల ఫ్రెంచ్ మహిళపై రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అత్యాచారం జరిగింది. యాట్ షూట్ కోసం ఉదయ్‌పూర్ వచ్చిన సదరు పర్యాటకురాలిపై ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు చెందిన ఉద్యోగి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఉదయ్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగానే కాకుండా, అంతర్జాతీయంగా కలకలం రేపింది.

## భార్య సంపాదిస్తున్నా కూడా
# విడిపోయిన భర్త నుంచి భరణం పొందవచ్చు
### బాంబే హైకోర్ట్ తీర్పు
### ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులను రద్దుచేయాలన్న పిటిషన్‌దారు అభ్యర్థన తిరస్కృతి



**ముంబయి:** విడిపోయిన భర్త నుంచి భార్య ఆర్థిక సహాయం (భరణం) ఎందుకు పొందాలన్న విషయమై బాంబే హైకోర్టు మరింత స్పష్టతను ఇచ్చింది. ఒక మహిళ సంపాదిస్తున్నందున, భర్త నుంచి విడిపోయిన నేపథ్యంలో ఆమె ఎప్పటిమాదిరిగానే తన జీవనప్రమాణాలను కొనసాగించాల్సి ఉంటుంది కాబట్టి విడిపోయిన భర్త నుంచి ఆర్థిక సహాయం పొందకుండా నిరోధించబడకూడదని బాంబే హైకోర్టు తీర్పు ఇచ్చింది. భరణం ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలన్న భర్త అభ్యర్థనను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. జూన్ 18న ఈ విషయమై ఉత్తర్వులు జారీచేసిన జస్టిస్ మంజూష దేశ్‌పాండే నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఆ కాపీని అందుబాటులో ఉంచింది. భార్య విడిపోవడానికి ముందు ఆమె అలవాటుపడిన జీవన ప్రమాణాలను కొనసాగించేందుకు అర్హురాలని అందులో స్పష్టంచేసింది. 2023 ఆగష్టులో ఒక ఫ్యామిలీ కోర్టు తన భార్యకు నెలకు రూ.15,000 మొత్తాన్ని ఆమె మెయింటెనెన్స్ కోసం చెల్లించాలని ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన ఒక పిటిషన్‌ను బాంబే హైకోర్టు రద్దు చేసింది. తన భార్య వర్కింగ్ ఉమెన్‌గా నెలకు రూ.25,000 మొత్తానికి పైగా సంపాదిస్తోందని ఆమె నుంచి విడిపోయిన భర్త చెప్పారు. అందువల్ల అతడి నుంచి మెయింటెనెన్స్ పొందే అవసరం లేదని కోర్టుకు చెప్పారు. హైకోర్టు తన ఉత్తర్వులో పిటిషన్‌దారుడి భార్య సంపాదిస్తున్నప్పటికీ ఆదాయం తన సొంత మెయింటెనెన్స్‌కు సరిపోకపోవచ్చని, ఆమె తన ఉద్యోగం కోసం ప్రతీరోజూ ఎంతో దూరం ప్రయాణం చేస్తున్నందున ఆమె సొంత పోషణకు గాను ఆ ఆదాయం ఏమాత్రం చాలకపోవచ్చని పేర్కొంది. కొద్దిమొత్తంలోని తన ఆదాయంతో ఆమె ఒక డీసెంట్ జీవితాన్ని గడిపే పరిస్థితి ఉండకపోవచ్చని హైకోర్టు తెలిపింది.'భార్య సంపాదిస్తున్నందున ఆమె తన వైవాహిక ఇంటిలో అలవాటు పడిన అదేరకమైన జీవనప్రమాణాలను కొనసాగించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితులలో విడిపోయిన భర్తనుంచి భరణం మద్దతు పొందకుండా నిరోధించకూడదు' అని న్యాయమూర్తి జస్టిస్ దేశ్‌పాండే చెప్పారు. తన నెలవారీ సంపాదన ప్రకారం విడిపోయిన తన భార్యకు నెలకు రూ.15,000కంటే ఎక్కువ ఇచ్చే పరిస్థితులలో లేనని, ఒక మనిషిగా తానుకూడా జబ్బునపడ్డటువంటి తన పేరెంట్స్‌ను చూసుకోవాల్సి ఉంటుందని కోర్టుకు విన్నవించాడు. కాగా అతడు తాను ఆర్థికంగా స్థిరంగా లేనని కోర్టుకు చెప్పడాన్ని అతడి విడిపోయిన భార్య తిరస్కరించింది. అతను నెలకు రూ.ఒక లక్షకు పైగానే సంపాదిస్తున్నాడని ఆమె ఆరోపించింది. ఆ మహిళ ప్రస్తుతం తన కుటుంబసభ్యులు, సోదరుడితో కలిసి ఉంటుందని, అలా ఆమె నిరవధికంగా అలాగే ఉంటూ తీవ్ర అసౌకర్యానికి బలమైన కారణం కావచ్చని, వారందరి జీవనభారాన్ని ఆమె చూసుకోవడాన్ని అనుమతించలేమని హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఆ వ్యక్తి కుటుంబసభ్యులు అతడిపై ఆధారపడిలేరని, అతడి తండ్రికి నెలకు రూ.28,000పెన్షన్ మొత్తాన్ని పొందుతున్నాడని కోర్టు తెలిపింది. ఇరువురి ఆదాయం మధ్య పెద్ద వ్యత్యాసమే ఉందని, ఆ వ్యత్యాసం పోల్చలేనంత రీతిలో ఉన్నదని హైకోర్టు తెలియజేస్తూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేసేందుకు తిరస్కరించింది.




## అలకనంద నదిలో పడ్డ బస్సు
### ముగ్గురు మృతి, 8 మందికి గాయాలు
### మరో 9 మంది గల్లంతు

**రుద్రప్రయోగ్ :** ఉత్తరాఖండ్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుండి బద్రీనాథ్‌కు యాత్రికులను తీసుకెళ్తున్న 31 సీట్ల బస్సు అలకనంద నదిలో పడింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, ఎనిమిది మంది గయపడ్డారు. మరో తొమ్మిది మంది గల్లంతయినట్లు పోలీసులు తెలిపారు. రుద్రప్రయాగ్, గౌచర్ మధ్య బద్రీనాథ్ జాతీయ రహదారిపై ఘోల్తీర్ గ్రామం సమీపంలో వాహనం ప్రమాదానికి గురైందని వారు తెలిపారు. నదీ ఉధృతంగా ప్రవహిస్తుండడం వల్ల స్థానిక గ్రామస్తుల సహాయంతో సహాయక చర్యలు, రక్షణ చర్యలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు మూడు మృతదేహాలను వెలికితీసినట్లు రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వర్ తెలిపారు. మూడవ మృతదేహాన్ని మధ్యప్రదేశ్‌లోని రాజ్ గఢ్‌కు చెందిన గౌరీ సోని (41)గా గుర్తించినట్లు ఆయన తెలిపారు. రెండు మృతదేహాలను ముందుగా స్వాధీనం చేసుకున్నామని, ఒకటి ప్రమాద స్థలం సమీపంలో, మరొకటి రుద్రప్రయాగ్ సమీపంలోని నది నుండి వెలికితీసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ రెస్క్యూ టీం సభ్యుడు సత్యేంద్ర సింగ్ భండారి పిటిఐకి తెలిపారు. వారిని మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌కు చెందిన విశాల్ సోని (42), గుజరాత్‌లోని సూరత్ నివాసి డ్రిమ్మీ (17)గా గుర్తించారు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో బస్సు పెద్ద శబ్దంతో రోడ్డుపై వందల అడుగుల లోతున నదిలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రమాద స్థలానికి సమీపంలో నివసించే భండారి తెలిపారు. ఆ శబ్దం విన్న వారందరూ ప్రమాద స్థలానికి చేరుకున్నారని ఆయన అన్నారు. హరిద్వార్‌లోని కంఖల్‌కు చెందిన గాయపడిన వాహనం డ్రైవర్, బస్సు ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టడంతో నదిలో పడిపోయిందని చెప్పారు. గంటకు 10-20 కిలోమీటర్ల వేగంతో బస్సు నడుపుతున్నానని, భజనలు వింటూ హాయిగా వెళ్తుండగా ఒక ట్రక్కు బస్సును బలంగా ఢీకొట్టగా లోయలోకి పడిపోయిందని డ్రైవర్ సుమిత్ చెప్పాడు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు సహా ఎనిమిది మంది గాయపడగా, మరో తొమ్మిది మంది గల్లంతయ్యారని ఎస్పీ కార్యాలయం తెలిపింది. గాయపడిన వారిని జిల్లా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఎయిమ్స్, రిషికేశ్‌కు తరలించారు. నదిలో పడిపోయినప్పుడు వాహనంలో డ్రైవర్‌తో సహా 20 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు.

## భద్రతా దళాల వలలో ముష్కరులు

జమ్ము : జమ్ముకశ్మీర్ ఉధంపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో జైషే మహమ్మద్ ఉగ్రవాదుల కోసం ఒక సంవత్సర కాలంగా గాలిస్తుండగా, వారిలో ఇప్పుడు నలుగురు ఉగ్రవాదులు చిక్కుకున్నారని, వర్షం, పొగమంచులో ఆ ముష్కరులను మట్టుబెట్టడానికి భద్రతా దళాలు ప్రయత్నిస్తున్నాయని అధికారులు తెలిపారు. జిల్లాలోని బసంత్‌గఢ్‌లో మారుమూల బిహాలి ప్రాంతంలో గురువారం ఉదయం నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా సైన్యం, పోలీసుల సంయుక్తంగా గాలింపు ఆపరేషన్ ప్రారంభించింది. దీంతో ఇరు వర్గాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ బలగాలు వేగంగా రంగంలోకి దిగి ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఉగ్రవాదుల జాడ తెలిసింది, వారు నలుగురు ఉన్నట్లు భావిస్తున్నామని, సంవత్సరం కాలం నుండి ఈ గుంపును ట్రాక్ చేస్తున్నామని జమ్ము రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ భీమ్ సేన్ టుటి ఇక్కడ ఒక కార్యక్రమానికి హాజరైన విలేకరులతో అన్నారు. మంచు పరిస్థితులు ఉన్నప్పటికీ గాలింపు ఆపరేషన్ జరుగుతోందని, వాతావరణం మెరుగుపడిన తర్వాత వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

# హిమాచల్‌ను ముంచెత్తిన వరదలు
### హైడ్రో ప్రాజెక్టు నుంచి నీరు పోటెత్తడంతో పలువురు గల్లంతు
### నాలుగు మృతదేహాల వెలికితీత



**న్యూఢిల్లీ :** హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు ఓ విపత్తులా మారిపోయాయి. ఈ ప్రాకృతిక దుర్ఘటనలు ప్రాణనష్టంతోపాటు ఆస్తి నష్టాన్ని కూడా కలిగించాయి. కాంగ్రా జిల్లాలోని ఒక హైడ్రో ప్రాజెక్ట్ సైట్ నుండి బుధవారం ఆకస్మిక వరదలు సంభవించడంతో పలువురు గల్లంతయ్యారు. తాజాగా మరో రెండు మృతదేహాలను వెలికితీయగా, మృతుల సంఖ్య నాలుగుకు పెరిగిందని అధికారులు తెలిపారు. బుధవారం రెండు మృతదేహాలను వెలికితీయగా, గురువారం మరో రెండు మృతదేహాలను గుర్తించినట్లు అదనపు డిప్యూటీ మేజిస్ట్రేట్ కాంగ్రా శిల్పా బెక్త తెలిపారు. మరణించిన వారిని జమ్ముకశ్మీర్ నివాసి చైన్ సింగ్, చంబాకు చెందిన ఆదిత్య ఠాకూర్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పర్దీప్ వర్మ, చందన్‌లుగా గుర్తించినట్లు కాంగ్రా ఎస్‌పి షాలిని అగ్నిహోత్రి గురువారం తెలిపారు. బుధవారం కాంగ్రా, కులు జిల్లాల్లో మేఘావృతాల కారణంగా సంభవించిన ఆకస్మిక వరదల నుండి ఇంకా కనిపించకుండా పోయిన ఏడుగురు వ్యక్తుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. చంబా జిల్లాకు చెందిన లఫ్లీ మాట్లాడుతూ, ప్రాజెక్ట్ సైట్ సమీపంలోని అడవి నుండి గాలింపు బృందాలు రక్షించిన శిబిరంలో 13 మంది ఉన్నారని, వారిలో ఐదుగురు కొండల వైపు పారిపోగా, మిగిలిన వారు ఉప్పొంగే నీటిలో కొట్టుకుపోయారని చెప్పారు. వరదలు వస్తున్నాయని గమనించి, కింద ఉన్న వారిని అప్రమత్తం చేయడానికి, సురక్షితంగా బయటకు పరిగెత్తడానికి ముందు కేకలు వేశామని దయా కిషన్ అనే కార్మికుడు చెప్పాడు. వరదల సమయంలో ప్రాజెక్టు స్థలం నుండి కొట్టుకుపోయిన వ్యక్తులను వెతకడానికి ప్రయత్నిస్తున్నామని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) కమాండెంట్ బల్జిందర్ సింగ్ తెలిపారు. కులు జిల్లాలోని రెహ్లో బిహాల్ వద్ద ముగ్గురు వ్యక్తుల ఆచూకీ ఇంకా తెలియలేదు. ఖనియారా గ్రామంలోని మనుని ఖాడ్ వద్ద నీటి మట్టం పెరగడంతో బుధవారం సాయంత్రం ఇందిరా ప్రియదర్శిని జలవిద్యుత్ ప్రాజెక్టు స్థలం సమీపంలోని తాత్కాలిక కార్మిక కాలనీలో ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు నిర్ధారించగా, దాదాపు 15-20 మంది కార్మికులు కొట్టుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. తప్పిపోయిన వారిలో కొంతమందిని రక్షించినప్పటికీ, ఎంతమందిని రక్షించారో అధికారులు కచ్చితంగా చెప్పలేదు. ప్రతికూల వాతావరణ ఉన్నప్పటికీ ఎన్‌డిఆర్‌ఎఫ్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్), పోలీసులు, హోమ్ గార్డుల సంయుక్త శోధన బృందాలు పనిలో ఉన్నాయని ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన సింగ్ అన్నారు. వరదల సమయంలో తనను తాను రక్షించుకోవడానికి సమీపంలోని కొండకు పారిపోయిన మరొక వ్యక్తిని కనుగొన్నట్లు అధికారులు తెలిపారు. తప్పిపోయిన వారిలో కొందరు హిమాచల్ ప్రదేశ్‌లోని నూర్పూర్, చంబా ప్రాంతాలకు చెందినవారు కాగా, మరికొందరు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని వారు తెలిపారు. కాగా, బుధవారం రాత్రి నాటికి దాదాపు 250-275 మంది కార్మికులు ఘటన స్థలంలో ఉన్నారని, వారందరికీ ఖనియారాలోని అంబేద్కర్ భవన్‌లో తాత్కాలిక ఆశ్రయం కల్పించామని అధికారులు తెలిపారు. వర్షం కారణంగా ప్రాజెక్ట్ పనులు నిలిపివేశారని, కార్మికులు సైట్ సమీపంలోని తాత్కాలిక ఆశ్రయాలలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు మనుని ఖాడ్, సమీపంలోని కాలువల నుండి వరద నీరు వారి వైపుకు మళ్లిందని, దీనివల్ల చాలా మంది కొట్టుకుపోయారని అధికారులు తెలిపారు. కులు జిల్లాలోని రెహ్లో బిహాల్ వద్ద వరదలో కొట్టుకుపోయిన 14 ఏళ్ల బాలుడితో సహా ముగ్గురు వ్యక్తులు ఇప్పటికీ కనిపించడం లేదు, వారి కోసం అన్వేషణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ తోరుల్ ఎస్ రావేష్ మాట్లాడుతూ, కులులో ఎన్‌డిఆర్‌ఎఫ్ సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు, పర్యాటకులు లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని ఆమె హెచ్చరించారు. జిల్లాలోని మనాలి, బంజార్ నుండి కూడా ఆకస్మిక వరదలు సంభవించాయని నివేదకలొచ్చాయి. కుల్లులోని బంజార్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే సైంజ్, గడ్సా, హోర్న్‌గడ ప్రాంతాలలో భారీ వర్షాలు భారీ నష్టాన్ని కలిగించాయి. ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన బంజార్ ఎమ్మెల్యే సురేందర్ షౌరి మాట్లాడుతూ, హోర్న్‌గడ్‌లో ప్రధాన రహదారి నిలిచిపోయిందని, గ్రామంలో విద్యుత్, నీటి సరఫరా నిలిచిపోయిందని అన్నారు.

Balaji Institute of Elementary Teacher Education
Approved by NCTE & Affiliated to SCERT, Hyd
Laknepally, NARSAMPET, Dist: Warangal - 506 331 (TG)
CONTACT:9866078590, 7702076967
ADMISSION NOTIFICATION - 2025-26
D.Ed - "B" CATEGORY SEATS
Application forms can be obtained from the College Office or download from the college website www.mcedn.org. filled in applications along with relevant certificates shall be submitted in the college office on or before 30-06-2025 by 3.00 pm. Registration Fee is Rs. 1000/-, Eligibility and Qualification 50% in Inter / Equivalent Exam & DEECET-.2025 Qualified candidates.
CHAIRMAN



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబికి పట్టుబడ్డ అన్నారం పంచాయతీ కార్యదర్శి



**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహడ్):** మరో అవినీతి తిమింగలాన్ని ఎసిబి అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ సంఘటన జిల్లాలోని పెన్‌పహడ్ మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొగ్గు ఉత్పత్తి కోసం ఎన్‌ఒసి జారీ చేసేందుకు మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ రూ.8వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సదరు బొగ్గు ఉత్పత్తిదారుడు ఎసిబి అధికారులను సంప్రదించాడు. దీంతో సమాచారం అందుకున్న ఎసిబి అధికారులు లంచం డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్న అధికారులు నాంపల్లి ఎసిబి కోర్టుకు హాజరుపర్చారు.

## ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బోనం సమర్పించారు. ఆషాఢ మాసం బోనాల ప్రారంభం సందర్భంగా కుమ్మరులతో కలిసి తొలి బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు. మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. గోల్కొండ బంజారా దర్వాజ వద్ద గల కాసాల రోహిత్ పటేల్ నివాసం నుంచి నిర్వహించిన నజర్ బోనం ఊరేగింపులో పాల్గొన్నారు. ఆ తర్వాత శ్రీకాంత్ చారి నివాసంలో నిర్వహించిన బంగారు బోనం ఉత్సవంలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌పై రేవంత్ సర్కార్ నిధుల వరద

రూ.6679 కోట్ల పనులకు సర్కార్ పచ్చ జెండా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు భారీ నిధులు మంజూరు చేసింది. రూ.6,679 కోట్ల విలువైన పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పచ్చ జెండా ఊపారు. బుధవారం జిహెచ్‌ఎంసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగరంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జులై నెలాఖరులోగా హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్ ఫార్మెటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్ సిటీ) ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని సూచించారు. హెచ్‌సిటీ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అయితే ఆ ప్రాజెక్టుకు గురువారం భారీగా నిధులు విడుదల చేశారు. కాగా రూ.6,679 కోట్లతో హెచ్‌సిటీ ప్రాజెక్టు అమలు కానుందని అధికారులు తెలిపారు.

## హైకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ తీర్పు ప్రకారం కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా 42 శాతం బిసి రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి ప్రకారం ఈ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అధికారాన్ని వినియోగించుకుని బిసి రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో 42 శాతం బిసి రిజర్వేషన్ల హామీని ప్రకటించిందన్నారు. మేనిఫెస్టోలో కూడా అదే హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు దాని ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలన్నారు.

## ‘డ్రగ్స్ ఫ్రీ స్టేట్’కు ఎన్‌డిపిఎస్ కోర్సులు దోహదం : అభిలాష బిస్త్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘డ్రగ్స్ ఫ్రీ స్టేట్’కు ఎన్‌డిపిఎస్ కోర్సులు దోహద పడతాయని తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజా బహద్దూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించి ‘డ్రగ్ ఫ్రీ‘ స్టేట్‌గా చేసేందుకు పోలీస్, ఎక్సైజ్ అధికారులకు ఎన్‌డిపిఎస్ కోర్సు లు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 22 దఫాలు గా 2551 మంది అ ధికారులకు ఎన్‌డిపిఎస్ కేసుల దర్యాప్తుపై అకాడమీలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. యువత మత్తు పదార్థాల వినియోగాన్ని మానుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్‌తో పాటు జాయింట్ డైరెక్టర్ మురళీధర్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ధనజ ఎడి, కోర్సు కోఆర్డినేటర్లు భాస్కర్, రఘునందన్, అమృతా రెడ్డి డిఎస్‌పిలు కోర్సు ట్రైనీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బోనాల సంబరాలు షురూ

- గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించిన.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- శివసత్తుల పూనకాలు, పోతరాజుల వీరంగాలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ జాతర రాష్ట్రంలో ప్రారంభమైంది. చారిత్రాత్మకమైన గోల్కొండ కోటలో జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో రాష్ట్ర వ్యాప్తంగా బోనాల పండుగ ఉత్సవాలు మొదలయ్యాయి. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల వీరంగాలతో ఆషాడ బోనాలు ప్రారంభమయ్యాయి. లంగర్ హౌజ్ చౌరస్తా వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తొలి భోనం, పట్టు వస్త్రాల సమర్పించారు. లంగర్ హౌజ్ నుంచి గోల్కొండ కోట వరకు బోనాలు, తొట్టెల ఊరేగింపు కొనసాగాయి. గోల్కొండ ప్రాంతానికి మహిళలు భారీగా బోనాలతో తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది. బోనాల పండుగను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలను అందగా ముస్తాబు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.900 ఆలయాల్లో బోనాల పండుగను నిర్వ హించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూ. 20 కోట్లలను విడుదల చేసింది. నెల రోజుల పాటు బోనాల పండుగ జరగనుంది.

### అమ్మవారి ఆశీస్సులు తెలంగాణపై ఉండాలి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

అమ్మవారి ఆశీర్వాదాలు తెలంగాణపై ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి కోరుకున్నారు. కొన్ని వందల సంవత్సరాల నుండి జంట నగరాల్లో వైభవోపేతంగా బోనాల సాంప్రదాయం కొనసాగుతుందన్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారు చాలా మహిమగల తల్లి అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్ జంట నగరాల్లో నిర్వహించే బోనాల నిర్వహణకు రూ. 20 కోట్ల రూపాయలు ముందుగానే అందజేశారని తెలిపారు.

### బోనాలు తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక : మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత చరిత్ర ఉందని అన్నారు. జంట నగరాల్లో దారులన్ని గోల్కొండ వైపై




ఉన్నాయని, ప్రజలు భక్తులు తండోపతండాలుగా వస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, అలాగే భక్తులు, ప్రజలకు పోలీసులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు. రాష్ట్ర నలుమూలల నుండి బోనాల పండుగ ప్రాముఖ్యత పట్ల హైదరాబాద్ మహానగరానికి ప్రజలు తరలివస్తున్నారన్నారు. తెలంగాణ బోనాలు సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతం కంటే మెరుగ్గా అన్ని ఏర్పాట్లు చేసిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

### తొలి బోనం సమర్పించడం అదృష్టం : కొండా సురేఖ

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆషాడ మాసంలో సంప్రదారీతిలో గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం ఈ బోనాల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నెలరోజుల పాటు బోనాల నిర్వహణ సందర్భంగా ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని, బోనాలు, ఇతర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభా కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, ఆలయ కమిటీ చైర్మన్ చిట్టిబాబు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్య చికిత్స



అరుణ్‌కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మనిషి ఆరోగ్యంగా ఉంటేనే తన విధులు సక్రమంగా నిర్వహించేందుకు దోహద పడుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. లాలాగూడలోని రైల్వే సెంట్రల్ హాస్పిటల్‌లో గురువారం ఆయన ‘కార్డియాక్ క్యాత్ ల్యాబ్’ ‘అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్’ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగ ప్రసాద్, సెంట్రల్ హాస్పిటల్ చీఫ్ స్టాఫ్ సర్జన్ 1 (కార్డియాలజిస్ట్) డాక్టర్ ఎన్‌విబికె సాయి, సెంట్రల్ హాస్పిటల్ చీఫ్ స్టాఫ్ సర్జన్ 2 డాక్టర్ కృష్ణవేణితో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, ఇతర సీనియర్ అధికారులు, వైద్యులు ఆసుపత్రి సిబ్బంది, గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ఈ కొత్త సౌకర్యం ఒక ప్రధాన అడుగు వేస్తుందన్నారు. సకాలంలో గుండె సంబంధిత సంరక్షణ ప్రాణాలను కాపాడుతుందని ఈ చొరవ దక్షిణ మధ్య రైల్వేకు తన సిబ్బంది శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ నూతన కార్డియాక్ క్యాత్ ల్యాబ్లో గుండె సంబంధిత యాంజియోగ్రామ్‌లు, యాంజియోప్లాస్టీలు వంటి కీలకమైన ప్రక్రియలను నిర్వహించడానికి వీలు కల్పిస్తూ హృద్రోగులకు సకాలంలో చికిత్సను అందించుటకు ఉపయోగపడుతుందన్నారు. అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్‌లో ఆధునిక కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐ.సి.యూ) మరియు కార్డియోథొరాసిక్ ఆపరేషన్ థియేటర్(ఓ.టి) ఒకే చోట ఉండడం వలన పూర్తిస్థాయి కార్డియాక్ సంరక్షణను అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.

## నిర్మాణ అవసరాలను బట్టి సరైన స్టీల్ గ్రేడ్స్ వాడాలి

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్టీల్ వాడకం మనిషి నిత్య జీవితంలో ఒక భాగమైపోయిందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కీ ) డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. ‘డిజైన్ ఆఫ్ స్టీల్ స్ట్రక్చర్స్ విత్ లేటెస్ట్ ఇండియన్ కోడ్స్’ అనే అంశంపై గురువారం కాలేజ్‌లోని కన్వెన్షన్ సెంటర్ సెమినార్ హాల్‌లో జరిగిన వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆస్కీలోని సివిల్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ డివిజన్ నిర్వహించింది. నగరంలోని ప్రముఖ నిర్మాణ సంస్థల ఇంజనీర్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రామేశ్వర్ రావు మాట్లాడుతూ స్వంత ఇల్లు నిర్మించడం నుంచి, ఆకాశమంత ఎత్తయిన భవనాలు, వాణిజ్య సముదాయాలు, వంతెనలు, భారీ బరువున్న కంటైనర్లు, లక్షలాది వాహనాల భారం తట్టుకునే రహదారులు, సముద్రపు టన్నెల్స్, బ్రిడ్జిల వరకూ స్టీల్ వాడకమే ఆధారంగా ఉందన్నారు. ఇవన్నీ ఇంజనీరింగ్ అద్భుతాలన్నారు. ఈ నిర్మాణాల్లో నాణ్యమైన, అవసరానికి తగ్గ సూపర్ గ్రేడ్ స్టీల్‌ను వాడినప్పుడే భూకంపాలు వంటి సహజప్రమాదాల్లో కూడా నష్టం తగ్గించగలుగుతామని రామేశ్వర్ రావు అన్నారు. నిర్మాణ రంగంలో ఉపయోగించే బీమ్‌లు, కాలమ్‌లు, కనెక్షన్‌లు, పైప్‌లు తదితరాలు అన్ని ఐఎస్ స్టాండరడ్స్ ప్రకారం మాత్రమే రూపకల్పన చేయాలన్నారు. నాణ్యతపై రాజీ పడకుండా, అవసరానికి అనుగుణంగా సరైన గ్రేడ్ స్టీల్‌ను ఎంపిక చేయడం అత్యంత అవసరమన్నారు. మహేంద్రా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అతుల్లా ఖాన్ మాట్లాడుతూ స్టీల్‌కు అనేక గ్రేడ్స్ ఉన్నాయన్నారు. నిర్మాణ రకం ఆధారంగా వాటిని ఎంపిక చేయాలన్నారు. అధిక గాలులు, భారీ వర్షాల వల్ల కలిగే నీటి ప్రవాహాలు, తుఫానులు, సునామీలు, భూకంపాలను తట్టుకునేలా ప్రత్యేక స్టీల్ గ్రేడ్‌లను వాడాలి అని చెప్పారు. టిఎంటి దేవశ్రీ ఇస్పాత్ సంస్థ మార్కెటింగ్ హెడ్ రాజీవ్ బిష్ట్ మాట్లాడుతూ స్టీల్ డిజైన్‌లో డేడ్ లోడ్ లైవ్ లోడ్, విండ్‌లోడ్, సీస్మిక్ లోడ్ వంటి కోడ్స్‌ను అనుసరించాల్సి ఉంటుందన్నారు. నిర్మాణ అవసరాలను బట్టి తగిన కోడ్‌కు అనుగుణంగా స్టీల్ వాడాలని సూచించారు. కిర్బీ బిల్డింగ్స్ సిస్టమ్ తరఫున డాక్టర్ జి. పద్మజ డిజైన్ ఆఫ్ స్టీల్ స్ట్రక్చర్స్ అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ ఆర్. వెంకట్ రెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్ సి.హెచ్. తిలక్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. సునీత తదితరులు పాల్గొన్నారు.


## యాచక రహిత నగరానికి జిహెచ్‌ఎంసి స్పెషల్ డ్రైవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పలు ప్రధాన కూడళ్ళలో యాచకులను గుర్తించి, షెల్టర్ హోమ్‌లకు లేదా సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమాన్ని జిహెచ్‌ఎంసి చేపట్టింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు ఇప్పటికే, జిహెచ్‌ఎంసి పరిధిలోని అన్ని సర్కిళ్లలో ప్రధానంగా బషీర్‌బాగ్, సచివాలయం, నాంపల్లి, బేగంబజార్ తదితర ప్రాంతాల్లో జంక్షన్ల వద్ద ఉండే యాచకులు, ఫుట్‌పాత్‌లపై ఉండే వారిని గుర్తించి, జిహెచ్‌ఎంసి నిర్వహించే షెల్టర్ హోమ్‌లకు తరలిస్తున్నారు. మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిని తమ స్వంత ఊర్లకు, నివాసాలకు పంపుతున్నారు. ఈ కార్యక్రమాన్ని జిహెచ్‌ఎంసి అర్బన్ కమ్యూనిటీ(యుసిడి) విభాగం ఆధ్వర్యంలో గత రెండు, మూడు రోజులుగా ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, మతపరమైన ప్రదేశాలలో భిక్షాటన చేసే వారి గుర్తించి, సమాచారం అందుకొని, వారిని, వైద్య పరీక్షల తర్వాత పోలీసుల సహకారంతో జిహెచ్‌ఎంసి షెల్టర్ హోమ్స్‌కు తరలించే ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. రోజులుగా యుసిడి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాచకుల తరలింపులో 221 మందిని గుర్తించారు. వీరిలో 173 మంది పురుషులు, 37 మంది స్త్రీలు, 11మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 19 మందిని జిహెచ్‌ఎంసి నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్‌కు తరలించగా, మిగిలిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, వారి వారి కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. యాచకులు, ఫుట్ పాత్‌లపై ఉండేవారిని షెల్టర్ హోమ్‌లకు లేదా వారి కుటుంబ సభ్యుల వద్దకు తరలించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని జిహెచ్‌ఎంసి యుసిడి అధికారులు తెలిపారు.

## బనకచర్ల ప్రాజెక్టుపై వివాదం అర్థరహితం

సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ



**గుంటూరు :** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బనకచర్ల ప్రాజెక్టును అనవసరంగా రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సముద్రంలోకి వెళ్తున్న నీటిని వినియోగించుకునే ప్రాజెక్టు మంచిదేనన్నా, ప్రజలకు ముందుగానే సమగ్ర అవగాహన ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఎపి రాష్ట్రంలో హంద్రీనీవా, వెలుగొండ వంటి ప్రాజెక్టులు పూర్తి కాకుండానే కొత్త ప్రాజెక్టుకు నిధులు కేటాయించడాన్ని ఆయన తప్పుబట్టారు. మాదకద్రవ్య రహిత రాష్ట్రం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఆలోచనను స్వాగతించిన నారాయణ, ముందుగా చిన్నచిన్న దుకాణాల్లో ఎక్కడికక్కడ దొరుకుతున్న పాన్ మసాలా, గుట్కా లాంటి పదార్థాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సినీ ప్రముఖులు ఈ ఉత్పత్తులకు ప్రచారం చేయడం సిగ్గుచేటుగా అభివర్ణించారు. ‘నాలుగు ప్యాకెట్లు పట్టుకొని చేతులు దులిపే విధంగా కాదు... ఉత్పత్తి చేసే వారిపై, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి’ అని డిమాండ్ చేశారు. గతంలో ఏర్పాటైన సిట్ ఇప్పటికీ నివేదిక ఇవ్వకపోవడం విషయంలోనూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న మరో 40 వేల ఎకరాల భూసేకరణ నిర్ణయంపై నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇప్పటికే 33 వేల ఎకరాల భూమిని సేకరించిన ప్రభుత్వం ఇప్పుడు మరింత భూమి కావాలనడం రైతుల్లో అనేక అనుమానాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. రాబోయే సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరగాలని కోరుతూ, అందరూ వాటిలో పాల్గొని విజయవంతం చేయాలని నారాయణ పిలుపునిచ్చారు.

## హైడ్రా పేరుతో బెదిరింపులు

ఇద్దరిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా పేరు చెప్పి బెదిరించిన ఇరువురిపై నార్సింగి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మిరియాల వేదాంతం, యెలిసెట్టి శోభన్ బాబు గండిపేట మండలం, నెక్నాంపూర్ విలేజ్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఓ ఇంటికి వెళ్లి బెదిరించినట్టు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఈ నెల 23న మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. నలుపు రంగు కారులో వచ్చిన ఇద్దరు ఇంటి ఆవరణలోకి వచ్చి పరిశీలిస్తుండగా, ఎవరని అడిగితే తాము హైడ్రా నుంచి వచ్చామని బదులిచ్చారని, ఆ ఇంటి వద్ద పని చేస్తున్న గుంతకల్ మల్లికార్జున్ తెలిపారు. ఎందుకు వచ్చారని అడిగితే ఈ ఇంటిని కూల్చేస్తామని, ఇందుకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నామని చెప్పారన్నారు. ఇంటి యజమానితో మాట్లాడాలని సూచించగా, చల్లగా జారకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మల్లికార్జున్ వివరించారు. నిందితులు మిరియాల వేదాంతం(22) కారు డ్రైవర్ కాగా, కరీంనగర్ జిల్లాకు చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. అల్కాపురి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నాడు. మరో వ్యక్తి యెలిసెట్టి శోభన్‌బాబు ఆర్‌టిసిలో పని చేసి రిటైర్ అయ్యారు. ఈయ న మణికొండలోని పుప్పాలగూడ, ఎస్టీమ్ రెసిడెన్సీలో నివా సం ఉంటున్నాడు. ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### హైడ్రా పేరుతో బెదిరిస్తే కఠిన చర్యలు

హైడ్రా పేరు చెప్పి ఎవరైనా మోసాలకు, బెదిరింపులకు పాల్పడితే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, నేరుగా తమకు ఆ సమాచారం ఇచ్చినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. హైడ్రా ఉద్యోగులు విచారణ చేపడితే, పూర్తి వివరాలు అందజేస్తారని, ఒక వేళ హైడ్రా ఉద్యోగులు కూడా మోసాలకు పాల్పడి, హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తే వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే, 8712406899 నెంబరుకు ఫోన్ చేసి సమాచారాన్ని వాట్సాప్‌లో అందజేయడంతో పాటు, వారి ఫోటోలు కూడా పంపించాలని హైడ్రా కోరింది.

## రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించండి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పదివేల రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి రూ.4 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల బిల్లులను నిలుపుదల చేసైనా, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు పాతూరి సుధాకర్‌రెడ్డి, దేవిప్రసాద్, సుమిత్రానంద్, భుజంగ రావు ,హమీద్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని హామీనిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీ మ్ కింద ఉద్యోగుల వేతనాల నుంచి కట్ చేసిన మొత్తాన్నీ కూడా ప్రభుత్వం జమ చేయడం లేదని, ప్రతి నెలా జమ చేయాల్సిన డబ్బులను ప్రభుత్వమే వాడుకుంటుందనిన్నారు. పిఎఫ్ సొమ్మును వాడుకోవడం చట్ట విరుద్ధమని, ఉద్యోగుల సొమ్మును ప్లాన్ అకౌంట్‌లో జమ చేయని శాఖాధిపతులపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సరైన మార్గదర్శకాలు లేకుండా ప్రభుత్వ పాఠశాలలో నూతన తనిఖీల విధానం సరికాదని సూచించారు. దేవిప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు.2026 సంవత్సరానికి ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు హానికరంగా ఉన్నాయని మండిపడ్డారు.




## మావల్లే మీకు వస్త్రాలు,బూట్లు, మొబైల్స్..!

విమర్శించేవారిపై మహారాష్ట్ర బిజెపి ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

**ఛత్రపతి శంభాజీనగర్ :** వివాదాస్పద వ్యాఖ్యలు అలవాటుగా మారిన బిజెపి ప్రజాప్రతినిధుల సంఖ్యలో మరొకరు చేరారు. మహారాష్ట్రలోని పర్టూర్ అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి శాసనసభ్యుడు బాబన్‌రావు లోనికర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తన పార్టీని, ప్రభుత్వాన్ని విమర్శించే ప్రజలు ఎవరైనా తెలుసుకోవాల్సింది ఏమిటంటే ‘వారు మావల్లే వస్త్రాలు, బూట్లు, మొబైల్, పథకాల ఆర్థిక ప్రయోజనాలు, విత్తనాల కోసం డబ్బు అందుకుంటున్నారన్న వాస్తవం గ్రహించాలి’ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన సెంట్రల్ మహారాష్ట్రలోని జాల్నా జిల్లాలో పర్టూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ‘హర్ ఘర్ సోలార్’ పథకం ఉత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. బాబన్‌రావు లోనికర్‌గా పేరొందిన బాబన్‌రావు దత్తాత్రేయ యాదవ్ గతంలో మహారాష్ట్ర ప్రభుత్వంలో నీటి సరఫరా, పారిశుధ్య శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన పర్టూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఒక సభలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ తన పార్టీపై విమర్శలు చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వివాదాస్పద వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో చక్కర్ల కొడుతూ వైరల్ అవుతోంది.సోషల్ మీడియాలో కొద్దిమంది ప్రజలు ప్రత్యేకించి యువత మాపై, మా పార్టీపై విమర్శలు చేస్తున్న వారెవరైతే ఉన్నారో వారంతా మీ గ్రామాలలో బిజెపి ప్రభుత్వం అందజేస్తున్న వివిధ ఆర్థిక ప్రయోజనాల పథకాలు పొందుతున్నారని తెలుసుకోండి అని గుమిగూడిన జనాన్ని ఉద్దేశించి గట్టిగా వినపడేలా చెప్పారు.

## అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు : బీమిడి జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అర్హులైన ప్రతి నిరుపేద కు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని జిల్లా ఆర్‌టిఎ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లోని శివశివాని కాలనీలో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, హౌసింగ్ పిడి రమణ మూర్తి, ఎఇ కమలాకర్, మాజి ఉపసర్పంచ్ శంకర్ గౌడ్, వార్డు ఆఫీసర్ పురుషోత్తం, రేణుక, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** పేద ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరంలాంటిందని, ఖరీదైన వైద్యం పొందేందుకు అవసరమైన సందర్భాల్లో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ ఉప్పల్ నియోజక వర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందచేసారు. ప్రమీలకు రూ.60వేలు, భవానికి రూ.55వేలు, శైలజకు రూ.45వేలు, మోహనక్రాంతికి రూ.60 వేలు, శాంతమ్మకు రూ.60వేలు, సాదిక్‌కు రూ. 60వేలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు అంజయ్య, సాయికిరణ్‌గౌడ్, బాలరాజు, విఠల్ నాయక్, లుకాస్, అరుణ్, ప్రభాకరరెడ్డి, కిషోర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు ప్రతిపాదనలు : అదనపు కలెక్టర్ ఆదేశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మరమ్మతు పనులకు గాను ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ అధికార్లను జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. అదే విధంగా తమ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉండే గదులను అంగన్‌వాడి కేంద్రాలు వినియోగించుకొనేందుకు వీలు కల్పించాలని జిల్లా విద్యా శాఖాధికారిని ఆదేశించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట, దేవరాయంజల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను ఆమె తనిఖీ చేసారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లిన అదనపు కలెక్టర్ రాధికా గుప్తా విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలు వేస్తూ జవాబులు రాబట్టి ఇష్టంగా చదివి తమ లక్ష్యాలను చేరుకొనేలా ఉత్తమ ఫలితాలు సాధించేలా చదువాలని హితబోధ చేసారు. పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఎంత మంది ప్రతి రోజూ వస్తున్నారు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు ఏ మేరకు పంపిణీ చేసారన్న తదితర విషయాలను ఉపాధ్యాయులకు అడిగి తెల్సుకొన్నారు. ప్రభుత్వం విద్య విషయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, డిఈఓ విజయకుమారి, మున్సిపాలిటి డిఈ సునిత, మేడ్చల్ సిడిపిఓ శారద తదితర అధికారులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## సాహస కృత్యాల్లో అవార్డులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** సాహస కృత్యాల్లో విశిష్ట ప్రతిభ కనపరచిన యువతీ యువకులకు టెంజింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డులకు గాను అర్హులను ఎంపిక చేసేందుకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని మేడ్చల్ జిల్లా యువజన మరియు క్రీడల అధికారి జివి గోపాలరావు పేర్కొన్నారు. కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా జాతీయ సాహస అవార్డులకు గాను భూమిపై, సముద్రంలో చేసే సాహస యాత్రలకు ఒక్కొక్కరికి ఒక్క అవార్డుతో పాటు సాహస రంగంలో జీవిత కాల సాధన అవార్డును సైతం ఇస్తారన్నారు. 2022 నుండి 2024 వరకు మూడేళ్ల కాలంలో తాము చేసిన సాహసకృత్యాల గురించి పొందుపరుస్తూ https://awards.gov.in ద్వారా ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

## ప్రైవేట్ ఉద్యోగాలకు ప్రభుత్వ డిఇఇటి యాప్




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు నిరుద్యోగులకు ఉపయోగపడే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజి DEET యాప్ ను రూపొందించిదని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. దీనికి సంబంధించిన క్యూఆర్ (QR) కోడ్‌ను స్కాన్ చేసి తమకు అవసరమైన ఉద్యోగ ఖాళీలను గుర్తించటం ద్వారా నేరుగా ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యంతో పాటు నిరక్షరాస్యుల నుండి పిహెచ్‌డి వరకు చదువుకొన్న నిరుద్యోగులు దీన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఇస్సటి ఈ పోర్టల్‌లో వివిధ రంగాలకు సంబంధించి 8 వేల 443 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వీటిలో ఫుల్‌టైం, పార్ట్ టైం,వర్క్ ఫ్రం హోం లాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా పరిశ్రమ శాఖాధికారులను www.deet.telangana.gov.in 9281423575, 92814235 76, 9281423 577, 9281423578, 928142 3579లకు ఫోన్ చేసి తెల్సుకోవచ్చన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జా

- వార్త ప్రచురించిన విలేకరులకు బెదిరింపులు
- ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన గెస్ట్‌హౌస్ నిర్మాణం

**డిసిపి ఆదేశాలతో కేసు నమోదు చేసిన దుండిగల్ సిఐ సతీష్**



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ ప్రముఖ ప్రింట్ మీడియా విలేకరులను అసభ్య పదజాలంతో దూషించిన సంఘటనలో భూకబ్జాదారుడు ఆకుల బాబుపై గురువారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జూన్ నెల 6, 16 తేదిల్లో కబ్జాలపై 'ప్రజాపక్షం' దినపత్రికలో వరుస కథనాలు రావడంతో పాటు పలు దినపత్రికల్లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన గెస్ట్ హౌస్ నిర్మాణంపై ప్రత్యేక కథనాలు వెలువడ్డాయి. అసభ్య పదజాలంతో దూషించడంతో వీడియో వైరల్ అయ్యింది. ఈ సంఘటనతో భగ్గుమన్న విలేకరులు మంగళవారం మేడ్చల్ డిసిపి కోటిరెడ్డిని కలిసి వీడియో ఆధారంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన డిసిపి కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని దుండిగల్ సిఐ సతీష్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ నెల 26న ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసినట్లు దుండిగల్ సిఐ సతీష్ తెలిపారు. సామాన్యులు 60 గజాల్లో ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తే హడావిడిగా కేసులు నమోదు చేస్తున్న రెవెన్యూ అధికారులు ధన, బల, అధికార బలంతో భూకబ్జాదారులు రెచ్చిపోతున్న సదరు భూకబ్జాదారులు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భౌరంపేటకు చెందిన ఆకుల బాబు సర్వే నెంబర్ 166/15 రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి దర్జాగా అనుభవిస్తున్న దుండిగల్ తహాశీల్దార్ ఎందుకు కేసు నమోదు చేయడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జాదారుడిపై తహాశీల్దార్ ఏమి చర్యలు తీసుకుంటారో మరి వేచి చూడాల్సిందే..

## నేర రహిత సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నేర రహిత సమాజాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డి ఆద్వర్యంలో అంతార్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా తుర్కపల్లిలోని విజేత గ్రామర్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే తుర్కపల్లి, కొల్తూర్, లాల్‌గడిమలక్‌పేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంతో బాగస్వాములు కావాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విజేత స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్ రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్‌ప్రభాకర్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ కగార్' పేరిట హత్యాకాండ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్




**ప్రజాపక్షం/కాప్రా:** దేశంలో కమ్యూనిస్టుల మనుగడ లేకుండా చేసే లక్ష్యంగానే మావోల ఏరివేత అంటూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట హత్యా కాండ కొనసాగిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. ఆగస్టు 19 నుండి 22 వరకు కుత్బుల్లాపూర్‌లో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా పార్టీ ఉప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తూ విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో ఉన్న సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్ప చెప్పే లక్ష్యంగానే మావోలను నిర్మూలించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఒక పక్క అనేక మంది మావోలు లొంగి పోతున్నా, చర్చలకు సిద్ధమంటున్నా ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా కేంద్ర బలగాలతో దాడులు చేస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి, ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, పార్టీ నేతలు శేఖర్, గిరిబాబు, అజీం పాషా, సమీర్, ప్రీతం, వికాస్, సంజు, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

# జులై 9న ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సమ్మె



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారతదేశ వ్యాప్తంగా జులై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎండి.షబ్బీర్ అలీకి అందజేశారు. నోటీసుతో పాటు కార్మికుల సమస్యలపై ఎఐటియుసి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ, మోడీ మూడోసారి భారతదేశ ప్రధానిగా ఎన్నికైన తరువాత దేశవ్యాప్తంగా వున్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి అదానీ, అంబానీలకు దోచిపెట్టే పనిలో భాగంగా దేశవ్యాప్తంగా కార్మికుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాడని, వాటిని నిరసిస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు బదులుగా 4 లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, దేశవ్యాప్త సమ్మె ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జులై 9వ తేదీన దేశ వ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. అలాగే నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే కార్మికులకు ప్రతి సంవత్సరం ఇచ్చే సబ్బులు, చెప్పులు, నూనె డబ్బులు, బట్టలు, చేతికి వేసుకునే గ్లౌజులు, రైన్‌కోట్లు వెంటనే ఇవ్వాలని డిమాండు చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గత పాలకవర్గ సభ్యులను ఒకరకంగా ప్రతి రోజు ప్రజా, కార్మికవర్గాల కోసం పోరాటం చేసే నాయకులను ఒక రకంగా చూస్తున్నాడని అన్నారు. షబ్బీర్ అలీ మీ లావాదేవీలు మీకు ఉండవచ్చు కానీ నిరంతరం పేదప్రజలు, కార్మికుల, కర్షకుల కోసం పోరాడే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారికి గుర్తు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష కార్మిక నాయకులు రవి, పెంటయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మదన్‌పల్లి గ్రామంలో మానవహారం ర్యాలీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోధ్యాయులు యాదయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మనిషిని శారీరకంగ మానసికంగా నిర్వీర్యం చేస్తాయని, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. యుక్తవయస్కులు, చిన్న పిల్లలు మాదక ద్రవ్యాల బారినపడటం ఆందోళన కలిగించే విషయమని,వీటికి బానిసలు కావొద్దని బయాలజీ ఉపాధ్యాయురాలు హేమలత వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండు ,తాజోద్దీన్, అరవింద్, తదితరులు పాల్గోన్నారు.



## బోనాల జాతరకు మౌలిక వసతులు కల్పనకు వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బోనాల పండగకు ఉద్దెమర్రిలో కనీస మౌలిక వసతులు కల్పించాలని మూడుచింతలపల్లి మున్సిపాలిటి ప్రత్యేకాధికారి శ్రీపాద రామేశ్వర్‌రావుకు మాజి సర్పంచ్ దోసకాయల వెంకటేష్ గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాజి సర్పంచ్ దోసకాయల వెంకటేష్ మాట్లాడుతూ ఉద్దెమర్రి వార్డు కార్యాలయంలో వచ్చే నెల 13 నుంచి బోనాల జాతర పండగలు ఉన్నందున గ్రామంలోని అన్ని వార్డుల్లో వీధి దీపాలు, రోడ్డు వసతి కల్పించాలని అన్నారు. జాతర సందర్భంగా పలు ఆలయాల వద్ద, గ్రామంలోని వార్డుల్లో పారిశుద్య సేవలు చేపట్టాలని ప్రత్యేకాధికారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, ఆర్‌వొ శోభారాణి, మాజి సర్పంచ్ పట్టా బాల్‌నర్సింహా, లక్ష్మయ్య, ప్రవీన్‌యాదవ్, నాయకులు వంగ లక్ష్మారెడ్డి, జెర్రిపోతుల నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి

### ఆలయ కమిటీ చైర్మన్‌గా రమేష్ ప్రమాణం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శ్రీ బాలాజి వెంకటేశ్వర స్వామి ఆలయంలో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని, ఆలయాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరంలోని శ్రీబాలాజి వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటి ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. చైర్మన్‌గా మర్యాల రమేష్, ధర్మకర్తలుగా ముద్రగణం రాజుకుమార్, కొంపల్లి ప్రవీన్‌కుమార్, కాసుల వెంకటేష్, దీరావత్ శంకర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ ఆలయం చుట్టు సిసి రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎఇకి మొబైల్ ఫోన్‌లో చెప్పారు. దాతలు ముందుకు వచ్చి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, రాష్ట్ర హజ్‌యాత్ర కమిటి సభ్యుడు ముజుబుద్దీన్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వర్‌గుప్త, డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజి ఎంపిటిసి గోనె హన్మంత రెడ్డి, జిల్లా నాయకుడు గౌనె మహేందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, కమఠం కృష్ణారెడ్డి, రమేష్ గుప్త, దేవాదయ శాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఇఒ శ్రీనివాస్, ఆలయ అర్చకుడు నందగిరి ఉపేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/జడ్చర్ల:** బాలానగర్ మండలంలోని బిల్డింగ్ తండా గ్రామంలో యంజియన్‌ఆర్‌ఈజిఎస్ నిధుల కింద మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయితీ భవనానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని జడ్చర్ల శాసనసభ్యులు జానంపల్లి అనిరుద్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పంచాయతీ భవనం ఒక కేంద్ర బిందువుగాఉండాలి. ఈ భవనం గ్రామ అభివృద్ధి ప్రజలు అవసరాలను తీర్చే దిశగా ఉపయోగపడుతుందన్నారు.

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

### ఎస్‌పి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** యువత చెడు మార్గాల పట్ల ఆకర్షితం కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెడు అలవాట్ల వైపు ఆలోచన వస్తే తల్లిదండ్రులను గుర్తు చేసుకోవాలని అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్టిఆర్ చౌరస్తా నుండి యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లవైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలు, కుటుంబంలో మన తల్లిదండ్రులు, మన కుటుంబీకులు పొందే దుఃఖం అధికంగా ఉంటుందని, చెడు అలవాట్లకు మొదటినుండి దూరంగా ఉండాలని తెలిపారు. నేటి యువత రేపటి భావి భారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్ నాశనం అవుతుందని దీనిని గుర్తించి డ్రగ్స్‌వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

యువత డ్రగ్స్‌తో పాటు గుట్కా, గంజాయి మాదక ద్రవ్యాలకు ఉండాలని కలెక్టర్ సూచించారు. చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచనా విధానం ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. జిల్లా ఎస్పి నారాయణరెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి యువత పట్టుగొమ్మలాంటి వారని యువత ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, దేశం బాగుపడుతుందని, విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ చాలా కీలకమని, వీటిని ఎట్టి పరిస్థితులలో కోల్పోవద్దని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తాము కష్టాలు పడుతూ పిల్లలకు మంచి సౌకర్యాలు కల్పిస్తారని వాటిని ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియో గం చేసుకోవద్దని, మాదక ద్రవ్యాలు వాడటం వల్ల చెడు జరుగుతుందని మన రాష్ట్ర డిజిపి అసెంబ్లీ కేంద్రంనుండి మండల, గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి యువతను, చైతన్య పరచాలని అన్నారు. మనం చెడు అలవాట్లకు గురి అయితే తల్లిదండ్రులు పడే క్షోభ వర్ణనాతీతమని, ఇది గుర్తుంచుకొని యువత మెలగాలని సూచించారు. ఈ క్యార్రకమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా యువజన క్రీడల అధికారి మహమ్మద్ సత్తార్, శిశుసంక్షేమ అధికారి కృష్ణవేణి ,జిల్లా అధికారులు పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్న డిఇఒపై చర్యలు

**ప్రజాపక్షం/కాప్రా :** ఎలాంటి తనిఖీలు చేయకుండా నిబంధనలను పట్టించుకోకుండా జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు మంజూరు చేయటంలో ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి విజయ కుమారిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి కోరింది. ఈ మేరకు గురువారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్,సాయిలు, అక్షర్, కళ్యాణ్‌లు పాఠశాల రీజనల్ అడిషనల్ డైరెక్టర్ బి.ఆసనూయను కల్సి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ధర్మేంద్ర, టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ కుషాయిగూడలో సెయిం ట్ అన్స్ అంటూ సెయింట్ అన్నీస్ పేరిట అనుమతులు పొందిన విద్యా సంస్థ కనీస నిబంధనలు పాటించలేదన్న విషయాన్ని బయట పెడితే నామ మాత్రంగా సీజ్ చేసి మరో గేట్ నుండి కార్యకలాపాలు చేసుకోవచ్చని విద్యాశాఖాధికారులు చెప్పటం వెనుకు మతలబు ఏమిటన్నారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలను పట్టించుపకోకుండా కేవలం ప్రయివేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్న డిఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.



## జాప్యం లేకుండా ధృవపత్రాలు జారీ

### రెవెన్యూ అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మీ సేవా కేంద్రాల ద్వారా ధరఖాస్తులు చేసుకొన్న వారికి సంబంధించి ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలనలు సత్వరమే పూర్తి చేసి ధృవపత్రాలను జారీ చేస్తుండాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కత్బుల్లాపూర్‌లోని మండల తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం వచ్చిన ధరఖాస్తులకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలించారు. ఆదాయం, స్థానికత(లోకల్), కుల ఇతరత్రా సర్టిఫికెట్లను జారీ చేసే సమయంలో ఎలాంటి తప్పులు లేకుండా నిర్దిష్ట కాలంలోగా పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత గాజులరామారంలోని సర్వే నంబర్ 307,342 గల ప్రభుత్వ భూములకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఆ భూములను చూసారు. మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ స్వామి తదితరులు ఆయన వెంట ఉన్నారు.




## తప్పిపోయిన బాలుడు అప్పగింత

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం జరిగింది. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం అలియాబాద్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని సత్యనారాయణ స్వామి ఆలయ గోశాలలో బాలుడి తల్లిదండ్రులు అజయ్‌కుమార్, చందాకుమారి పని చేస్తున్నారు. ఆడుకుంటున్న బాలుడు తప్పిపోయాడని వచ్చిన ఫిర్యాదు మేరకు 6.30 గంటల నుంచి సమీప ప్రాంతాల్లో పోలీసులు వెదికారు. బాలుడి ఆచూకీ గంట వరకు లబించలేదు. దీంతో సిఐ శ్రీనాథ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తానే స్వయంగా గాలింపు చర్యలు చేపట్టి సమీప ప్రాంతాల్లో వెదకగా బాలుడు దారి వెంట నడుచుకుంటు వెళ్తుండగా పట్టుకుని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ఇట్టి కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐలను సిఐ అభినందించారు. బాలుడిని క్షేమంగా అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు దన్యవాదాలు తెలిపారు.

## వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ టిబి లక్షణాలు ఉన్న వారు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులు వాడితే విధంగా రోగం తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ ప్రవీణ, ఆర్‌బిఎస్‌కే వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, అమృత, టిబి సూపర్‌వైజర్లు షఫీ, రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్‌లు అశోక్, సలాంఖాన్, డిస్టిక్ ఐసిటిసి సెంటర్ గీత, ఏఎన్‌ఎంలు సుమతమ్మ, సుజాత, సునీత తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఎడిఏగా రమాదేవి



**ప్రజాపక్షం/కొత్తూరు:** షాద్‌నగర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగాబాధ్యతలు స్వీకరించిన రమాదేవిని తోటి సిబ్బంది సన్మానించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతన ఏడిఏగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన నేపధ్యంలో ఫరూఖ్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏడిఏ రమాదేవి మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ పథకాలను రైతుల్లోకి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు.

## అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలను రద్దు చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టా లక్ష్మణ్ డిమాండ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న విద్యా సంస్థలను రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్టా లక్ష్మణ్, మణికంఠరెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్‌లో ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సబ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలను అసరాగా చేసుకొని కాసులు వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నుండి వసూళ్లు చేస్తున్న ఫీజుల వివరాలు నోటీసు బోర్డులపై పెట్టాల్సి ఉన్నప్పటికి అవేమి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై దాడులు నిర్వహించి అనుమతులు లేని విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు అరుణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో ఎల్‌బినగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్‌బి నగర్ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. గురువారం వనస్థలి పురం డివిజన్లోని వనస్థలి హిల్స్ కాలనీలో రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కీ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం లో సుధీర్‌రెడ్డి విఫలమయ్యారని తెలిపారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జిహెచ్‌ఎంసిలో అభివృద్ధి పనులు సాఫీగా సాగుతున్నాయని, ప్రజలకు ఎక్కడ మౌలిక వసతులు అవసరమో అక్కడ నిధులు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు మట్టి ఫ్లై ఓవర్లు కాకుండా.. మెట్రోతో కూడిన రోడ్డు ఫ్లై ఓవర్లని నిర్మించేలా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతామని తెలియా జేశారు. ప్రజలు ప్రశాంత జీవనం గడిపేందుకు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటితో పాటు ఓపెన్ జిమ్‌లు, పార్కులు, యోగ సెంటర్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్‌రెడ్డి యాదిరెడ్డి, కార్యదర్శి కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, మెగావత్ గణేష్ నాయక్, పన్యాల జైపాల్‌రెడ్డి, కర్మాన్ ఘాట్ దేవాలయం డైరెక్టర్లు కంచర్ల కవిత, దిండు ప్రవీణ్ గౌడ్, ఓరుగంటి నరేష్, జిహెచ్‌ఎంసి ఈఈ కార్తీక్, జలమండలి డిజిఎం రాగోపాల్, ఏఈ విగ్నేశ్వరి, సాయి కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసిని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆర్టీసి రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం శాసన సభ కమిటి హాల్‌లో తెలంగాణ ఆర్టీసి సంస్థ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. సమావేశంలో తెలంగాణ ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ స్పెషల్ సెక్రటరీ ఉదయ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర అడిట్ జనరల్ మాధవి పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి రూ.5.57 కోట్లు మంజూరు

కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసం రూ.5.57 కోట్ల నిధులు మంజూరు అయినట్లు డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. గురువారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో హస్తినాపురం డివిజన్‌కు నిధులు మంజూరు చేశారని తెలిపారు. డివిజన్‌లో టీకేఆర్ రోడ్ నుండి వయా గ్రీన్ ల్యాండ్స్ కాలనీ, వందన పూరి, సాగర్ ఎంక్లేవ్ నుండి ఇన్నర్ రింగ్ రోడ్డు ( అలేఖ్య టవర్స్ ముందు వరకు) రోడ్డు నిర్మాణానికి షిరిడి సాయి నగర్, జడ్పి రోడ్ నుంచి హస్తినాపురం సెంట్రల్ సిగ్నల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసిందని కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఆరు మాసాలలో డివిజన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగే విధంగా కృషి చేస్తామన్నారు.

## 22 అంశాలు, 10 ఐటమ్‌లకు జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) స్థాయిసంఘంలో నగరంలో చేపట్టే పలు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రహదారుల విస్తరణ, పాలనపరమైన అనుమతులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలకు సంబంధించిన 22 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం నాలుగవ స్థాయీ సంఘం సమావేశం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగింది. సమావేశంలో 22 అంశాలు, 10 ఐటమ్‌లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, స్థాయీ సంఘం సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డాక్టర్ ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాత జబీన్, మహాలక్ష్మి రమన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సిఎన్‌రెడ్డి, వి.జగదీశ్వర్‌గౌడ్, బూరుగడ్డ పుష్ప పాల్గొన్నారు. జోనల్ కమిషనర్‌లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్, అపూర్వ చౌహాన్, ఎన్.రవికిరణ్, వెంకన్న, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్లు సహదేవ్ రత్నాకర్, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, నిత్యానంద, అదనపు కమిషనర్లు కె.సత్యనారాయణ, సుభద్ర దేవి, నళిని పద్మావతి, గీతా రాధిక, సామ్రాట్ అశోక్, మంగతాయారు, ఎస్.పంకజ, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ యాదగిరి రావు, వేణుగోపాల్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, చీఫ్‌వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్‌వకీల్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల సమస్యలపై సిఎంతో మాట్లాడుతా

'మెపా' బృందానికి మంత్రి వాకిటి శ్రీహరి హామీ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌ల సమస్యలపై సిఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ప్రతినిధుల బృందానికి రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హామీనిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ ఆఫీస్‌లో మెపా ప్రతినిధులు మంత్రిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ తోపాటు, ముదిరాజ్‌లకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మత్స్యకారులకు ప్రమాద బీమాను పెంచాలని విజ్ఞప్తి చేశారు. 55 ఏండ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్ వర్తింపజేయాలని కోరారు. ప్రతి జిల్లాల్లో ముదిరాజ్ విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి శ్రీహరి స్పందిస్తూ ముదిరాజ్‌ల అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ముదిరాజ్‌లను బిసి 'డి' నుంచి బిసి 'ఎ'లోకి చేర్చే అంశంపై సిఎంతో మాట్లాడుతానని తెలిపారు. అనంతరం మంత్రికి ముదిరాజ్ కుల దైవం పెద్దమ్మ తల్లి చిత్రపటాన్ని బహుకరించి, శాలువాతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో మెపా రాష్ట్ర గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బోయిని జగన్మోహన్, ప్రధానకార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్, ఉపాధ్యక్షులు పొన్నం రాజు, చిరుత వెంకటేశ్వర్లు, కార్యదర్శులు చిరంజీవి, రామకృష్ణ, రాజు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

## 'స్థానిక'లోపే 'అంబేద్కర్ అభయహస్తం' అమలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని స్థానికసంస్థల ఎన్నికల్లోపు అమలు చేయాలని వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ దళిత, గిరిజన ఆదివాసీ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.25లక్షలు అందజేయాలని కోరారు. దళితబంధు లబ్ధిదారుల ఖాతాల్లో ఫ్రీజింగ్‌లో ఉన్న డబ్బులను ఆయా కుటుంబాలకు చెల్లించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌లో ప్రకటించిన 12 అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. అంబేద్కర్ అభయ హస్తం సాధన, చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌పై గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎరుకుల కులవృత్తుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కండెల వెంకటేశ్వర్లు, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కండెల వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఇటుకరాజు మాదిగ, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు జున్ను కనకరాజు , బిఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగస్థుల సంఘం అధ్యక్షులు గంధం రాములు, వనం గంగయ్య పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ బియ్యం 92 శాతం పంపిణీ పూర్తి

రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వనజాత



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో 92 శాతం మందికి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేశామని రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వనజాత తెలిపారు. జిల్లాలో మొత్తం 5,72,000 రేషన్ కార్డుదారులు ఉండగా వీరిలో 92 శాతం మంది కార్డుదారులకు ఇప్పటికే పంపిన పూర్తి చేయడం జరిగిందని, వీరితో పాటు పోర్టబిలిటీ కాటుదారులను కలుపుకొని 44 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇప్పటివరకు పంపిణీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత వివరించారు. మూడు నెలల రేషన్ పంపిణీ ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్ణీత గడువులోగా బియ్యం పంపిణీ చేస్తామని,ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఉదయం,సాయంత్రం వేళల్లో రేషన్‌షాపులు తెరిచి ఉంటాయన్నారు. రేషన్ బియ్యం సరఫరాతో పాటు జిహెచ్‌ఎంసి పరిధిలోని కార్డుదారులకు ఒకనెల గోధుమలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, యువత, సమాజంలోని అన్నివర్గాలు సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వినియోగం, వాటి దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతోపాటు కళాశాలల్లో, పాఠశాలలో కూడా రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్‌ల ద్వారా ప్రభుత్వ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని, తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ డ్రగ్స్‌కు నో చెప్పండి, సే టూ నో డ్రగ్స్ పోస్టర్ విడుదల చేశారు. సమావేశంలో చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి నరసింహరావు, బిసి సంక్షేమ శాఖ అధికారి కేషరామ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరిదేవి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, పోలీసు, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి అభినందనీయం : ఎంఇఒ



**ప్రజాపక్షం/షాబాద్ :** గ్రామ పెద్దల సహకారంతో ఎల్గొండ గూడ పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందనీయమని మండల విద్య అధికారి లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోనే అత్యధికంగా అర్థికంగా ఖర్చు చేసి పాఠశాలలో మౌలి క వసతులు కల్పించిన గ్రామపెద్దలు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజనేయులుగౌడ్, యాదయ్య, బలరాం, శ్రీనివాసచారి తదితరులు కలిసి సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామంలోని పెద్దలందరూ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సాధిస్తే గ్రామంలోని విద్యార్థులు మంచి విద్యావంతులుగా మారుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహమూద్, రవి, సతీష్ విద్యార్థులు, తల్లితండ్రులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి నాణ్యమైన విద్యను పొందేందుకు కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ సూచించారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఎస్సీ కాలనీ, అంబేద్కర్ కాలనీలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఇఓ మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పి నాగమణి, ఉపాధ్యాయులు జయశ్రీ, లక్ష్మీ నారాయణ, నర్సింహ్మారెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రజల చైతన్యంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవంలో వక్తలు







**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజల చైతన్యంతోనే మాదక ద్రవ్యాల నియంత్రణ సాధ్యమని షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్ అన్నారు. మత్తు పదార్థాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నదే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని సంకల్ప సమస్త ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అర్జున్‌కుమార్, సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ మాధవి, మాజీ ఎంపిటిసి భీశ్వ రామకృష్ణ, లింగారెడ్డిగూడ అశోక్, మల్లేష్ యాదవ్, కాటి మల్లేష్, శ్రీధర్ గౌడ్, షాబాద్ శంకరయ్య, ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య, అంజయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మత్తులో పడి యువత చిత్తుకావొద్దు

షాద్‌నగర్ ఐసిడిఎస్ సిడిపిఒ ఉదయ

యువత బలమైన శక్తిగా నిలవాల్సింది పోయి మాదకద్రవ్యాల మత్తులో పడి చిత్తు కావద్దని షాద్‌నగర్ ఐసిడిఎస్ సిడిపిఒ ఉదయ సూచించారు. గురువారం షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జూనియర్ కళాశాలలో నుండి ముఖ్యకూడలి వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు మాదకద్రవ్యాల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ ప్రణయ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమల, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి , సంధ్య, వెంకటమ్మలు పాల్గొన్నారు.

**గండిపేట:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్ నియోజకవర్గంలోని శివరాంపల్లి గవర్నమెంట్ హై స్కూల్ గవర్నమెంట్ కాలేజీలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ఐసిడిఎస్ శేర్లింగంపల్లి ప్రాజెక్టు సూపర్వైజర్స్ పద్మ పోలీస్ డిపార్ట్మెంట్ ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

**షాబాద్ :** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాబాద్ సిఐ కాంతారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాలో భాగంగా గురువారం షాబాద్ మండల పరిధిలోని తెలంగాణ మాడల్ పాఠశాల, కళశాల అవరణలో విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, రమేష్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

**కొందుర్గు:** డ్రగ్స్‌రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్థానిక ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులచే పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బండమీది పెంటయ్య, ఐసీడిఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న, సిబ్బంది శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు మాణేమ్మ, రజీయా బేగం, పాల్గొన్నారు.









# క్రీడ



బంతి మార్పు, డిఆర్ఎస్‌పై ఐసిసి కీలక నిర్ణయం!

## టెస్టుల్లోనూ స్టాప్ క్లాక్..

క్రికెట్‌లో పలు మార్పులకు శ్రీకారం చుడుతున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వన్డేల్లో బౌండరీ క్యాచ్ నిబంధనలను మార్చిన ఐసిసి.. టెస్టుల్లో స్లో ఓవర్ రేటుకు చెక్ పెట్టింది. పెద్ద తలనొప్పిగా మారిన ఈ సమస్యకు పరిష్కారంగా స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. డబ్ల్యూటీసీ (2025–27) కొత్త సీజన్ నుంచే ఈ కొత్త విధానం అమలులోకి వస్తుందని గురువారం ఐసిసి వెల్లడించింది. ఈ నియమం ప్రకారం ఓవర్ పూర్తి అయిన నిమిషంలోనే తర్వాతి ఓవర్ మొదలెట్టాలి. ఒకవేళ అలా చేయకుంటే బౌలింగ్ జట్టు కెప్టెన్‌కు అంపైర్ రెండు హెచ్చరికలు చేస్తారు. అయినా కూడా మూడోసారి అదే పొరపాటు జరిగితే ఆ జట్టుకు అంపైర్ ఐదు పరుగులను పెనాల్టీగా విధిస్తాడు. ఆ తర్వాత 80 ఓవర్ల వరకూ స్లో ఓవర్ రేటుకు పాల్పడితే మళ్లీ రెండు హెచ్చరికలు చేసి.. రిపీట్ అయితే మళ్లీ 5 రన్స్ జరిమానా తప్పదు. అంతే కాదు షార్ట్ రన్ తర్వాత క్రీజులో ఎవరు ఉండాలనేది బ్యాటింగ్ జట్టు నిర్ణయించుకోవచ్చని ఐసిసి తెలిపింది. ఇదివరకే వన్డేల్లో స్టాప్ క్లాక్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే.



### లాలాజలంపై నిషేధం..

మ్యాచ్ సమయంలో బంతికి లాలాజలం రుద్దడంపై నిషేధం ఉంది. ఈ నిబంధనలో ఏ మార్పు చేయలేదు కానీ, ఒకవేళ బంతిపై సలైవా కనిపిస్తే వెంటనే బాల్‌ను మార్చకూడదని ఐసిసి సూచించింది. ఎందుకంటే.. కొత్త బంతిని తీసుకోవాలనే ఉద్దేశంతో బౌలింగ్ జట్లు లాలాజలం ఉపయోగించే అవకాశముంది. ఒకసారి బంతిని మారిస్తే.. ప్రతి జట్టు ఇదే పద్ధతిని అవలంబిస్తుంది. సో.. వాళ్లకు ఆ ఛాన్స్ ఇవ్వకూడదని ఐసిసి భావిస్తోంది. ఇంతకుముందులాగే బంతి పూర్తిగా దెబ్బతిన్నప్పుడు మాత్రమే దాన్ని మార్చేందుకు అంపైర్లకు అనుమతించింది ఐసిసి.

### డిఆర్ఎస్ సరికొత్తగా..

అంపైర్ నిర్ణయాన్ని సవాల్ చేసే డిఆర్ఎస్‌పై కూడా ఐసిసి కీలక ఆదేశాలు ఇచ్చింది. వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటైన బ్యాటర్ రివ్యూ కోరితే.. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి ప్యాడ్‌కు తాకిందా, బ్యాట్‌కు తగిలిందా అనేది చూస్తున్నారు. ఒకవేళ అది క్యాచ్ కాదని తెలియగానే టీవీ అంపైర్ ఎల్బీగా ఔటయ్యాడా? అని చెక్ చేస్తారు. అప్పుడు బాల్ ట్రాకింగ్ నాటౌట్ అని తేలితే.. అంపైర్ కాల్ నిర్ణయమే ఫైనల్. అయితే.. అప్డేట్ నిబంధన ప్రకారం బాల్ ట్రాకింగ్‌లో ఎల్బీగా కనిపిస్తే.. ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇస్తే ఆదే నిర్ణయం చెల్లుతుంది. రివ్యూలో అంపైర్ కాల్ అని చూపించినా సరే బ్యాటర్ డగౌట్‌కు వెళ్లాల్సిందే.

## సూర్యకుమార్‌కు శస్త్రచికిత్స పూర్తి



కొంతకాలంగా స్పోర్ట్స్ హెర్నియాతో బాధ పడుతున్న టీమ్‌ఇండియా టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు జర్మనీలోని మ్యూనిచ్ నగరంలో విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. అతడు ఈ విషయాన్ని తన ఇన్‌స్ట్రాగ్రామ్ ఖాతాలో పంచుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ కొంతకాలంగా పొత్తికడుపులో కుడివైపున స్పోర్ట్స్ హెర్నియాతో బాధ పడుతున్నాడు. ఆపరేషన్ కోసం ఇటీవలే జర్మనీ వెళ్లాడు. తాజాగా శస్త్రచికిత్స ముగిసి, కోలుకుంటున్నాడు. ఈ విషయాన్ని అతడు తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపాడు. అలాగే రెండు వారాల్లో బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. 'లైఫ్ అప్‌డేట్: కుడివైపు పొత్తికడుపు ప్రాంతంలో స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం కోలుకుంటున్నాను. త్వరగా మైదానంలోకి రావాలని ఉంది' అని బుధవారం ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టాడు. సూర్యకుమార్ యాదవ్‌కు ఇది మూడో సర్జరీ. 2023లో మడమకు ఆపరేషన్ జరిగింది. 2024లోనూ హెర్నియాకు శస్త్రచికిత్స నిర్వహించారు. సూర్యకుమార్ ఐపిఎల్ 2025లో ముంబయి ఇండియన్స్‌ను ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో అతడు 717 పరుగులు సాధించాడు. ఓపెనర్ కాని బ్యాటర్ ఐపీఎల్ టోర్నమెంట్‌లో చేసిన అత్యధిక పరుగులు ఇవే. అలాగే టీ20ల్లో వరుసగా 16 సార్లు 25 కంటే ఎక్కువ స్కోర్లు చేసి రికార్డ్ సృష్టించాడు. ఈ ఐపీఎల్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గానూ నిలిచాడు.

## పొట్టి క్రికెట్లో భారీ మార్పులు..

### ఓవర్లు కుదిస్తే పవర్ ప్లే ఇలా..!



అంతర్జాతీయ క్రికెట్ మండలి వరుసగా కీలక నిర్ణయాలను ప్రకటిస్తోంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో స్టాప్ క్లాక్‌ను ప్రవేశ పెట్టిన ఐసీసీ టీ20లపై కూడా నజర్ వేసింది. పరిస్థితులకు తగ్గట్లు పొట్టి క్రికెట్‌లో మార్పులు అనివార్యం అని భావించిన మండలి.. పవర్ ప్లేలో కొన్ని కీలక సవరణలు చేసింది. ప్రస్తుతానికి తొలి ఆరు ఓవర్లను పవర్ ప్లేగా పరిగణిస్తున్నారు. అయితే.. వర్షం కారణంగా ఓవర్లు కుదించాల్సి వస్తే.. పవర్ ప్లేలో ఎన్ని ఓవర్లు ఆడించాలి? అనే విషయంపై మాత్రం సందిగ్ధం కొనసాగేది. దాంతో, గురువారం ఐసిసి ఈ అంశంపై స్పష్టతనిచ్చింది. టీ20లు అంటే ఇరవై ఓవర్ల ఆట. అందులో 30శాతం ఓవర్లు అంటే అరు ఓవర్లను పవర్ ప్లేగా పేర్కొంటారు. కానీ, వర్షం కారణంగా కొన్నిసార్లు 15, 10 లేదంటే 5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమవుతుంది. అలాంటప్పుడు పవర్ ప్లే ఓవర్ల సంఖ్య కూడా తగ్గుతుంది. అందుకే.. ఐసిసి మ్యాచ్ ఓవర్లను బట్టి.. పవర్ ప్లే ఓవర్లను నిర్ణయించింది.

ఉదాహరణకు 5 ఓవర్ల ఆట సాధ్యమైతే 1.3 ఓవర్ వరకే పవర్ ప్లే వర్తిస్తుంది. అదే 6 ఓవర్లు అనుకోండి.. 1.5 అంటే 11 బంతుల్లోనే పవర్ ప్లే ముగుస్తుంది. 7 ఓవర్లకు మ్యాచ్ కుదిస్తే 2.1 ఓవర్లు పవర్ ప్లే ఆడిస్తారు. అదే 8 ఓవర్ల ఆట వీలుపడితే 2.2 ఓవర్‌తో పవర్ ప్లే పూర్తి అవుతుంది. 9 ఓవర్లకు 2.4, 10 ఓవర్లకు 3 ఓవర్లు, 11 ఓవర్లకు 3.2, 12 ఓవర్లకు 3.4, 13 ఓవర్లకు 3.5, 14 ఓవర్లకు 4.1, 15 ఓవర్లకు 4.3, 16 ఓవర్లకు 4.5, 17 ఓవర్లకు 5.1, 18 ఓవర్లకు 5.2, 19 ఓవర్లకు 5.4 ఓవర్లను పవర్ ప్లేగా నిర్ణయించింది ఐసిసి.

# ఫోకస్ వ్యవసాయం



వర్షాభావ పరిస్థితులు..

## రైతులకు సూచనలు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా, ప్రత్యేకించి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సందర్భంలో వ్యవసాయ నిపుణుల సూచనలను పాటించడం రైతులకు అవసరం. ప్రత్యామ్నాయ పంటల సాగు వీటిలో ప్రధానమైనది. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా, సజ్జలు, జొన్నలు, రాగులు, కందులు, పెసలు వంటి తక్కువ నీటి అవసరం ఉండే పంటలను ఎంచుకోవాలి. ఒకే పంట కాకుండా, మిశ్రమ పంటలు వేసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. అదే విధంగా నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షపు నీటిని పొలాల్లో కాలువలు, చెరువులు, జలాశయాలలో నిల్వ చేసుకోవాలి. భూగర్భజల రీఛార్జ్ కోసం రేచ్‌పిట్‌లు, రేచ్‌వెల్స్ వంటి పద్ధతులను అమలు చేయాలి. ఈ చర్యలతోపాటు పొలం నిర్వహణ కూడా అవసరం. పొలం మీద మల్చింగ్ (పొడి ఆకులు, గడ్డి, పంట మిగులు) వేసి నేలలో తేమను నిల్వ చేసుకోవచ్చు. పొలం దున్నడం, మొక్కల మధ్య దూరం పెంచడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. సాగు కాలం మార్పులను చేపట్టాలి. విత్తే కాలాన్ని వర్షాలకు అనుగుణంగా మార్చుకోవాలి. స్వల్పకాలిక రకాల పంటలు ఎంచుకోవడం మంచిది. ప్రభుత్వ, వ్యవసాయ శాఖల సూచనలు పాటించాలి. స్థానిక వ్యవసాయ అధికారుల ప్రకటనలు, మార్గదర్శకాలను తెలుసుకోవాలి. పంటల బీమా, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ సహాయాలను వినియోగించుకోవాలి. తెగుళ్లు, పురుగుల నివారణపై దృష్టి కేంద్రీకరించాలి. వాతావరణానికి అనుగుణంగా తెగుళ్లు, పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలి.

పశుపోషణ, కూరగాయలు, పూలు వంటి ఇతర ఉపాధి మార్గాలను కూడా పరిశీలించాలి. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాన్ని తగ్గించడానికి పంట వైవిధ్యం, నీటి సంరక్షణ, ప్రభుత్వ సహాయాలు, మరియు శాస్త్రీయ సూచనలు పాటించడం అత్యంత అవసరం.

## ఎంచుకోవాల్సిన పంటలు...



తక్కువ నీటి అవసరం ఉండే పంటలు (ఆరుతడి పంటలు) రైతులకు అనుకూలం. సజ్జలు, జొన్నలు, రాగులు, కందులు, పెసలు, మినుములు, శనగలు వంటి పంటలను ప్రయత్నించడం మంచిది. అదేవిధంగా గుమ్మడి, దోసకాయ, కాకరకాయ వంటి కూరగాయలు వేసుకోవచ్చు. ఈ పంటలు తక్కువ వర్షపాతం ఉన్నా కూడా సంతృప్తికరమైన దిగుబడిని ఇస్తాయి. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో కనీసం రెండు నుంచి నాలుగు ఎకరాల్లో ఈ తక్కువ నీటి పంటలు వేసుకోవచ్చు. పంట మార్పిడి వల్ల తెగుళ్లు, పురుగులు కూడా తగ్గుతాయి. విత్తనాలు విత్తే ముందు నేల తేమను పరిశీలించాలి. మిశ్రమ పంటల వినియోగాన్ని పరిశీలించాలి.

## తేమ నిల్వ నిర్వహణ..



రైతులు వర్షాభావ పరిస్థితుల్లో నేల తేమ నిల్వను నిర్వహించే విధానాలను, మార్గాలను తెలుసుకోవాలి. ఆచరణలో పెట్టాలి. వీటిలో మల్చింగ్ (ఆచ్ఛాదన) అనేది పంట వ్యర్థాలు, పొడి ఆకులు, గడ్డి వంటి వాటిని నేలపై పరచడం ద్వారా నేలలో తేమను ఎక్కువ కాలం నిల్వ చేయొచ్చు. ఇది కలుపు నివారణకూ సహాయపడుతుంది. పొలాల చుట్టూ గట్టులు వేసి, వర్షపు నీరు పారిపోకుండా నిల్వ చేయాలి. ఇది నేల తేమను పెంచుతుంది. పొలం దున్నడాన్ని తగ్గించడం ద్వారా నేల తేమ ఆవిరైపోకుండా ఉంటుంది. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా తేమను ఎక్కువ రోజులు నిలుపుకోవచ్చు. చెరువులు, రేచ్‌పిట్‌లు, చిన్న జలాశయాలు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి. కలుపు మొక్కలను తొలగించడం వల్ల నేల తేమను పంటలే ఎక్కువగా వినియోగించుకుంటాయి. ఈ పద్ధతులు వర్షాభావ పరిస్థితుల్లో నేల తేమను నిల్వ చేసి, పంటలకు అవసరమైన తేమ అందుబాటులో ఉండేలా చేస్తాయి.

## విత్తన శుద్ధిపై దృష్టి పెట్టండి

వ్యవసాయ పనులు ప్రారంభమైన వెంటనే, విత్తన శుద్ధిపై రైతులు దృష్టి కేంద్రీకరించాలి. ఈ విధంగా శుద్ధి చేయడం ద్వారా విత్తనాలపై ఉండే కీటకాలు, శిలీంద్రాలు, తెగుళ్లను నివారించి పంటకు రక్షణ కల్పించవచ్చు. విత్తన శుద్ధి పద్ధతులు ప్రధానంగా మూడు విధాలుగా ఉంటాయి..

**పొడి విత్తన శుద్ధి:** విత్తనాలకు క్రిమిసంహారక మందులను పొడి రూపంలో కలిపి బాగా కలపడం. ఉదాహరణకు, వరి విత్తనాలకు 1 కిలో విత్తనానికి 23 గ్రాముల కార్బండిజమ్ పొడి కలిపి 24 గంటల తర్వాత విత్తనాన్ని చల్లుకోవాలి.

**తడి విత్తన శుద్ధి:** సిఫారసు చేసిన మందులను నీటిలో కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 12 నుంచి 24 గంటలు నానబెట్టి, ఆ తర్వాత మడిలో చల్లించి విత్తకం చేయడం.

**పైపూత లేదా కోటింగ్ పద్ధతి:** విత్తనంపై తడి లేదా పొడి పదార్థాలతో మందును పూతగా వేయడం, ఇది విత్తనానికి మందు బాగా అంటుకునేందుకు సహాయపడుతుంది. ఆధునిక పద్ధతుల్లో ప్రత్యేక జిగురు పదార్థాలతో కోటింగ్ చేస్తారు.



అధునాతనంగా, విత్తన చుట్టూ గుళిక (పెల్లెటింగ్) చేయడం ద్వారా విత్తనపు ఆకారాన్ని మార్చి విత్తడం సులభతరం చేస్తారు, కానీ ఇది ఖరీదైన పద్ధతి.

విత్తన శుద్ధి కోసం ఉపయోగించే మందులు, రసాయనాలు మానవులు, పశువులకు హానికరమైనవిగా ఉండవచ్చు కాబట్టి జాగ్రత్తగా, సూచించిన మోతాదులో మాత్రమే వాడాలి. శుద్ధి చేసిన విత్తనాలను తినకూడదు. విత్తనాల్లో తేమ 8 నుంచి 10 శాతం వరకు ఉండేలా చూసి శుద్ధి చేయాలి. సారాంశంగా, విత్తన శుద్ధి ప్రక్రియలో విత్తనాలను క్రిమిసంహారక మందులతో పొడి లేదా తడి రూపంలో కలిపి, లేదా పైపూత వేసి, విత్తనాలను రోగాల నుంచి రక్షించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ పంట దిగుబడిని పెంచడంలో, వ్యాధుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది.

## నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేంధర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎంతోమంది యువతీ యువకులు ఉన్నత చదువులు చదువుకుని నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నారని, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేంధర్ ఆరోపించారు. గురువారం అఖిల భారత యువజన సమాఖ్య, ఎఐవైఎఫ్ చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాలలో ఎఐవైఎఫ్ శాఖల కమిటీలు వేయడానికి మండలంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఎఐవైఎఫ్ నాయకుడు చెంచల రవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యుగేందర్ మాట్లాడుతూ ఎఐవైఎఫ్ నిరంతరం నిరుద్యోగ సమస్యపై, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన కోసం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. ఏటా కోటి ఉద్యోగాల మాట నీటి మూటలయ్యాయని, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వంలో హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఏ ఒక్క పరిశ్రమలు సైతం ఈ ప్రాంతానికి తెచ్చిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ నాయకులు చెంచల రవి, పి. వెంకటేష్, లక్కిరెడ్డి సురేందర్ రెడ్డి, చెప్యాల శ్రీనివాస్, పైడిపల్లి శశికుమా ర్, సిహెచ్.హరీష్ చారి, తిరుపతి, శ్రీశైలం, తదితరులున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలు వెంటనే పరిష్కరించాలి : గోదా

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మల్లిఖార్జున గార్డెన్‌లో ఉట్కూరి భగవంతం అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ 18వ మండల మహాసభ నిర్వహించగా గోదా శ్రీరాములు పాల్గొని మాట్లాడారు. గత 55 ఏండ్లుగా ఈ ప్రాంతంతోపాటు చుట్టుపక్కల మండలంలోని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సింది పోయి రోజు రోజుకు రామన్నపేటలోని ఏరియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరుతుందన్నారు. దీంతో పేదలకు వైద్యం పెనుభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోని ఆసుపత్రిలో రోగులకు మౌలిక వసతులు కల్పించి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీరు అందించే లక్ష్యంతో గత 20 ఏండ్ల క్రితం చేపట్టిన ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వ నేటికి పూర్తి కాకపోవడంతో రైతాంగం సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాల్వ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతాంగానికి పూర్తిస్థాయిలో పరిహారం అందకపోగా, ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ మూలంగా అనేక మంది పేదల ఇండ్లు, ఇంటి స్థలాలు కోల్పోకుండా పేదలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, బాలగోని సత్యనారాయణ, మహిళా సంఘం అధ్యక్షురాలు బండి జంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## మావోయిస్టులు వనం వీడాలి


- ఎర్రజెండాలన్నీ ఏకంకావాలి
- డిసెంబర్ 26న ఖమ్మంలో 5లక్షల మందితో భారీ మహాసభ
- ఖమ్మం-కొత్తగూడెం జిల్లాల కేంద్రంగా ఇక ప్రజా ఉద్యమాలు : కూనంనేని సాంబశివరావు
- అట్టహాసంగా ఖమ్మం రూరల్ 14వ మండల మహాసభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** దేశంలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒక్కటై ఢిల్లీలో ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగరవేద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోని రాంలీల ఫంక్షన్‌హాల్‌లోని పోటు ప్రసాద్ ప్రాంగణంలో సిపిఐ 14వ మండల మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత ప్రాంగణం ఎదుట ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేళ్లచెర్వు లలిత, మొహ్మద్ గౌస్‌పాషా, లింగా వెంకటనారాయణ, బత్తిని సీతారాములు, జగన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కూనంనేని మాట్లాడారు... ప్రజలిచ్చిన అధికారంతో విర్రవీగుతూ అమిత్‌షా వీధిరౌడిలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మావోయిస్టులు చర్చలకు వస్తామన్నప్పటికీ కేంద్రం మారణకాండ చేస్తుండటం సరికాదన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి బిజెపి రైతు వ్యతిరేకిగా పదేపదే వ్యవహరిస్తునే ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదంతోనే బిజెపి కల్లులొట్టబోయి గెలిచి మరలా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. ఆపరేషన్ కాగర్‌కు వ్యతిరేకంగా మావోయిస్టులకు తొలుత మద్దతుగా నిలిచింది సిపిఐ పార్టీనే అన్నారు. మావోయిస్టులు వనంవీడి జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని కార్పొరేట్ ప్రభుత్వాలను నమ్ముకుంటే మావోయిస్టులను హతమార్చినట్టే ప్రజలను సైతం హతమారుస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ మేధావులు, విశ్లేషకులు కమ్యూనిస్టుల ఆవశ్యకతను నొక్కి చెబుతున్నారన్నారు. అందుకు తగ్గట్టుగానే శ్రీలంకతో పాటు తదితర దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు గెలిచాయన్నారు. కావున ప్రజలు కూడా మోసపూరిత పార్టీలను పక్కన పెట్టి బతుకునిచ్చే కమ్యూనిస్టు చెట్టును పెంచుకుందాం అన్నారు. వందేండ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని ఖమ్మంలో డిసెంబర్‌లో జరుగు వేడుకలను 5లక్షల మందితో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలతో తెలంగాణ విధ్వంసానికి గురైందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఆగ్రహానికి గురై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికే సంవత్సరంనర కాలం గడిచిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక తన సమర్ధతను నిలబెట్టుకోవాలన్నారు. ఖమ్మంభద్రాద్రికొత్తగూడెం జిల్లాల కేంద్రంగా ఇక ప్రజా ఉద్యమాలు నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగా కామ్రేడ్స్ పని చేస్తూ ప్రజాబలాన్ని కూడగటాలని సూచించారు. అనంతనం నూతన మండల, ఏదులాపురంమున్సిపాలిటీ కమిటీలు, పార్టీ సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పలు తీర్మానాలను ప్రవేశపెట్టుకొని ఆమోదింప చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తినాయక్, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, ఉన్నం రంగారావు, ఎడ్లపల్లి శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, పగీళ్ల వీరభద్రం, ఐఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, ఎఐటియుసి జిల్లా నాయకులు శింగు నర్సింహారావు, గాదె లక్ష్మినారాయణ, సీతామాలక్ష్మి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు పాసంగుల చంద్రరావు, ఏలూరి భాస్కర్, మామిడి శంకర్‌రెడ్డి, బట్టా బాబు, మేళ్లచెర్వు వీరబాబు, వెన్నం భాస్కర్, యువజన సంఘం సభ్యులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, ఉసికల రవికుమార్, గణపరపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'సింగరేణి' బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి బొగ్గును, విద్యుత్తును వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.26 వేలకోట్లు బకాయి పడ్డదని, వెంటనే అట్టి బకాయిలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె 11వ ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణి బొగ్గును, విద్యుత్తును వాడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు రూ.26 వేల కోట్లు బకాయిలు పడ్డారని వాటిని ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.19 వేల కోట్లు బకాయి పెడితే, ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా దాదాపు ఏడు వేల కోట్ల రూపాయలు బకాయి పడ్డదని, కనీసం పది వేల కోట్ల రూపాయలు చెల్లించినా సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం, కొత్త గనుల కోసం, మెటీరియల్ కొనుగోలు కోసం, యంత్రాల కొనుగోలు కోసం ఉపయోగించే అవకాశం ఉందని, ఇట్టి బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాకపోవడం వల్ల సింగరేణి సంస్థ అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మాదని, మేమే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని చెబుతున్న ఐఎన్‌టియుసి నాయకులు ప్రభుత్వం నుంచి బకాయిలు ఎందుకు ఇప్పించడం లేదో కార్మికులకు చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా సింగరేణి సొమ్మును ప్రభుత్వానికి దానం చేయడంలో ఉన్న శ్రద్ధ యాజమాన్యంకు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ ఎందుకు లేదని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికులకు గనులపై లాకర్‌లు ఏర్పాటు చేయడానికి డబ్బులు లేవని చెబుతున్న యాజమాన్యం ప్రభుత్వానికి మాత్రం కోట్ల రూపాయల సిఎస్‌ఆర్ నిధులను, డిఎంఎఫ్‌టి నిధులను ఇవ్వడం జరుగుతుందని ఆయన ఆరోపించారు. ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియుసి ప్రభుత్వం సింగరేణి సంస్థకు బకాయిపడిన వేల కోట్ల రూపాయలను ఇప్పించడం చేతకాదని, గుర్తింపు సంఘంగా ఎఐటియుసి చేసిన పనులను మేమే చేశామని చెప్పుకోవడం మాత్రం వస్తుందని ఆయన ఆరోపించారు. కార్మికుల సమస్యలపై పోరాడేది ఎవరో కార్మికులకు బాగా తెలుసన్నారు. సింగరేణి కార్మికులకు అలవెన్స్‌లపై ఇన్కమ్ టాక్స్ రద్దు, సొంతింటి కల సాకారం కోసం కృషి చేస్తున్నామని వెల్లడించారు. అలాగే సింగరేణి సంస్థ లాభాల వాటాను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటాను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27 న కొత్తగూడెంలో డైరెక్టర్స్‌తో జరిగే సమావేశంలో మాట్లాడుతామని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని నిరసిస్తూ జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మద్దిఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్, సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అక్బర్ అలీలు మాట్లాడగా, బ్రాంచి ఆఫీస్ బేరర్స్ ఎస్ వెంకట్ రెడ్డి, సిద్దమల్ల రాజు , ఎం .చక్రపాణి, సయ్యద్ సోహేల్, చెప్యాల భాస్కర్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, నాయకులు గొడిశల నరేష్, ఎం.ఎ. గౌస్,సంతోష్ రెడ్డి, కుక్కల శ్రీనివాస్,వెంకట స్వామి, పొన్నం రంజిత్, జక్కుల శ్రీనివాస్,మందల కిరణ్, ఎం.డి.రియాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి సమావే శం గురువారం బెల్లంపల్లిలోని కామ్రేడ్ భాశెట్టి గంగారం భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ రామడుగు లక్ష్మ ణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలి, కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగర్ పేరుతో మావోయిస్టులపై కొనసాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే నిలిపివేసి, వారితో శాంతి చర్చలు జరిపి మానవ హక్కులను పరిరక్షించాలని ఆయన అన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూ ములకు వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా పేదలకు నూతన రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి అని కో రారు. బొగ్గు గనుల కార్మికులకు రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గనుల ఉద్యోగులకు కేంద్రం, యాజమాన్యం ఇంటి కిరాయి చెల్లించాలి. సొంత ఇంటి పథకంలో భాగంగా రెండు గుంటల భూమి నిధులను యాజమాన్యం అందించాలన్నారు. సిపిఐకి అనుబంధంగా ఉన్న ప్రజా సంఘాల ద్వారా జిల్లాలో బలమైన నిర్మాణం ఏర్పడింది. అందుకే జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయానికి ఒక ఎకరం భూమి కేటాయించాలని అన్నారు. 2024, 25 సంవత్సరానికి సంబంధించిన సింగరేణి లాభాలను ప్రకటించి, కార్మికులకు 40 శాతం వాటా ను కల్పించి, సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించాలన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, సిపిఐ సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి, సహాయ కార్యదర్శి బొల్లం తిలక్, జిల్లా సభ్యులు గుండా చంద్రమాణిక్యం, డిఆర్. శ్రీధర్, కొంకుల రాజే ష్, మహిళా నాయకురాలు గుండ సరోజ, బొ ల్లం సోని, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పిడిఎస్ బియ్యం పట్టివేత : ఎస్ఐ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఉట్కూరు మండలంలోని పెద్ద జట్రం గ్రామానికి చెందిన వి.రాజు తండ్రి అంబోజప్ప అనే వ్యక్తి తన ఇంట్లో చుట్టుపక్కల ఇండ్ల నుడి తక్కువ ధరకు పిడిఎస్ రైస్ సేకరించి తన ఇంట్లో నిల్వ ఉంచినందున టాస్క్‌ఫోర్స్, ఉట్కూరు పోలీసులు దాడులు నిర్వహించి అతని ఇంట్లో (20 బ్యాగులు) 7 క్వింటాళ్ల 30కిలోల పిడిఎస్ రైస్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి డిటి కాలప్ప పంచ నామా అనంతరం రాజుపై కేసు నమోదు చేయడం జరిగిందని ఉట్కూర్ ఎస్సై రమేష్ తెలిపారు. ఉట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పిడిఎస్ రైస్ అమ్మిన, నిల్వ ఉంచిన రవాణా చేసిన అట్టి వ్యక్తుల పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.



## పురుగు మందు దుకాణాలు తనిఖీ

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలంలోని వివిధ గ్రామాల్లో విత్తనాలు, పురుగుమందుల డీలర్లషాపులను గురువారం నాగర్‌కర్నూల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని అధికారి పూర్ణచంద్రారెడ్డి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎక్కడ కూడా నకిలీవిత్తనాలు, ఎరువులు, రసాయన మందులు విక్రయిస్తే శాఖపరంగా కఠిన చర్యలతోపాటు డీలర్ల యొక్క షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కావున డీలర్లు ఎప్పటికప్పుడు తమ రిజిస్టర్లలో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, రసాయనమందులు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మండలంలోని బిజినేపల్లి, శాయిన్‌పల్లి, వడ్డెమాన్, లట్టుపల్లి ,మంగనూర్, పాలెం, వట్టెం, పోలేపల్లి గ్రామాలలోని రైతులకు ఫార్మర్ రిజిస్టర్ ఐడిలను పరిశీలించారు. అనంతరం ఫార్మర్ రిజిస్ట్రి చేసుకోవడం వల్ల ప్రయోజనాల గురించి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నీతి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలను విధిగా పాటించాలి :డిఇఒ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రైవేట్ పాఠశాలలు కచ్చితమైన నిబంధనలు పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌పిఆర్ ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా యాజమాన్య బోర్డు, గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బోర్డుసభ్యులు తప్పనిసరిగా నెలవారి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అదేవిధంగా విధిగా తల్లిదండ్రులతో ప్రతి నెల తప్పనిసరిగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. నియమ నిబంధనలకు లోబడి ఫీజులు ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలలో పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం విక్రయించవద్దని స్పష్టం చేశారు. స్కూల్ బస్సులు భద్రత నియమాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల చదువు, ఫీజులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

## శ్రీశైలం రహదారిలో ప్రైవేట్‌బస్సు బోల్తా

**ప్రజాపక్షం/అచ్చంపేట :** శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారిలో గురువారం దోమలపెంట బస్టాండు సమీపంలో శ్రీశైలం వెళుతున్న ప్రైవేట్‌బస్సు బ్రేక్‌ఫెయిలై బోల్తా పడటంతో బస్సులో సుమారు 40మంది ఉన్నారని దోమలపెంట ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతున్న టిఎస్08యుఎ2329అనే బస్సు శ్రీశైలం వెళుతుండగా దోమలపెంటవద్ద బ్రేకులు ఫెయిలై గోడకు ఢీకొనడంతో గాయపడినవారిని 108 వాహనంలో ఈగలపెంట జెన్‌కో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సులో యాత్రికులు అంతా ఒకే కుటుంబానికి చెందినవారని తెలిపారు. వివాహం జరిగినతర్వాత శ్రీశైలం దైవదర్శనానికి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జీవితంలో స్థిరపడాలి :ఎమ్మెల్యే యెన్నం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అప్రెంటీస్‌షిప్ జాబ్‌మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని వివిధ కంపెనీలే కాకుండా మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు కూడా మీకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇక్కడ వచ్చారని ఆయన చెప్పారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన మీరంతా కంపెనీ ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూలలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అంతకు ముందు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన మహబూబ్‌నగర్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు పవన్, పావని లను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, రాష్ట్ర పరిశీలకులు నందూరి శ్రీనివాస్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ భగవాణి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



**ప్రజాపక్షం/జడ్చర్ల:** రాజాపూర్ అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజాపూర్ మండల కేంద్రంలో జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన ర్యాలీలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిరోధక సదస్సుకు ఆహ్వానించిన సిఐ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి ఇక్కడకు దిగుమతి అవుతుండటం చాలా విచారకరం, చిన్న వయసులోనే పలు పిల్లలు మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవతాలను నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్య నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా పని చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# సమష్టి కృషితోనే డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణం

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సమష్టి కృషితో నారాయణపేటను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేయాలన్నారు. గురువారం ప్రపంచ మత్తు పదార్థాల నిరోధక దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు యాంటీ డ్రగ్స్ డేను పురస్కరించుకొని వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని, గతేడాది కూడా ఈ ర్యాలీలో తాను పాల్గొన్నానని, ఇప్పుడు కూడా పాల్గొనడం, ఈ ర్యాలీకి పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఒకప్పుడు పెద్ద నగరాల్లో మాత్రమే లభించే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు మహమ్మారిలు మారుమూల ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణను చేపట్టిందన్నారు. జిల్లాలో ఎవరైనా మత్తు పదార్థాలను వినియోగించినట్లు గుర్తిస్తే రాష్ట్ర పోలీస్ యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ 1908 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మత్త పదార్థాల నిరోధక విభాగాన్ని ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. తర్వాత యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవలే నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు, జిల్లా అధికారులు బహుమతులను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఐయాం ఎన్ యాంటీ డ్రగ్స్ సోల్జర్ అంటూ సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సంతకాలు చేపట్టారు. డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. చివరగా మత్తు పదార్థాల నిరోధక దినోత్సవ అవగాహన ర్యాలీని కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ అవగాహన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం అక్కడ పాఠశాలల విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డిఎస్పీ నల్లపు లింగయ్య, డీఈవో గోవిందరాజులు, ఆర్డీవో మేఘా గాంధీ, డిపిఆర్ఓ ఎం.ఏ. రషీద్, జిల్లా అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జెడ్‌పి హైస్కూల్ పూర్వ ప్రాథమిక పాఠశాల (అంగన్‌వాడీ)లను తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం గండీడ్ మండలం సల్కార్‌పేట గ్రామంలో పర్యటించి ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, జడ్పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 1,2,3వ తరగతి గదులలో విద్యార్థుల బోధన పరిశీలించారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులను రెగ్యులర్‌గా హాజరు అయ్యేలా చూడాలని అన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రానివ్వద్దని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అంగన్‌వాడీని తనిఖీ చేశారు. అంగన్‌వాడీలోని మధ్యాహ్నం భోజనం చేస్తున్న పిల్లలు ఆహారాన్ని పరిశీలించింది. ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. పప్పు చారు లాగా పలుచగా గుడ్డు పెట్టారా ఎందుకు పెట్టలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు పౌష్టిక ఆహారం, గుడ్లు సక్రమంగా అందజేయాలని వారి పర్యవేక్షణ చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత జడ్పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ రుచి చూసి పరిశీలించారు. వెజిటేబుల్ కర్రి పలుచగా నీళ్ల లాగా ఉండడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని అన్నారు. తర్వాత స్టోర్ రూమ్‌లో బియ్యం, ఆహార పదార్థాలు పరిశీలించారు. వెజిటేబుల్ కర్రీ పలుచగా నీళ్ల లాగా ఉండడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని అన్నారు. తర్వాత స్టోర్ రూమ్‌లో బియ్యం, ఆహార పదార్థాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.మల్లికార్జున రావు తదితరులు ఉన్నారు.

# మత్తు పదార్థాలు వినియోగిస్తే జైలుకే




జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి :** మత్తు పదార్థాలు వినియోగిస్తే జైలుకి వెళ్లడం ఖాయమని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర ఆదర్శ సురభి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అంబేద్కర్ సేవ్‌కు రాజీవ్ చౌరస్తా నుండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు సాగిన ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరదా కోసం మొదలైన అలవాటు, మత్తులోకి నెడుతొందని, గతంలో సిగరేట్, మద్యంతో సరిపెట్టుకునే యువత, ఇప్పుడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారిన పడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్ బారిన పడి యువత అందమైన జీవితాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు, జిఇల్లా సంక్షేమ అధికారి సుధారాణి, యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, డిఈఓ అబ్దుల్ ఘని, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐ రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్ , సిసిఎస్ సిఐ, రవిపాల్, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, మెడికల్ కళాశాల విద్యార్థులు, కళాశాల, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుపదార్థాలు జీవిత విధ్వంసానికి దారితీస్తాయి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్, జిల్లా ఎస్‌పి రఘునాథ్ గైక్వాడ్ వైభవ్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. గురువారం జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా మహిళాశిశు సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమరవాణ వ్యతిరేక దినోత్సవం పట్టణంలోని జడ్పిహెచ్‌ఎస్ బాలుర పాఠశాల నుండి ప్రభుత్వ ఆస్పత్రి, అంబేద్కర్ కూడలి వరకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఇప్పుడు గ్రామ స్థాయివరకు వచ్చాయని, సమాజానికి ఒక చీడపురుగుల మాదక ద్రవ్యాల వ్యవస్థ మారిందని అందుకు ప్రతి ఒక్కరూ రూపుమాపేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లామహిళా శిశుసంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి , డిఎస్‌పి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, పోలీస్, జిల్లా సంక్షేమశాఖ, వివిధశాఖల జిల్లా అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతీ పౌరుడి బాధ్యత :జడ్జి బి.పాపిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కలిగించాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్స్ అండ్ సెషన్స్ జడ్జి బి.పాపిరెడ్డి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్ శాఖల, స్టేడియం గ్రౌండ్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం 2025 ర్యాలీని స్టేడియం గ్రౌండ్ వద్ద ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెక్షన్స్ జడ్జి బి.పాపిరెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పి డి.జానకిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాలను వారికి అవగాహన కలిగించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటేశ్వర్లు, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.కృష్ణ, డిపిఆర్ఓ శ్రీనివాస్, ఎల్‌డియం. భాస్కర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఎంఓడి శ్రీనివాస్ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ నటరాజు, సీనియర్ సిటిజన్ ఫోరం నుండి నాగభూషణం, జగపతి రావు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం : సునీతరావు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రజా సంక్షేమాన్ని కేంద్రంలోని బిజెపి విస్మరిస్తోందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు విమర్శించారు. జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత ఆధ్వర్యంలో గురువారం జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తా వరకు చేరుకుని సిలిండర్లను ప్రదర్శించి ధర్నా చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు మాట్లాడుతూ మహిళల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సామాన్యుడి నడ్డివిరిచే విధంగా రూ.50 సిలిండర్ ధర పెంచారని ఆరోపించారు. చీరలు, చిన్నారులు ఉపయోగించే పెన్సిల్, పాలపై కూడా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధిస్తున్నదని ఆరోపించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, జిల్లా ఇంచార్జిలు సుక న్య, వెంకట సుబ్బమ్మ, అరుణ, జిల్లాలోని పట్టణ అధ్యక్షులు, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా కాంగ్రెస్ బలోపేతం చేయాలి**

అనంతరం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ విభాగం ఎంతో పటిష్టంగా ఉందన్నారు.

## మెడికల్ కళాశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష చేశారు. తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందితో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ కళాశాల తరగతిగదులు, ప్రయోగశాలలు, హాస్టల్‌గదులు, వసతి సముదాయాలు, భోజనశాలవంటి భాగాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు. కళాశాల పరిసరాల్లోని శుభ్రత, నీటిసరఫరా, విద్యుత్, ఇంటర్నెట్, కళాశాలలో విద్యార్థులవసతి, భద్రత, ఆహారం, చదువుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వపరంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల అదనపు భవనాలు, హాస్టల్ సముదాయాల పనులు వేగంగా పూర్తి చేయాలని, సంబంధిత ఇంజనీరింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌కు ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైద్యకళాశాల అధ్యాపకులు ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ రాజ్యం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదింటి కల సహకారం చేసే దిశగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాలతో పెబ్బేరు మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ముఖ్య అతిథిగా హాజరై పెబ్బేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి భూమి పూజ చేసి ,ముగ్గు పోసి పనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ షాహినాబేగం, పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రాములు యాదవ్, జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్, మండల సీనియర్ నాయకులు యాపర్ల రాంరెడ్డి, దయాకర్ రెడ్డి, వెంకట్, రమణ, నరేందర్, సత్యా నారాయణరెడ్డి, పెబ్బేరు టౌన్ 6వ వార్డు ఇంచార్జీ సీత రాములు గౌడ్, రాంపురం భగవంతు నాయుడు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కోరి కురుమన్న, బాలరాజు యాదవ్, అమిన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో జిల్లా వైద్య బృందం, ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ బృందం, ఎన్‌జీఓ టీం సభ్యుల సహకారంతో గురువారం నిర్వహించిన వైద్య సమగ్ర ఆరోగ్య వైద్య శిబిరం అయింది. గ్రామంలో 82 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్న పరీక్షలు చేయించుకోవాలని డయాబెటిస్, బిపి, క్షయవ్యాధి నిర్ధారణకు స్పూటమ్ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, సిఫిలీస్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారి డా.చంద్రశేఖర్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎమ్‌ఎల్‌హెచ్ డా.నాగరాజు, హెల్త్ అసిస్టెంట్స్ ఇస్తెరయ్య, రామచంద్రయ్య, ఆశ కార్యకర్తలు, శామలమ్మ, సునిత, హెచ్‌ఐవి టీం బంగారయ్య, మొబైల్ హెచ్‌ఐవి కౌన్సిలర్ లక్ష్మ ణ్, ల్యాబ్ టెక్నిషియన్ క్షయవ్యాధి బృందం లక్ష్మీ నారాయణ, రేడియా కార్య, ఎక్స్‌రే టెక్నిషియన్ మధు, ఖాజా, పంచాయతీ కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఆగస్టు 1,2 తేదిలలో కల్వకుర్తి పట్టణంలో నిర్వహించతలపెట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మూడో మహాసభలు జయప్రదం చేయడం కోసం ప్రతి కార్యకర్త, అభిమాని కృషి చేయాలని పార్టీశ్రేణులు అంతా తరలి రావాలని కొమ్ము భరత్ విజ్ఞప్తి చేశారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## బిసిల పట్ల కవితది మొసలికన్నీరు..



ప్రజాపక్షం/కోదాడ: బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బిసిలకు ద్రోహం చేసి ఇప్పుడు బిసిలు అన్యాయానికి గురవుతున్నారని ఎమ్మెల్సీ కవిత మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదమని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం కోదాడలోని బిసి కార్యాలయంలో బిసి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బిసి కులగణన పూర్తి చేసి, అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి గవర్నర్ ఆమోదముద్రవేసిన తర్వాత కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పంపిన బిసి బిల్లును పరిశీలించకుండా షెడ్యూల్ నైన్‌లో చేర్చకుండా పక్కన పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి చెందిన బిజెపి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మద్దతు కోరడంతో అతనితో చర్చించడం సరికాదన్నారు. ఇనుగుర్తి వెంకటరమణ, నిగిడాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళ ప్రజల కోసం..

ప్రజాపక్షం/కోదాడ: కళ కళ కోసం కాదని, కళ కాసుల కోసం కా దని, కళ ప్రజల కోసమని నినదించి ప్రజలను చైతన్య పర్చిన ప్రజానాట్య మండలి 50 వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కోదాడలోని బిల్డింగ్‌వర్కర్స్‌యూనియన్‌కార్యాలయంలో జిల్లా స్థాయి కళాకారుల సమావేశంలో మాట్లాడారు.జిల్లాలో సుద్దాల హనుమంతు మొదలుకొని అనేక మంది గొప్ప కళాకారులనుతయారు చేసిందని, మాభూమి,ముందడుగు,భూ భాగవతం, రాజకీయబాగోతం,పద్మవ్యూహం, మనమెట్ల బ్రతకాలి లాంటి కళారూపాలను తయారు చేసినచరిత్రప్రజానాట్యమండలిది అన్నారు. దొంతగాని సత్యనారాయణ, జంపాల మల్లయ్య, దూళిపాళ ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాసరావు, ఎస్‌కె లతీఫ్, గోపనబోయినవెంకటేశ్వర్లు,కందుకూరిరవికుమార్,జంపాల స్వరూప ఉన్నారు.

## పర్యాటక ప్రాంతంగా సద్దల చెరువు



ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని సద్ద ల చెరువును పర్యాటక ప్రాం తంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలురూపొందించాలని రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తో కలిసి పటేల్ రమేష్‌రెడ్డి సందర్శించారు. చైర్మన్ మాట్లాడుతూ సద్దల చెరువు ప్రధాన ప్రవేశం వద్ద బతుకమ్మ ఘూట్, బోటింగ్, పిల్లల్లకి ఆడుకునేందుకు సామాగ్రి, అలాగే జాతీయ రహదారి వద్ద ఉన్న 5 ఎకరాల స్థలంలో ప్రజలకు వినోదం కల్గించేలా పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఏర్పా టు చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటకశాఖ అధికారి విద్యాసాగర్, ఆర్డీవో వేణుమాదవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టపడి చదివితేనే ఉజ్వల భవిత



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని ఎంఈవో బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పట్టణానికి చెందిన ప్రాఫిట్‌షూ కంపెనీ మేనేజర్ సుధాకర్ సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోని అనేక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. అదేవిధంగా ప్రాఫిట్‌షూ కంపెనీ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కంపెనీ ఛైర్మన్ కోటేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపడ్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవ ర్యాలీ



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పోలీస్ శాఖ, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, మునగాల కొండల్‌రావు డిగ్రి కళాశాల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డే ర్యాలీ డిండి ఎక్స్ రోడ్డు నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. గంజాయి, గుట్కా, సిగరేట్, మత్తు పదార్థాలకు అలవాటు పడరాదంటూ నినాదాలు చేస్తూ వివిధ సంఘాలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రమణారెడ్డి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకూడదని, గంజాయి, గుట్కా, సిగరేట్ వంటి వాటికి యువత దూరంగా ఉండాలని అన్నారు. సిఐ నర్సింహా, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ విటి, సిఐ బిసన్న, ఎంపిడివో డానియల్, ఎంఈవో మాతృనాయక్, డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ రవి, ఎస్ఐ నారాయణరెడ్డి, సాలకమ్మ, రాజ్‌కుమార్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాంసింగ్, సుజిత్, నవీన్, యశ్వంత్, అనిల్, సురేష్, సాయి, రాంబాబు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే పేదల అభ్యున్నతి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో పేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని కొండమల్లేపల్లి మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి మాజీ ఎంపిపి శంకుస్థాపన నిర్వహించారు. ఎంఎల్‌ఏ బాలునాయక్ నాయకత్వంలో దేవరకొండ నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఊట్కురి వేమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపికాసర్ల వెంకటేశ్వర్లు, కొల్‌ముంతల్ పహాడ్ మాజీ ఎంపిటిసి మాడ్గుల యాదగిరి, మల్లేపల్లి మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, బొడ్డుపల్లి శ్రీను, వస్కుల మల్లేష్, చంద్రమౌళీ, యాదగిరి, లబ్దిదారులు పాల్గొన్నారు.

## పేదలపై భారం పడనీయొద్దు..



ప్రజాపక్షం/మర్రిగూడ: ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేద ప్రజలకి ఆర్థిక భారం పడకుండా చూడాలని శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి ప్రయత్నించారు. మునుగోడు మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలు గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులు రాజ్ గోపాల్ రెడ్డిని కలిసి స్థానికంగా వున్న వాగుల నుండే ఉచితంగా ఇసుకను తీసుకునే విధంగా అనుమతులు ఇప్పించాలని కోరారు. గ్రామాలకు దగ్గరగా ఉన్న వాగుల నుండి ఉచితంగా ఇసుక తీసుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు వెంటనే మైనింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అనుమతులు ఇవ్వాలన్నారు. అనుమతులు ఇస్తామని అధికారులు తెలిపారు.అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేద ప్రజలకి ఆర్థిక భారం పడకుండా చూడాలని క్రషర్ యజమానులను కోరారు.

# మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు..

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: యువత, విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ యంత్రాంగం, సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా ఎన్ జి కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన ర్యాలీని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్‌జి కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈర్యాలీ క్లాక్ టవర్ చేరుకున్న అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం పెరిగిందని, స్టూడెంట్స్ డ్రగ్స్ కు బానిసలుగా మారుతున్నారని, తెలంగాణలో డ్రగ్స్ అన్నదే ఉండరాదని, విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కట్టిస్తున్నామని ,ఇందులో భాగంగా నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నామన్నారు.త్వరలోనే సి ఎం దీనిని ప్రారంభిస్తార ని డ్రగ్స్ వాడే వారిని తరిమి కొట్టాలని,విద్యార్థులకు సూచించారు. లైఫ్ టర్నింగ్ టైం అని, 20 ఏండ్ల వరకు చదువు,స్పోర్ట్స్,యోగ పై దృష్టిపెట్టాలని కోరారు.

ప్రకాశం బజార్ లో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల నిర్మిస్తున్నామని,డిజిటల్ తరగతుల తో పాటు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్ బాగుండాలంటే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, విద్యార్థులకు ఎం కావాలన్న ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ,మంత్రిగా సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్పీ రమేష్, డి డబ్ల్యుఓ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి.డి ఈ ఓ భిక్షపతి పాల్గొన్నారు.

### భవిత సెంటర్‌ను మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దాలి

జిల్లా కేంద్రంలో ప్రతీక్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆధునికరించిన భవిత కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రోడ్డు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.గురువారం అయన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆధునికరించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. భవిత కేంద్రం లో విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ప్రత్యేక పరికరాలు, సౌకర్యాలను మంత్రి పరిశీలించారు. కేం ద్రం నిర్వాహకులతోమంత్రి మాట్లాడుతూ ఇంకా ఏవైనా సౌకర్యాలు అవసరమైతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇదివరకే ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా 10లక్షల రూపాయలు ఇవ్వ డం జరిగిందని, ఇంకా ఎలాంటి సౌకర్యాలు కావాలో తెలియజేయాలని కోరగా, స్పీచ్ థెరపీ ఏర్పాటు చేయాలని, వారానికి రెండుసార్లు విద్యార్థులకు స్పీచ్ తెరఫీ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలుపగా, అందుకు మంత్రి అంగీకరించారు.మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్చంద్ర పవర్,అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఈఓ బిక్షపతి, ఎం ఈఓ అరుంధతి, ఇతర అధికారులు , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పిటిసిలక్ష్మయ్య,గుమ్మలమోహన్‌రెడ్డి,తదితరులు ఉన్నారు.

### బిటి రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజా ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికై కృషి చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం అయన మండలంలోని అప్పాజీపేట గ్రామంలో అప్పాజీపేట నుండి మిర్లోని గూడెం వరకు కోటి రూపాయల సిఆర్‌ఆర్ నిధులతో నిర్మించనున్న బిటి రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని,అన్నిగ్రామాలలో రహదారి సౌకర్యంతోపాటు, చెరువుల పటిష్టత వంటివి చేపట్టడం జరిగిందన్నారు. గ్రామచెరువు కట్ట పటిష్ఠతకు అంచనాలనుపంపించాలని చెప్పారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈ ఈ గిరిధర్,డి ఈ రమేష్ ఉన్నారు.

# ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య చికిత్స

### యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : వివిధ సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారంరామన్నపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణంగా పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి, వైద్య సిబ్బంది ఎంత మంది ఉన్నారని, ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. ఐదుగురు డాక్టర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఎందుకు సస్పెండ్ చేయకూడదో తెలియజేయ వచ్చాన్నారు. విధులకు హాజరు కానీ డాక్టర్స్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదుగురు డాక్టర్‌లు విధులకు హాజరు కాకపోవడం డాక్టర్‌ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్స్ సమయ పాలన పాటించాలని సమయ పాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది సూపరిండెంట్ దగ్గర లీవ్ మంజూరీ కాకముందే?ఎలా లీవ్ తీసుకుంటారని సూపరిండెంట్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. అందరూ సిబ్బంది సెలవుపై వెళితే హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్లను ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు. సిబ్బంది లీవ్ లెటర్స్‌ని పరిశీలించడం జరిగింది. అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని, ఎంత మంది పేషంట్లు వస్తారని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు వెయిటింగ్ హాల్‌లో వసతులు మరియు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ వార్డ్ ని కలియ తిరిగారు. ఆసుపత్రికి వచ్చిన వారిని పరీక్షల కోసం ప్రవేట్ ల్యాబ్‌కి పంపిస్తేచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

## శుభాంశు శుక్లాకు ‘ఆక్స్‌ఫర్డ్’ శెల్యూట్



ప్రజాపక్షం/చిట్యాల: రోదసిలోకి అడుగుపెట్టిన రెండవ భారతీయుడు శుభాంశు శుక్లాను నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందిస్తూ అభివాదాలు చేశారు. గురువారం రోజున పాఠశాల ప్రార్థన సమయంలో భారీ జాతీయ పతాకాన్ని చేత బూనిన బాలలు సుభాష్ రోదసిలోకి అడుగిడిన విషయంపై సంబురాలు చేసుకున్నారు. పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్ మాట్లాడుతూ భారత ఖ్యాతిని చాటి చెప్పిన శుక్లా భారతీయులందరికి ఆదర్శప్రాయుడన్నారు. పాఠశాల సిబ్బంది నర్రా భిక్షంరెడ్డి, నమ్ముల ఆనందకుమార్, షమీమున్నీసా బేగం, గణేష్, పుల్లెంల సంతు, ఎస్ జ్యోతి, ఎం ధనలక్ష్మి , ఆసియా, ఎం మాధవి, కె మౌనిక, ఎస్ కీర్తి, ఎన్ లింగస్వామి, బి స్వప్న, బి సంపూర్ణ పాల్గొన్నారు.

## సింధూజకు లాప్‌టాప్ అందజేత



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నిరుపేద అయిన బీటెక్ విద్యార్థిని సింధూజ కి ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. గురువారం తెలంగాణ రిటైర్డ్ వార్డెన్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పాదూరి ఇంద్రసేనరెడ్డి కుమారుడు పాదూరి సుశ్విత్ రెడ్డి ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సహకారంతో గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా పట్టణంలోని అర్జలాబావికి చెందిన నిరుపేద బీటెక్ విద్యార్థిని కుమారి టీ సింధూజకు విద్య అవసరాల నిమిత్తం లాప్‌టాప్ అందించారు.

## నిరంతర శ్రమతోనే విజయాలు సాధ్యం

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: మండలం పరిధిలోని మ హాత్మగాంధీ విశ్వవిద్యాలయం లో 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత పోటీ పరీక్షల శిక్షణ తరగతుల కార్యక్రమమును జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. గురువారం యూనివర్సిటీ లో జర్గిన సమావేశమునకు ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా చేపట్టిన కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం వేదికగా డిగ్రి మరియు పీజి విద్యార్థులకు పోటి పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె వివరించారు. విద్యార్థులు చంచల స్వభావాన్ని వీడి స్పష్టమైన అవగాహనతో సమయపాలన నిరంతర పరిశ్రమతో విజయాలు అందుకోవాలని సూచించారు. అనంతరం ఉపకులపతి కాజా ఆల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సహనం, కరుణ, స్వీయ క్రమశిక్షణ వంటి సుగుణాలను అలవర్చుకోని ముందుకు సాగాలని సూచించారు.మూడు సంవత్సరాలు కొనసాగనున్న శిక్షణ ఒప్పంద పత్రాలను రిజిస్ట్రార్ ప్రో. రవి , ఆకాడమీ చైర్మన్ కృష్ణ ప్రదీప్‌లు పరస్పరం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, స్టూడెంట్ వెల్ఫేర్ ,ఇండస్ట్రీ కనెక్ట్ డైరెక్టర్ డా సురేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ సిహెచ్ సుధారాణి, కె అరుణప్రియ, డా ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల దోపిడీపై చర్యలేవీ?

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ



ప్రజాపక్షం/మునుగోడు: ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు యూనిఫామ్‌లు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కైరాళి ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా అమ్ముతున్న పుస్తకాలను, యూనిఫామ్ పట్టుకోని అనంతరం మండల విద్యా శాఖ అధికారిచే సీజ్ చేయించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలలో పుస్తకాలను,యూనిఫామ్ ఇష్టారా జ్యంగా అమ్ముతూ విద్యార్థుల దగ్గర అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాలు, యూనిఫామ్, డైరీలు అమ్మకూడదని అన్నారు. విద్యాసంస్థలలో బహిరంగంగా పుస్తకాల అమ్ముతున్నప్పటికీ జిల్లా విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థలలో పుస్తకాలు యూనిఫామ్‌లు అమ్మడాన్ని నియంత్రించాలన్నారు. మండల నాయకులు గోపగోని ఉదయ్, సాయి కృష్ణ,నాగరాజు, రాజు, శంకర్, రాంచరణ్, దశరథ తదితరులు ఉన్నారు.

# కెసిఆర్ పాలనలోనే రాష్ట్రం అప్పులపాలు

### తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట: కెసిఆర్ పదేళ్ల పాలనలోనే రాష్ట్రం అప్పుల పాలైందని తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు వారుచేసిన అక్రమాలను మార్చిపోయే పదే పదే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే తాము ఊరుకునేది లేదని హెచ్చరించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. లక్షకోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాల మూలంగా నాణ్యతలోపించి కూల్చడమే శరణ్యంగా మారిందని విమర్శించారు. 18నెలల రేవంత్ రెడ్డి సర్కార్ రైతుల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతపెద్ద ఎత్తున రైతు సంక్షేమం కోసం నిధులను ఖర్చు చేసిన దాఖలాలు లేవని అన్నారు. కేవలం రూ.9వేల కోట్ల రూపాయల రైతు బరోసా నిధులను రైతుల ఖాతాలో జమచేసి రికార్డు సృష్టించిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకున్నా రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై మాజీ సిఎం కెసిఆర్ మాజీ మంత్రులు కెటిఆర్, హరిష్‌రావులు చేసిన విమర్శలను తిప్పికొట్టారు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. గతంలో ఏపి మాజీ సిఎం జగన్‌తో ఉన్న అత్యంత సన్నిహితంగా ఉన్న కెసిఆర్ కృష్ణ,గోదావరి జలాలను అప్పగించారని ఆరోపించారు. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి వందలకోట్లు అక్రమంగా సంపాదించాడన్నారు. శంషాబాద్ సమీపంలో 30 ఎకరాలను ఫాంహౌజ్ నిర్మాణం చేస్తున్నారని అన్నారు. ఆయనకు అన్ని డబ్బులు ఎక్కడివి అని ప్రశ్నించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్నిచూసి ఓర్వలేక బిఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు వారి మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రామ్మూర్తియాదవ్, మాజీ కౌన్సిలర్ జ్యోతికరుణాకర్, నాయకులు మధుగౌడ్, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

# సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకటించాలి


### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వం వానకాల సీజన్‌లో రైతాంగాన్ని ఆదుకునేందుకు సమగ్ర వ్యవసాయం ప్రణాళికలను ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేటజిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవనంలో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రతిరాష్ట్రం ప్రణాళికలు రూపొందించుకుని ఏ భూమిలో ఏ పంట పండుతుందో ప్రజలు ఎంత పంట అవసరమో అంచానవేసి వాటికి కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, బ్యాంకు రుణాలు రైతాంగానికి అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం కల్తీ విత్తనాలు, పురుగులు మందుల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బనకచర్ల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని పార్టీల అభిప్రాయం తీసుకుని తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం కాకుండా చూడాలన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఇందు లో రాజకీయ జోక్యంలేకుండా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెం టనే అమ లు చేయాలని కోరారు. మద్యాన్ని ఆదాయ వనరులుగాచూస్తున్నారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సిపిఎం నాయకులు కొలిశెట్టియాదగిరిరావు,ముల్కలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టపల్లి సైదులు, కోటగోపి, చెరకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా ‘సూర్యాపేట’ను తీర్చిదిద్దుతా

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట: డగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిపౌరుడు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం మాదకద్రవ్యాల అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని మెడికల్ కళాశాల నుండి నిర్వహించిన ర్యాలీని జిల్లా ఎస్‌పి నర్సింహా, జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీ మెడికల్ కళాశాల నుండి గవర్నమెంట్ ఆసుపత్రి మీదుగా సద్దల చెరువు వద్దకు డ్రగ్స్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. సద్దల చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాలవల్ల కలిగే దుష్పరిమాణాలపై ప్రజలు అవగాహన పెంపోందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, అదనపు కలెక్టర్ పి.రాంబాబు మాట్లాడారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.ఇన్‌ఛార్జి డిడబ్ల్యూవో రూప, ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ కృష్ణయ్య, డిటిడివో శంకర్, డివైఎస్‌వో రామచందర్‌రావు, అడిషనల్ ఎస్‌పి రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, నర్సింహచారి, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రీల్



## శోభన్ సరసన నయన్ సారిక

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందనున్న రెండో సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ప్రతిభావంతుడైన యువ కథానాయకుడు సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ సరసన హీరోయిన్‌గా నయన్ సారిక నటిస్తుంది. ఆయ్, క వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించిన ఈమె పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ నిర్మించిన జీ5 వారి హలో వరల్డ్ సోనీ లివ్ వారి బెంచ్ లైఫ్ వంటి వెబ్ సిరీస్‌ల్లో ద్వారా తెలుగుకి పరిచయం అయ్యారు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శీను, సుఖ్వీందర్ సింగ్, అరుణ భిక్షు తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా.. సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి దర్శకురాలిగా పని చేశారు. తాజాగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ రూపొందించనున్న ఈ సినిమాతో మానస శర్మ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా ఆంగేట్రం చేస్తున్నారు. ఇక సంగీత్ శోభన్ విషయానికి వస్తే 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో ప్రధాన పాత్రలో నటించారు.



## పోలీస్ వారి హెచ్చరిక టీజర్ ఆవిష్కరించిన సుధీర్ బాబు

అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ నిర్మాతగా తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంలో రూపొందిన చిత్రం' పోలీస్ వారి హెచ్చరిక' టీజర్ ను తన కార్యాలయంలో హీరో సుధీర్ బాబు ఆవిష్కరించారు. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్‌గా పనిచేయగా గజ్వేల్ వేణు ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ సందర్భంగా నవ దళపతి సుధీర్ బాబు మాట్లాడుతూ... 'దర్శకుడు బాబ్జీ మా మామగారైన సూపర్ స్టార్ కృష్ణకి బాగా దగ్గరి వాడు. దేశ వ్యాప్తంగా ఉన్న కృష్ణ అభిమానులందరికీ సుపరిచితుడు. అటువంటి బాబ్జీ దర్శకత్వం లో రూపొందిన ఈ చిత్రం టీజర్ ను నా చేతుల మీదుగా ఆవిష్కరించడం నాకు సంతోషాన్ని కలిగించిందని అన్నారు.

## విజయ్ మేకింగ్ అంటే చాలా ఇష్టం

### 'మార్గన్' ప్రీ రిలీజ్‌లో సురేష్ బాబు



విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన 'మార్గన్' చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిస్తున్నారు. ఈ సినిమాను జూన్ 27న సురేష్ బాబు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మార్గన్ ప్రీ రిలీజ్ లైవ్ ఇంటరాగేషన్ కార్యక్రమంలో సురేష్ బాబు మాట్లాడుతూ 'విజయ్ ఆంటోని నేను ఎప్పటి నుంచో ఫాలో అవుతున్నాను. మ్యూజిక్ డైరెక్టర్ నుంచి హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా ఆయన ప్రయాణాన్ని చూస్తూ ఉన్నాను. ఆయనకు సినిమా పట్ల చాలా ప్యాషన్ ఉంది. నేను అలాంటి వారు తీసే చిత్రాల్ని చూసేందుకు ఇష్టపడుతుంటాను. అందుకే నేను 'మార్గన్' మూవీని తీసుకుని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను. ఆయన ప్రొడక్షన్ కంపెనీ, వాల్యూ, మేకింగ్ అన్నీ కూడా నాకు చాలా ఇష్టం' అని అన్నారు.

## 'నేను రెడీ' గ్లింప్స్ ఆవిష్కరణ



నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న హీరో హవీష్. సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబినేషన్‌లో రూపొందుతున్న 'నేను రెడీ'. ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్ పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న 'నేను రెడీ' మూవీ టైటిల్, గ్లింప్స్‌ను హీరో హనీష్ బర్త్ డే సందర్భంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నటి జయవాణి మాట్లాడుతూ 'నేను రెడీ' సినిమాలో ఇంపార్టెంట్ రోల్ చేశాను. చాలా రోజుల తర్వాత నాకు ఇలాంటి ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ దక్కింది అని అన్నారు. నటి రూప లక్ష్మి మాట్లాడుతూ మంచి క్యారెక్టర్స్ చేసినప్పుడు ఆర్టిస్టులకు ఎంతో సంతృప్తి దక్కుతుంది. అలాంటి అవకాశం నేను రెడీ చిత్రంతో నాకు దక్కింది. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు మేమంతా హ్యాపీగా ఫీలయ్యాం. ఇదే సంతోషం థియేటర్స్‌లో ప్రేక్షకులకూ అందించబోతున్నాం అన్నారు.

## 'కానిస్టేబుల్ కనకం' కథను దొంగిలించారు



వర్ష బొల్లమ్మ టైటిల్ రోల్‌లో నటించిన వెబ్ సిరీస్ 'కానిస్టేబుల్ కనకం'. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో కోవెలమూడి సత్య సాయిబాబా, వేటూరి హేమంత్ కుమార్ నిర్మించారు. రాజీవ్ కనకాల, మేఘ లేఖ, రమణ భార్గవ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో దర్శకుడు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతు కానిస్టేబుల్ కనకం వెబ్ సిరీస్‌ని అందరం చాలా కష్టపడి చేశాం. ఈ మధ్యకాలంలో ఇదే కథతో వేరే ఓటీటీ సంస్థ నిర్మించిన ఒక ట్రైలర్ బయటకు వచ్చింది. అది చూసి మేము షాక్ అయ్యాము. న్యాయస్థానాన్ని ఆశ్రయించాము. కోర్టులో కేసు నడుస్తోంది. నిజానికి ఇలాంటి పరిస్థితి వస్తుందని మేము ఊహించలేదు. చాలా బాధగా ఉంది. ఒక దర్శక, రచయితగా కథని ఎంతో మందికి చెప్తాను. ఈ క్రమంలో ఒక సంస్థకి కథ చెప్పడం జరిగింది. అన్ని మెయిల్స్ రూపంలో వాళ్లకి పంపడం జరిగింది. కొంత వర్క్ అయిన తర్వాత వాళ్లు వద్దనుకున్నారు. తర్వాత నేను మరో ప్రయత్నం చేసుకున్నాను. అలా ఈటీవీ విన్‌లోకి వచ్చాను. ఇక్కడ ప్రాజెక్టు సెట్స్‌పైకి తీసుకెళ్ళాం. ఇప్పుడు అదే కథతో ఆ సంస్థ నుంచి సిరీస్ ట్రైలర్ కనిపిస్తుంది. మా దగ్గర అన్ని ఆధారాలు వున్నాయి. ఈ విషయంలో మేము న్యాయ పోరాటం చేస్తున్నాం'అన్నారు.

## జూలై 25న మహావతార్ నరసింహ



భారతీయ సినిమా రంగాన్ని పాన్ ఇండియా స్థాయిలో అదరగొడుతున్న హోంబలే ఫిలిమ్స్, భారీ బడ్జెట్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించే ఈ సంస్థ, ఇప్పుడు క్లీమ్ ప్రొడక్షన్స్‌తో మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ అనే గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రారంభించనుంది. ఇది భారతీయ పురాణాలను ఆధారంగా చేసుకుని లార్డ్ విష్ణు దశావతారాలను యానిమేషన్‌తో తెరకెక్కిస్తున్నారు. మహావతార్ యూనివర్స్ 12 సంవత్సరాల ప్లానింగ్‌తో ప్రారంభమవుతుంది. ఈ పయనం మొదటి అడుగు మహావతార్ నరసింహ రూపంలో, జూలై 25వ తేదీన 3డి ఫార్మాట్‌లో, భారతదేశంలోని ఐదు ప్రధాన భాషలలో విడుదల కానుంది.



## 'తమ్ముడు' కోసం స్వీట్స్ తిని లావయ్యా

### లయ

'సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న సినిమా 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో నటి లయ టాలీవుడ్ లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. 'తమ్ముడు' సినిమా జూలై 4న విడుదల సందర్భంగా నటి లయ మీడియా తో చిట్ చాట్ చేశారు. నేను 2023 ఫిబ్రవరిలో ఇండియాకు వచ్చాను. జూన్‌లో 'తమ్ముడు' మూవీ టీమ్ నుంచి కాల్ వచ్చింది. నేను తీసుకున్న కొన్ని ఫొటోస్ పంపిస్తే, వాటిలో ఈ క్యారెక్టర్‌కు సెట్ అయ్యేలా కనిపించలేదు. దాంతో మళ్లీ ఫొటోషూట్ చేసి పంపమన్నారు. ఆ ఫొటోస్ చూసి నన్ను సెలెక్ట్ చేసుకున్నారు. అప్పటికి లైన్‌గా 'తమ్ముడు' కథ తెలుసు. నా రీ ఎంట్రీకి ఇది సరైన సినిమా అనిపించింది. క్యారెక్టర్ కోసం కొంచెం లావు కావాలని చెప్పారు. స్వీట్స్ తిని బరువు పెరిగాను. ఈ మూవీ కోసం కొన్ని నెలల పాటు ఇక్కడే ఉన్నాను. 'తమ్ముడు' మూవీలో ఝాన్సీ కిరణ్మయి అనే క్యారెక్టర్‌లో నటించాను. తనొక ఆఫీసర్. స్ట్రిక్ట్‌గా ఉంటుంది. కుటుంబాన్ని చూసుకుంటూనే, ఆఫీసర్‌గా నా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాను. హీరో నితిన్ కు సోదరి పాత్ర నాది. ఈ చిత్రం కోసం అడవిలో షూటింగ్ చేశాం. రోజూ యూనిట్‌లో ఎవరో ఒకరికి గాయాలు అయ్యేవి. షూటింగ్ పిక్నిక్ లా చేశామని చెబుతుంటారు. కానీ మేము పిక్నిక్ లా చేయలేదు. కష్టపడాల్సి వచ్చింది. మూవీ బాగా వస్తుందనే సంతోషంలో అంతా యూనిటీగా పనిచేశాం. ఈ సినిమా షూటింగ్ కాదని ఎవరూ ఎక్కడికీ వెళ్లలేదు. చాలా డెడికేటెడ్‌గా వర్క్ చేశాం. నితిన్ తో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. తను స్టార్ హీరో అయినా చిన్న పిల్లాడిలా మా అందరితో కలిసిపోయారు. పర్ ఫార్మెన్స్ పరంగా చూస్తే ఈ సినిమాలో నితిన్ చాలా మెచ్యూర్డ్‌గా కనిపిస్తాడు. చాలా కష్టమైన సీన్స్ కూడా ఈజీగా చేశాడు. సీన్స్ కోసం చేసిన ప్రిపరేషన్ వల్లే అంత సులువుగా నటించగలిగారు. తమ్ముడు అనే టైటిల్ ఈ సినిమాకు యాప్ట్. మీరు సినిమా చూశాక చెబుతారు. పవన్ కల్యాణ్ తమ్ముడు మూవీకి ఈ చిత్రానికి పోలిక లేదు. నేను గతంలో సినిమాల్లో నటించినప్పటికి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయి. ప్రమోషన్ విషయం తీసుకుంటే అప్పుడు ఆడియో ఫంక్షన్, థియేటర్ విజిటింగ్, 100 డేస్ ఫంక్షన్ ఉండేది. ఇప్పుడు చాలా ఈవెంట్స్ చేస్తున్నారు. తమ్ముడు మూవీకి చేసిన ఈవెంట్స్‌కు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వస్తున్నారు. నేను హీరోయిన్ గా నటించినప్పుడు కూడా సింపుల్ గానే ఉన్నాను. ఒక స్టార్ హీరోయిన్‌గా కాకుండా ప్రేమించులో మీనాగా, మిస్సమ్మలో రత్నమాలగానే ప్రేక్షకులు నన్ను చూశారు. అందుకే ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్నప్పుడు సెట్‌లో ఆ తేడా తెలియడం లేదు. ఈ సినిమా కోసం ఇండియా రావాలనుకున్నప్పుడే అక్కడ యూఎస్‌లో జాబ్ మానేశాను. అవకాశాలు కోరుకున్నప్పుడు రావు. అందుకే ఇండస్ట్రీలో వచ్చిన అవకాశం వదులుకోకూడదని వచ్చేశా.

---

## అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన..

### ఎనిమిది చోట్ల అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్

### ఫైర్ డిజి వై.నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ అగ్నిమాపక శాఖ నడ్డుం భిగించింది. అగ్నిమాపక శాఖ డిజి వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు గురువారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఎనిమిది ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. షేక్‌పేటలోని స్కై హై హర్ష డౌలపర్స్, సికింద్రాబాద్‌లోని చందనా బ్రదర్స్, కొత్తగూడలోని ఆధిత్య సైన్‌షైన్, లింగోజిగూడలోని మాదవరం సెరెన్టీ రెసిడెట్స్ అపార్ట్‌మెంట్స్, ఇబ్రహీంపట్నంలోని టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ కంపెనీ, కాప్రాలోని రాధిక మల్టిప్లెక్స్, జీడిమెట్లలోని గ్రాన్‌లెస్ ఇండియా, పోచ్చంపల్లిలోని డిఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రజల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వై.నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా బహుళ అంతస్థుల భవనాలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకుంటే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఒకవేళ్ల అనుకోకుండా జరిగే ప్రమాదాల తీవ్రతను కూడా తగ్గించవచ్చని ఆయన అన్నారు.

## ఎపియుడబ్ల్యుజె నూతన కమిటీ

### అధ్యక్షులుగా ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కంచల జయరాజ్



ఐ.వి.సుబ్బారావు



జయరాజ్

**ఒంగోలు :** ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులుగా ఐ.వి.సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అమరావతికి చెందిన కంచల జయరాజ్ ఎన్నికయ్యారు. గత మూడు రోజులుగా ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని మహాసభల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

**రెండు వర్గాలుగా మీడియా: కె.రామకృష్ణ**



ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికారంగానిది కీలక పాత్ర అని, అటువంటి పత్రిక రంగం ప్రస్తుతం దేశవ్యాప్తంగా కార్పొరేట్ల చేతుల్లో బందీగా ఉందని సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఒంగోలులోని విష్ణుప్రియ కన్వెన్షన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర మహాసభల్లో గురువారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సైతం పత్రికలు ఎంతో కీలకపాత్ర పోషించాయన్నారు. అయితే ప్రస్తుతం అనేక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు కార్పొరేట్ల ఆధీనంలో ఉండి వారికి అనుకూలమైన రాజకీయ పార్టీల కోసం పని చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మీడియా రెండు వర్గాలుగా విడిపోయిందని, ఇది ఎంతో బాధాకరమని అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ఎంతో విస్తరించిందని, అయితే పత్రికారంగా మనుగడకు ఇది ఎంత మాత్రం ఆటంకం కాదని రామకృష్ణ పేర్కొన్నారు.

## హైదరాబాద్ అభివృద్ధిలో 'హెచ్-సిటీ' గేమ్ చేంజర్

### బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరాభివృద్ధిలో 'హెచ్ సిటీ' ప్రాజెక్ట్ గేమ్ చేంజర్ అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. దేశంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్ గా నగరాన్ని అభివృద్ధి చేయాలనే సిఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి ఇది దిక్సూచిగా మారుతుందన్నారు. 'హెచ్ సిటీ' ప్రాజెక్ట్‌లో భాగంగా రూ.45 కోట్లతో ఎన్‌హెచ్ 65 నుంచి అమీన్ పూర్ వరకు చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనులకు గురువారం ఆయన చందానగర్ లో శంకుస్థాపన చేశారు. 'హైదరాబాద్ నగరాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. బడ్జెట్‌లో రూ.10వేల కోట్లకు పైగా నిధులు కేటాయించాం. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు, నగరాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రూ.7032 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకే హెచ్‌సిటీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం' అని మంత్రి వివరించారు. 'ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రహదారి నెట్‌వర్క్‌ను మెరుగుపరచడం, పర్యావరణ హితంగా నగరాన్ని అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యాలు. రోజురోజుకీ పెరుగుతున్న జనాభాతో నగరం పై పడుతున్న ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది. నగరవాసులకు సౌకర్యమంతమైన నాణ్యమైన జీవన శైలి అందుతుంది' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'ఇప్పటికే నగరంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో వేయి ఎలక్ట్రిక్ బస్సులను నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించాం. వాటికి అదనంగా మరో 800 బస్సులను తీసుకురావాలని సిఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఇందుకు కేంద్రం సైతం సహకరించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు కీలక ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాదచారుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం' అని ఆయన చెప్పారు. 'హైదరాబాద్ అభివృద్ధిని ఒక్క ప్రాంతానికే పరిమితం చేయకుండా నలువైపులకు విస్తరిస్తాం. మాపై కొందరూ పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. మంచి చేయాలని సంకల్పిస్తే హెచ్ సీయూ భూముల విషయంలో వారేం చేశారో మీరంతా గమనించారు. మా లక్ష్యం.. ధ్యేయం ఒక్కటే అభివృద్ధి. మీకోసం పనిచేసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి.. సహకరించండి' అని మంత్రి శ్రీధర్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు మంజుల, రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధు

### 272 మంది భారతీయులు, ముగ్గురు నేపాలీయులు ఇరాన్ నుండి తరలింపు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధు కార్యక్రమంలో భాగంగా యుద్ధ ప్రాంతం ఇరాన్ నుండి 272 మంది భారతీయులను, ముగ్గురు నేపాలీ దేశీయులను అక్కడి నుండి తరలించింది. ఒక ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వీరంతా గత అర్ధ రాత్రి తరలివచ్చారు. ఇరాన్ నగరం మష్హాద్ నుండి వీరిని కేంద్రం తరలించింది. ఆపరేషన్ సింధులో భాగంగా ఇప్పటివరకూ 3,426 మంది భారతీయులను, నలుగురు నేపాలీ దేశీయులను ఇరాన్ నుండి తరలించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఎక్స్ వేదికగా తెలియజేసింది. బుధవారంనాడు కేంద్రం 296 మంది భారతీయులను, నలుగురు నేపాలీయులను ఇరాన్ నుండి తరలించింది. ముందురోజు మంగళవారంనాడు 1100 మందిని ఇరాన్, ఇజ్రాయెల్‌ల నుండి తరలించింది. ఇజ్రాయెల్ నుండి 594 మందిని కేంద్రం భారత్‌కు తరలించింది. భారత వైమానిక దళానికి చెందిన సి–17 భారీ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఇందుకోసం ఉపయోగించింది. వీరిలో 400 మందిని భూమార్గంలో ఇజ్రాయెల్ నుండి జోర్డాన్, ఈజిప్టులకు తరలించింది. అక్కడి నుండి వీరిని తీసుకువచ్చింది. అదేవిధంగా 161 మంది భారతీయులు ఛార్టర్డ్ విమానంలో అమ్మన్ నుండి వచ్చారు. మొదట వారిని జోర్డాన్ రాజధానికి ఇజ్రాయెల్ నుండి రహదారిమార్గంలో తరలించారు.

## త్వరితగతిన పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

భూములను రైతులు సహకరించి అప్పజెప్పినట్లయితే కాల్వ పనులు వేగవంతం చేసి రిజర్వాయర్ ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. గత డిసెంబర్ 7న ముఖ్యమంత్రి రిజర్వాయర్ కింద భూములకు సాగునీరు అందించారని, ప్రస్తుతం పానగల్ ఉదయ సముద్రం నుండి నీటిని వెల్లెంల ప్రాజెక్టుకు నింపుతున్నారని వెల్లడించారు. దీనితో పూర్తిస్థాయిలో 960 క్యూసెక్కుల నీటితో కళకళలాడనుంది. ఇప్పటివరకు 1800 ఎకరాల భూసేకరణ మిగిలిపోవడంతో కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నదని, రైతులు త్వరితగతిన భూములు అప్పజెప్పినట్లాయితే ప్రాజెక్టు అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని ఆయన తెలిపారు. భూములు అప్పజెప్పిన రైతులకు చెల్లింపులలో జాప్యం చెయొద్దని జిల్లా అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఉదయసముద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి శ్రీనివాస్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుబత్తుల ఉషయ్య, నార్కట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు జెరిపోతుల భరత్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## సిబిఐకి అప్పగించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మాత్రం వారు చేసిన తప్పును వారే దర్యాప్తు చేస్తే న్యాయం జరగదన్నారు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తే న్యాయం జరగదని కాంగ్రెస్‌లో ఉన్న వారు కూడా అంటున్నందున బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలంటే రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసును అప్పగించాలన్నారు. మొదటి నుంచి ట్యాపింగ్ కేసును సీబీఐకి కాంగ్రెస్ ఇస్తుందా ? ఇవ్వదా ? అనే అనుమానంతో బీజేపీ హైకోర్టుకు వెళ్లిందని ఎవ్వరిని వదలకుండా చేసిన ట్యాపింగ్ కేసు సాధారణమైనది కాదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు సిబిఐకి కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్యక్రమాలకు కేంద్రంగా నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఇతర రాష్ట్రాలో కోరిన మోడీ నిజామాబాద్ లోనే ఏర్పాటు చేయడం ఇక్కడి రైతులకు అందించిన బహుమతి అని, జిల్లాకు చెందిన రైతు బిడ్డ అయిన గంగారెడ్డిని చైర్మన్ చేయడం మరో విశేషమన్నారు. ఈనెల 29న హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభం ఘనంగా నిర్వహించనున్నామన్నారు. రైతులతో జిల్లా కేంద్రం నిండిపోనుతందని, రైతులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున రావలని విజ్ఞప్తి చేశారు. పసుపు శుభకార్యక్రమాలకే కాకుండా శాస్త్రీయంగా ఆరోగ్య ప్రధాయనిగా ఉందని గుర్తు చేశారు. బోర్డు ద్వారా రైతులకు ప్రయోజనం కలగనుందని, దేశంలో పసుపు ఉత్పత్తి పెరిగేలా ఉపాధి పెరిగేలా రైతులకు ప్రయోజనం కలిగేలా బోర్డు కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. మాజీ మంత్రి డిఎస్ విగ్రహాన్ని కూడా అమిత్‌షా నిజామాబాద్‌లో 29న ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పసుపు బోర్డు కార్యాలయాన్ని సందర్శించారు.

## విషపురుగులు! (మొదటి పేజీ తరువాయి)

తరచుగా పాములు, విషపురుగులు తిరుగుతున్నాయి. ఈ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సుమారు 200 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. శిథిలావస్థలో ఉన్న ఈ రెండు బిల్డింగులు గతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, జూనియర్ కళాశాలకు ఉపయుక్తంగా ఉండేవి. 1997లో చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక బిసి కాలనీలో నిర్మాణం చేశారు. అంతకు ముందు ఉదయం పూట జడ్పీ స్కూల్, మధ్యాహ్నం జూనియర్ కళాశాల నిర్వహించే వారు. ఆ భవనాలు శిథిలావస్థలో ఉండడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలకు నూతన భవనాలు నిర్మించారు. గతంలోని సముదాయ భవనం స్థలం ఖాళీగా ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య చొరవతో షెడ్యూల్ కులాల సమీకృత హాస్టల్‌కు అనుమతులు లభించాయి. అప్పటి ఎన్నికల కోడ్‌తో నిర్మాణ పనులు ఆగాయి. తదుపరి బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్మాణం పూర్తయ్యింది. ఆ తర్వాత అందులోనే బిసి, ఎస్సీ విద్యార్థులను మిలితం చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించినప్పటికీ శిథిలావస్థలో ఉన్న రెండు బిల్డింగులను తొలగించకుండా అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతేడాది జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చొప్పదండిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించి భవన సముదాయాన్ని పరిశీలించారు. సంబంధిత హాస్టల్‌లోని పాత శిథిలావస్థలో ఉన్న గదులను కూల్చివేయాలని ఆదేశించారు. ఆ స్థలాన్ని చదును చేసి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. కాగా విషయంలో మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోకపోగా కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసినట్లు స్పష్టమవుతోంది. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను హాస్టల్‌లో చేర్పించేందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక విషపురుగులు తిరుగుతుండడంతో అటు హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అసలే వానాకాలంలో విషసర్పాలతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సంఘటనలున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ తీసుకుని వందలాది మంది విద్యార్థులున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో గల శిథిలాస్థలో ఉన్న భవనాలను తొలగించేలా ఉన్నతాధికారులను ఆదేశించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత హాస్టల్ వార్డెన్ సత్యనారాయణను వివరణ కోరగా హాస్టల్‌లో నిత్యం పాములు, తేళ్లు, విష పురుగులు వస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, హాస్టల్ సముదాయంలో శిథిలావస్థలో ఉన్న భవనాలకు విష సర్పాలు కేంద్రంగా ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

### నిధులు రావాల్సి ఉంది

**మున్సిపల్ కమిషనర్ కె.నాగరాజు**

సంబంధిత శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు అంచనాలు వేసి నివేదికలు పంపడం జరిగింది. నిధులు రాగానే ఆ భవనాలను కూల్చివేయడం జరుగుతుంది.

### శిథిలావస్థ భవనాలు తొలగించాలి

**మచ్చరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

చొప్పదండి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నిత్యం విషపురుగులు తిరుగుతుండడంతో విద్యార్థులు భయాందోళలనకు గురవుతున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత శిథిలావస్థ భవనాలు తొలగించి విష పురుగులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. నిధులు విడుదల చేసి హాస్టల్‌ను అభివృద్ధి చేయాలి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com